ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శనివారం 14.11.2026 | సంపుటి:13 సంచిక:114 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం

బస్సు,ట్రక్కు ఢీకొని 23 మంది మృతి

గహౌతి(జనంసాక్షి):
అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రఖ్యాత కాజీరంగా నేషనల్ పార్క్ సమీపంలో ఓ మిన్నీ బస్సు, కంటైనర్ ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పలువురు విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. బోకాఖాత్ నుంచి

మిగతా 2లో..



ఆర్మీ వాహనం బోల్తా..

- 8 మంది జవాన్లకు తీవ్రగాయాలు
- రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల మండలం అల్లవాడ సమీపంలో ఈ ఘటన

5లో

భారత్ సమిట్‌పై గుడ్డివ్యతిరేకత వద్దు

విపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు

- బీజేపీని వ్యతిరేకిస్తే దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదు
- కాంగ్రెస్ పార్టీ భారతదేశ ఆత్మ.. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ చరిత్రలో కాంగ్రెస్ భాగస్వామ్యం
- రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధిని చూడాలి
- భారత్ సమ్మిట్‌తో ప్రపంచానికి తెలంగాణ పెట్టుబడుల అనుకూల రాష్ట్రంగా పరిచయం చేస్తాం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- గిగ్ వర్కర్స్ చట్టం రేపటి నుంచి అమలు..
- రాహుల్ చేతుల మీదుగా ప్రారంభిస్తాం
- బీజేపీ, బీఆర్ఎస్ తెలంగాణ ప్రయోజనాలను వ్యతిరేకిస్తున్నాయి
- కేంద్రం ఆహ్వానించిన వారికి అనుమతులు నిరాకరించడం సమంజసం కాదు
- కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను తెలంగాణ లెక్కల్లో లేనివారిగా భావిస్తున్నాం
- మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ

హైదరాబాద్(జనంసాక్షి):
బీజేపీని వ్యతిరేకించడం దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదని, కాంగ్రెస్ పార్టీ భారతదేశ ఆత్మ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ చరిత్రలో కాంగ్రెస్ పార్టీ కీలక భాగస్వామిగా ఉందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధిని చూడాలని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయ విభేదాలను పక్కన పెట్టాలని ఆయన సూచించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో పాటు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. నవంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. భారత్ సమ్మిట్ ద్వారా తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందనే విషయాన్ని ప్రపంచానికి చాటడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇప్పటికే ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించామని, ముంబై, అహ్మదాబాద్‌లలోనూ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివిధ రంగాల్లో, వివిధ హోదాల్లో ఉన్న ప్రముఖులను సమ్మిట్‌కు ఆహ్వానించామని, వారు హైదరాబాద్‌ను ప్రత్యక్షంగా సందర్శించి రాష్ట్ర పారిశ్రామిక విధానాలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చే ప్రతి అతిథి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా మారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రయోజనాలను వ్యతిరేకిస్తున్నారు

మిగతా 2లో..



ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టినా బీఆర్ఎస్, బీజేపీలు వ్యతిరేకిస్తున్నారు. మోదీ ఏది చేసినా కరెక్టే, రాహుల్ గాంధీ ఏది చేసినా తప్పు అనేలా వ్యవహరిస్తున్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లను వ్యతిరేకించారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. భారత్ సమిట్‌పై కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, కేసీఆర్‌కు ఎందుకు కోపమో అర్థం కావట్లేదు. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నామని భాజపా నేతలు విమర్శిస్తున్నారు. వాతావరణ మార్పులు, మౌలికసౌకర్యాలు, పెట్టుబడులపై సమిట్‌లో చర్చిస్తున్నాం. తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించడమే భారత్ సమిట్ లక్ష్యం. తెలంగాణ, హైదరాబాద్‌ను చూపించడం ద్వారా నమ్మకం కలిగించాలని ప్రయత్నిస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల పాలసీని శనివారం నుంచి అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. గిగ్ వర్కర్ల సమక్షంలో పాలసీ అంకితం చేయాలని రాహుల్‌ను ఆహ్వానించాం. రాహుల్‌గాంధీ భారత్ సమిట్ ముగింపు సందేశం ఇస్తారు.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రధాని నా ఫోన్ ట్యాప్ చేయిస్తున్నారు

ఆధారాలతో ముఖాముఖీ చర్చకు సిద్ధం: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన మొబైల్‌ను ట్యాప్ చేయిస్తున్నారని.. దీనికి సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా శుక్రవారం నిర్వహించిన 'ఆస్క్ మి' కార్యక్రమంలో రాహుల్ పాల్గొన్నా రు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. తన ఫోన్‌ను పైకి ఎత్తి చూపిస్తూ.. ట్యాపింగ్ జరిగినట్లు ఇందులో ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఈ అంశంపై ప్రధానితో బహిరంగ చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ముఖా ముఖి చర్చ జరిగినప్పుడే ఎవరు దేశ ద్రోహో, ఎవరు విదేశీయుల నియంత్రణలో ఉన్నారో అర్థమవుతుందని రాహుల్ అన్నారు.రాహుల్ గాంధీ మూడేళ్ల క్రితం కూడా ఈ తరహా ఆరోపణలు చేశారు. తనతోపాటు పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లను పెగాసస్ స్పైవేర్ సాయంతో కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు ట్యాపిం గ్ చేస్తున్నాయన్నారు. అయితే, రాహుల్ ఆరోపణలను అప్పట్లో కేంద్రం కొట్టిపారేసిం ది. ఇదే అంశాన్ని శుక్రవారం ఆయన మరోసారి లేవనెత్తారు.

చర్చ జరిగితే ప్రధాని పదవిలో కొనసాగలేరు

ముఖాముఖి చర్చ జరిగితే ప్రధాని మోదీ.. ఆ పదవిలో కొనసాగలేరని రాహుల్ అన్నారు. పార్లమెంటులో చర్చించడానికి అవకాశం ఉన్నప్పటికీ మోదీతో బహిరంగ చర్చ ఎందుకు కోరుతున్నారనే ప్రశ్నకు సమాధానంగా.. లోక్‌సభలో వ్యవసాయ చట్టాలు, ఓటు చోరీ, సర్ (ఎస్ఐఆర్), చైనా, జనరల్ నరవణె పుస్తకం, ఎప్‌స్టీన్ అంశాలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. సుదీర్ఘ ప్రసంగాలు కాకుండా, ఇద్దరు రాజకీయ నేతలు కూర్చొని మాట్లాడుకునేలా, తమ వాదనలు వినిపించేలా చర్చ జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చర్చకు అదాని గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదాని లేదా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ లను న్యాయ నిర్ణేతలుగా నియమించినా తనకు అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు.

భారత్‌లో ఫోన్ ట్యాపింగ్ అనేది కఠోర వాస్తవం

రాహుల్ ఆరోపణలను సమర్థించిన ప్రశాంత్ కిశోర్



2లో



పక్కాగా 'ఇందిరమ్మ బీమా' అమలు చేయాలి

ప్రతీ కుటుంబం వివరాలు నమోదు చేయాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి) :
తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లిపెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీలి తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దేశంలోనే వినూత్నమైనదని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని తెలిపారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా తెలంగాణలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించనున్నట్లు తెలిపారు.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని, అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా పథకం అమల్లోకి వస్తుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నవంబర్ 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నుంచి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో నిర్వహించిన తాజా కులగణన సర్వే ద్వారా కుటుంబాలకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.


ప్రతి గ్రామం, పట్టణ వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలు :

నవంబర్ 19న ప్రతి గ్రామంలో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి కుటుంబాల వివరాలు సేకరించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామాలు, మండలాలు, డివిజన్లు, పట్టణ వార్డుల స్థాయిలో నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి పథకం

మిగతా 2లో..

పాక్ గూఢచారి వలపు వలలో

భారత వాయుసేన అధికారి



దేశ రహస్యాలను శత్రువుల చేతికి అందించిన వింగ్‌కమాండర్

న్యూఢిల్లీ(జనంసాక్షి): పాక్ గూఢచారి వలపు వలలో చిక్కుకున్న భారత వాయుసేన అధికారి ఒకరు.. దేశ రహస్యాలను శత్రువుల చేతికి అందజేశారు. ఆ అమ్మాయి నగ్న చిత్రాల కోసం యుద్ధ ప్రణాళికలు, సైనిక మోహరింపు సమాచారాన్ని బేరం పెట్టారు. కొన్ని నెలల క్రితం ఆ అధికారిని అరెస్టు చేసిన దిల్లీ పోలీసులు తాజాగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. భారత వాయుసేనలో వింగ్ కమాండర్‌గా పనిచేస్తున్న ఆ అధికారికి.. ఆన్‌లైన్‌లో సదరు గూఢచారితో పరిచయం ఏర్పడింది. ఈ ఏడాది జనవరి 12 నుంచి ఏప్రిల్ 1 వరకు వీరు వాట్సప్‌లో సంభాషణలు సాగించారు. దాదాపు 3000లకు పైగా టెక్స్ట్ సందేశాలు, 65 ఫొటోలు పంపించుకున్నారు. వీరి మధ్య 42 వాయిస్ కాల్స్, నాలుగు వీడియో కాల్స్ ఉన్నాయి. ఆరు యూఆర్ఎల్స్‌ను కూడా షేర్ చేసుకున్నారు. మన డ్రోన్ సామర్థ్యాలు, సీక్రెట్ డ్రోన్ యూనిట్, సైనిక స్థావరాలు ఉన్న


మిగతా 2లో..


ఆర్ఏసీ రద్దు?

యోచనలో రైల్వే శాఖ

న్యూఢిల్లీ(జనంసాక్షి):రైల్వే ప్రయాణికులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో రిజర్వేషన్ అగైనెస్ట్ క్యాన్సిలేషన్ ఒకటి. పూర్తి స్థాయిలో టికెట్ ధర చెల్లించినా.. చాలీ చాలని సీటులో కూర్చుని ప్రయాణం చేయాల్సిందే. ఒకసారి ప్లాన్ చేసుకున్నాక వాయిదా వేసుకోలేని పరిస్థితుల్లో చాలా మంది అలానే ప్రయాణిస్తుంటారు. ఏళ్లుగా ఉన్న ఈ సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. దీన్ని రద్దు చేయాలని రైల్వే శాఖ భావిస్తోంది.సాధారణంగా రైళ్లలో బెర్తులు తగినన్ని అందుబాటులో లేనప్పుడు ఆర్ఏసీ కోటాలో సీట్లు కేటాయిస్తుంటారు. పూర్తిస్థాయిలో టికెట్ కన్ఫార్మ్ కానప్పటికీ.. రైళ్లలో ప్రయాణానికి అనుమతిస్తారు. ఒక సైడ్ బెర్త్‌ను ఇద్దరికి కేటాయిస్తుంటారు. పొర పాటున స్త్రీ, పురుషులకు ఒకే బెర్త్ కేటాయింపు జరిగినప్పుడు.. సర్దుబాటు

మిగతా 2లో..





చైనాలో 'సరోగసీ'పై నిషేధం

బీజింగ్(జనంసాక్షి):
సంతాన సాఫల్య కేంద్రాల పేరుతో అక్రమంగా పునరుత్పత్తి సేవలు అందిస్తున్నట్లు నివేదికలు రావడంతో చైనా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై సరోగసీని నేరంగా పరిగణించనున్నట్లు వెల్లడించింది. అన్ని రకాల సరోగసీ ప్రక్రియలపై పూర్తి స్థాయి నిషేధం విధిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎవరైనా ఈ

మిగతా 2లో..

మా వల్లే ప్రపంచ యోగా దినోత్సవం

భారత్‌లో విజ్ఞానం, ఆధ్యాత్మికత కలిసికట్టుగా ముందుకు సాగుతాయి: ప్రధాని మోదీ



బెంగళూరు(జనంసాక్షి): భారత్ చొరవతోనే నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా పాపులర్ అయిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం బెంగళూరులోని స్వామి వివేకానందా యోగా అనుసంధాన్ సంస్థాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రశాంతి కుటీరంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాల్లో పర్యటించే సమయాల్లో చాలా మంది తన వద్ద యోగా ప్రస్తావన తీసుకొచ్చినట్లు వెల్లడించారు. చాలా రాజకుటుంబాలు యోగా కోసం కృషి చేశాయని కొనియాడారు. భారత్‌ను అర్థం చేసుకోవడానికి ఇది ఒక మార్గమని పేర్కొన్నారు. ఈ నగరంలో తనకు అద్భుతమైన యోగాను ఆస్వాదించే అవకాశం లభించిందని కొనియాడారు.

దేశాభివృద్ధికి డెడ్‌లైన్ 2047

భారత్ చొరవతోనే ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేను ఏ దేశానికి వెళ్లినా.. అక్కడ లంచ్ లేదా డిన్నర్ సమయంలో చర్చలో ప్రజలు ఈ విషయాన్ని తీసుకొస్తారు"

మిగతా 2లో..



మహిళలకు ఏసీ బస్సుల్లోనూ రాయితీ

మహిళా ప్రయాణికులకు మరో ఆఫర్ ప్రకటించిన టీజీఎస్ఆర్టీసీ..

హైదరాబాద్(జనంసాక్షి):పల్లెవెలుగు, ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పి స్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాజా గా మరో ఆఫర్ ప్రకటించింది. ఏసీ బస్సుల్లో రాయి తీ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.

వివరాలు 12వ పేజీలో..

కూకట్‌పల్లి భూముల వేలాన్ని అడ్డుకుంటాం



హైదరాబాద్(జనంసాక్షి):నగరంలోని కూకట్‌పల్లిలో ట్రక్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నెల 27న ట్రక్ పార్క్ భూముల వేలం నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఈ నిరసన చేపట్టాయి. వేలాన్ని విరమించుకోవాలని నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ట్రక్ పార్క్ స్థలాన్ని హరీశ్‌రావు,

మిగతా 2లో..

మన 'బ్రహ్మోస్'కు ఫుల్ గిరాకీ



సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణుల కోసంగోలుకు ఆగ్నేయాసియా దేశాల ఆసక్తి

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆపరేషన్ సిందూర్ సమయంలో శత్రు స్థావరాలను నేలమట్టం చేసిన.. భారత సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ తన సేవలను ఆగ్నేయాసియా దేశాలకు విస్తరిస్తోంది. బ్రహ్మోస్

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14.11.2026

అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం

నాగావ్ వెళ్తున్న మినీ బస్సు.. పార్క్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది ప్రమాద తీవ్రతకు మినీ బస్సు నుజ్జునుజ్జయ్యింది. దీంతో చాలా మంది ప్రయాణికులు అందులో చిక్కుకుని మరణించారు. సమాచారం అందుకున్న అస్సాం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో ఎంతమంది ఉన్నారనే దానిపై స్పష్టతలేదు.ఘటనాస్థలంలోనే 15 మంది ప్రాణాలు కోల్పోగా.. ఆసుపత్రికి తరలించేలోపే మరికొందరు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్యపై ఇంకా స్పష్టమైన సమాచారం రాలేదు. నిబంధనలను ఉల్లంఘించి పార్క్ సమీపంలో బస్సు అతి వేగంతో వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ట్రక్కును ఢీకొట్టి ఉంటాడని భావిస్తున్నారు.



భారత్ సమిట్‌పై గుడ్డివ్యతిరేకత వద్దు

తెలంగాణ ప్రజలకు అనుకూలంగా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని సీఎం విమర్శించారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, తుమ్మిడిహట్టి వంటి అంశాల్లోనూ ఇదే వైఖరి ప్రదర్శిస్తున్నాయని అన్నారు. వారు వ్యతిరేకించేది కాంగ్రెస్ పార్టీని కాదని, తెలంగాణ ప్రజల ప్రయోజనాలనేనని వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి, రాంచందర్ రావు, కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.గిగ్ వర్కర్లకు ప్రత్యేక చట్టంగిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని శనివారం నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రాహుల్ గాంధీ చేతుల మీదుగా గిగ్ వర్కర్స్ పాలసీ అమలును ప్రారంభించనున్నామని తెలిపారు. భారత్ సమ్మిట్ ముగింపు సందేశం ఇచ్చేందుకు రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వానికి గిగ్ వర్కర్లను ఆదుకునే ఆలోచన లేదని విమర్శించారు.రాహుల్ పర్యటనపై బీజేపీ విమర్శలెం దుకు?ప్రధాని మోదీ విదేశాలకు వెళ్లి ప్రసంగాలు చేసినప్పుడు స్వాగతించే బీజేపీ నాయకులు, రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తుంటే విమర్శలు చేయడం ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని వ్యతిరేకించడం బీజేపీ వైఖరిని తెలియజే స్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని అభిప్రాయాలకూ స్థానం ఉంటుందని, ప్రపంచ శాంతి కోసం చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఆహ్వానించిన వారికి అనుమతులు నిరాకరించడం ఏమిటి?భారత్ సమ్మిట్‌కు ఆహ్వానించిన కొంతమందికి తొలుత అనుమతులు ఇచ్చిన కేంద్రం, ఆ తర్వాత నిరాకరిం చిందని సీఎం తెలిపారు. ఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానించినా హాజరు కాలేదని, ఎల్‌నినోపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించినా రాలేదని చెప్పారు. అందుకే కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను తెలంగాణ లెక్కల్లో లేనివారిగా భావిస్తున్నామని వ్యాఖ్యానించారు.రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ప్రజల మనసుల్లో ఉన్నారని, విమర్శలు చేసినంత మాత్రాన వారి ప్రతిష్ఠ తగ్గదని సీఎం అన్నారు. బీజేపీని వ్యతిరేకించడం భారతదేశాన్ని వ్యతిరేకించినట్లు కాదని పునరుద్ఘాటిం చారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి కాంగ్రెస్ పార్టీ దేశ చరిత్రలో భాగంగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు విజ్ఞతతో వ్యవహరించాలని, రాజకీయ విభేదాలను తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు అడ్డంకిగా మార్చవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

భారత్‌లో ఫోన్ ట్యాపింగ్ అనేది కఠోర వాస్తవం

రాహుల్ గాంధీ ఆరోపణలను సమర్థించిన ప్రశాంత్ కిశోర్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారతదేశంలో ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందనేది వాస్తవమేనని జన్ సురాజ్ పార్టీ ఫౌండర్ ప్రశాంత్ కిశోర్ అన్నారు.దేశంలో ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందన్నది కాదనలేని వాస్తవమని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్నేళ్ల కిందట దేశంలో తీవ్ర దుమారం రేపిన 'పెగాసస్' నిఘా వివాదం వెలుగులోకి వచ్చిన సమయంలో, తన ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందని ఆయన వెల్లడించారు. ఆ సమయంలో తాను పోల్ స్ట్రాటజిస్ట్‌గా ఉన్నట్లు గుర్తుచేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ప్రశాంత్ కిశోర్ శుక్రవారం రోజు ఇలా స్పందించారు."ఫోన్లు కచ్చితంగా ట్యాప్ అవుతున్నాయి. ఇది కొంత కాలంగా జరుగుతూనే ఉంది. ప్రజలు తెలుసుకోవాల్సిన చేదు నిజం ఇది. ఇజ్రాయెల్‌లో అభివృద్ధి చేసిన స్పైవేర్ పెగాసస్ ద్వారా నిఘా పెట్టినట్లు వార్తలు వచ్చినప్పుడు ఆ టార్గెట్ల జాబితాలో నా పేరు కూడా ఉండటంతో నా ఫోన్ కూడా ట్యాప్ అవుతోందన్న విషయం నాకు అప్పుడు తెలిసింది." అని అన్నారు

ఆర్ఏసీ రద్దు..?

చేయడానికి టీటీఈలు కూడా నానా తంటాలు పడుతుంటారు. ఇదే అంశాన్ని పార్లమెంటరీ ప్యానెల్ లేవనెత్తింది. అరకొర ప్రయాణం చేసినా పూర్తి టికెట్ ధరను వసూలు చేయడంలో హేతుబద్ధతను ప్రశ్నించింది. ఈ రిజర్వేషన్ పద్ధతిని సమీక్షించాలని రైల్వే శాఖకు సూచించింది. ఈ నేపథ్యంలో ఆర్ఏసీ విధానాన్ని రద్దు చేసే అంశాన్ని భారతీయ రైల్వే పరిశీలిస్తున్నట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతానికి దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

ఎలా వచ్చింది?

రైల్వే రిజర్వేషన్ టికెట్లు ఒకప్పుడు మాన్యువల్‌గా జరిగేవి. దీంతో ఎవరైనా టికెట్ రద్దు చేసుకుంటే ఆ బెర్తు ఖాళీగా ఉండేది. దీంతో ఆర్ఏసీ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఒకవేళ ఎవరైనా టికెట్ రద్దు చేసుకుంటే ఆ బెర్తు కేటాయించేవారు. అప్పట్లో ఈ టికెట్ క్యాన్సిలేషన్లను ట్రాక్ చేయడానికి ఎలక్ట్రానిక్ వ్యవస్థ లేని రోజుల్లో వచ్చిన ఆర్ఏసీ.. ఏళ్లుగా అలానే ఉండిపోయింది.

కూకట్‌పల్లి భూముల వేలాన్ని అడ్డుకుంటాం

నేతలు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. భూముల వేలాన్ని అడ్డుకుంటామని హరీశ్‌రావు వారికి భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజలు ఏమైపోయినా భూములు అమ్మడమే తమ పని అన్నట్లుగా సీఎం రేవంత్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. "కాప్రా, అమీన్‌పూర్‌లో భూములు కూడా విక్రయిస్తున్నారు. రేవంత్‌రెడ్డి పాలన కాదు.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. వెతికి వెతికి మరీ భూములు అమ్ముతున్నారు. రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా మాట్లాడుతున్నారు. భూముల వేలంలో ఎవరు పాల్గొన్నా ఊరుకునేది లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. భూ అనుమతులను రద్దు చేస్తాం" అని హరీశ్‌రావు అన్నారు.

పాక్ గూఢచారి వలపు వలలో భారత వాయుసేన అధికారి

వివరాలు, ఘర్షణల వేళ ముందుగా మోహరించే యుద్ధ విమానాలు, ఉద్రిక్తతల సమయంలో సైనికులను మోహరించే ప్రాంతాలు వంటి సున్నితమైన సమాచారాన్ని ఆ అధికారి పాక్ గూఢచారితో పంచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.ఓసారి ఆ గూఢచారి నగ్న చిత్రాన్ని పంపితే.. సదరు అధికారి సీక్రెట్ వార్ ప్లాన్‌కు సంబంధించిన పేజీని ఆమెకు షేర్ చేసినట్లు పోలీసులు ఛార్జ్‌షీట్‌లో వెల్లడించారు. అంతేకాదు.. ప్రతి నగ్న ఫొటోకు యుద్ధ ప్రణాళికకు సంబంధించిన ఒక కొత్త పేజీని పంపిస్తానని అధికారి చెప్పినట్లు పేర్కొన్నారు. ఇక, పాక్ గూఢచారి పంపించిన ఓ మాల్వేర్ యాప్‌ను తన కింద పనిచేసే సబ్‌ఆర్డినేట్ డివైజ్‌లలోనూ ఇన్‌స్టాల్ చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. లేహ్‌లోని యుద్ధ విమానాల మోహరింపు, సూరత్‌గఢ్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద మిలిటరీ విన్యాసాల గురించిన సమాచారాన్ని కూడా ఐఏఎఫ్ అధికారి షేర్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ అధికారి నిర్వాకం మే నెలలోనే బయటపడింది. ఓసారి ఆఫీసుకు స్మార్ట్‌ఫోన్ తీసుకొచ్చిన అతడిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అప్పుడు అనుమానం వచ్చిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు సదరు వింగ్ కమాండర్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో మే 30న ఢిల్లీ పోలీసులు అతడిని అరెస్టు చేసి తీహాడ్ జైలుకు తరలించారు. అనంతరం దర్యాప్తు చేపట్టి తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాగా బంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఇటీవల హౌరాలో ఒక పాకిస్థానీ గూఢచారిని అరెస్టు చేసింది. నిందితుడిని రాణా రౌఫ్ (అలియాస్ వహాబ్)గా గుర్తించింది. భారతీయ రైల్వే, సైన్యం, నౌకాదళానికి సంబంధించిన పలు రహస్య వివరాలను రాణా లీక్ చేశాడని దర్యాప్తు అధికారులు ఆరోపిస్తున్నారు. నేపాల్ సరిహద్దు ద్వారా రాణా భారత్?లోకి ప్రవేశించినట్లు కూడా వెల్లడైంది. కోల్‌కతాకు చేరుకున్న తర్వాత, అతను టాప్సియా ప్రాంతంలో నివసించాడు. ఇటీవల ఏదో పని మీద హౌరాకు వెళ్లినప్పుడు అతడు పట్టుబడ్డాడు. తన గుర్తింపును దాచిపెట్టి, ఒక కల్పిత చిరునామాను ఉపయోగిస్తూ టాప్సియా ప్రాంతంలో నివసిస్తున్నాడని దర్యాప్తు అధికారులు తెలిపారు.

చైనాలో 'సరోగసీ'పై నిషేధం

తరహా సేవలు అందిస్తే కఠిన చర్యలు తప్పవని నేషనల్ హెల్త్ కమిషన్ అధికార ప్రతినిధి యాంగ్ జిన్‌రుయ్ వెల్లడించారు. పునరుత్పత్తి కేంద్రాల నిర్వహణకు ఇకపై ఎలాంటి చట్టబద్ధత ఉండదని స్పష్టం చేశారు.చైనాలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో జనాభాను పెంచుకునేందుకు ఆ దేశం ఇప్పటికే చర్యలు చేపట్టింది. పిల్లలు కనడాన్ని ప్రోత్సహిస్తూ అనేక పథకాలను అమలు చేస్తోంది. అయితే, అక్రమ పద్ధతిలో పిల్లల్ని కనడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సరోగసీ విధానంపై 2001లోనే నిషేధం విధించింది. అయినా, పూర్తి స్థాయిలో అది అమల్లోకి రాలేదు. మరోవైపు, ఈ తరహా ప్రక్రియల వల్ల మహిళల ఆరోగ్య పరిస్థితి ఆందోళ నకరంగా మారుతోందని, మహిళల హక్కులకు భంగం వాటిల్లుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మహిళలను పిల్లల్ని కనే యంత్రాల్లా చూస్తున్నారన్న విమర్శలూ వచ్చాయి.

పక్కాగా 'ఇందిరమ్మ బీమా' అమలు

సమాచారం చేరేలా చూడాలన్నారు. నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. పంచాయతీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు.కుటుంబ పెద్ద తమ కుటుంబానికి సంబంధించిన నామినీ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, ఒకరు లేదా ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ప్రతిపాదించవచ్చని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, కుటుంబానికి సంబంధించిన జీవిత బీమా కవరేజీ కోసం 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుల వివరాలను కచ్చితంగా సేకరించాలని సూచించారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణి కంగా తీసుకోవాలని తెలిపారు.దరఖాస్తులో జిల్లా, మండలం, గ్రామం లేదా వార్డు వివరాలతో పాటు బీమా పొందే వ్యక్తి పేరు, తండ్రి లేదా భర్త పేరు, లింగం, ఆధార్ ప్రకారం పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ నమోదు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల పేర్లు, వారి ఆధార్ నంబర్లు కూడా సేకరించాలన్నారు.నామినీ పేరు, సంబంధం, ఆధార్ వివరాలతో పాటు ఒకరి కంటే ఎక్కువ మంది నామి నీలుగా ఉంటే వారికి కేటాయించే వాటా వివరాలను నమోదు చేయాలని తెలిపారు. నామినీ మైనర్ అయితే వారి సంరక్షకుడు లేదా ప్రతినిధి వివరాలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. దరఖాస్తుపై దరఖాస్తుదారుడితో పాటు వివరాలను పరిశీలించిన అధికారి సంతకం ఉండాలని స్పష్టం చేశారు.

మా వల్లే ప్రపంచ యోగా దినోత్సవం

అని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో దీనికి సంబంధించి చాలా మంది గురువులు ఉన్నారని గుర్తు చేశారు. కన్నడ స్టార్ దివంగత రాజ్‌కుమార్ కూడా దీనిని సాధన చేసేవారన్నారు. ఈ సందర్భంగా గోల్డెన్ జూబ్లీ బ్లాక్ భవనానికి, కేరళంలో సంస్థ సరికొత్త క్యాంపస్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.భారతదేశంలో సైన్స్ (విజ్ఞానం), ఆధ్యాత్మికత ఒకదానితో ఒకటి కలిసికట్టుగా ముందుకు సాగుతాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నేటి భారతీయ యువత ఖగోళ శాస్త్రం (ఆస్ట్రోఫిజిక్స్), సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని కొనియాడారు. చాముండి కొండల దిగువన ఉన్న మైసూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో భారతదేశంలోనే మొట్టమొదటి ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియం కాస్మోస్–మైసూరును ప్రారంభించిన మోదీ అనంతరం ప్రసంగించారు. ఈ క్రమంలోనే దేశంలో విజ్ఞాన శాస్త్రాన్ని ప్రోత్సహించడానికి మైసూరు రాజకుటుంబం చేసిన కృషిని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. మైసూర్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడమే కాకుండా, బెంగళూరులోని అత్యంత ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఏర్పాటు కోసం భూమిని దానం చేయడం ద్వారా దేశంలో శాస్త్రీయ అభివృద్ధికి బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయాల్ని కూడా మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. చంద్రయాన్– 3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. గతేడాది భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. "భారతదేశంలో ఆధ్యాత్మికత, సైన్స్ ఎప్పుడూ కలిసే నడుస్తాయి. ఆధునిక పరికరాలు ఏవీ అందుబాటులో లేని కాలంలోనే మన పూర్వీకులు విశ్వాన్ని, గ్రహాల కదలికలను ఎంతో నిశితంగా అధ్యయనం చేశారు. విశ్వంలో ఎన్నో రహస్యాలను ఛేదించడానికి మన ఖగోళ శాస్త్రవేత్తలు ఎంతో సంక్లిష్టమైన గణిత లెక్కలను ఎంతో సులభంగా పూర్తి చేశారు."అని అన్నారు కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధాని భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు పెద్దపీట వేస్తూ శుక్రవారం రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ నిర్మించిన ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియంను ప్రారం భించారు. దీనిని ఖగోళ విజ్ఞానంపై విద్య, పరిశోధన, శిక్షణకు కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈ ప్లానిటోరియం ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ప్రజల్లో ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంచడానికి ఇది ఒక అద్భుతమైన పరిశోధన, శిక్షణా కేంద్రంగా ఉపయోగపడుతుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు

ఆ 'కిల్ స్విచ్' భారత్ చేతిలోనే ఉండాలి: సునీల్ మిత్తల్

న్యూఢిల్లీ:భారత్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవల ఎంట్రీ విషయంలో ఇటీవల స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే. తాజాగా భారతీ ఎయిర్‌టెల్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సునీల్ మిత్తల్ ఈ వ్యవహారంపై పరోక్షంగా స్పందించారు. భారత శాటిలైట్ కమ్యూనికేషన్ల 'కిల్ స్విచ్ సొంత గడ్డపైనే ఉండాలని అభిప్రాయపడ్డారు. తమ అంతరిక్ష భవిష్యత్తుపై భారత్‌కు నియంత్రణ ఉండాలని పేర్కొన్నారు. భారతీ ఎంటర్‌ప్రైజెస్ 50వ వార్షికోత్సవం సందర్భంగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సునీల్ మిత్తల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "శాటిలైట్ ఆపరేటర్ల అనుమతులకు సంబంధించి ప్రభుత్వ పరిశీలన సమర్థించదగినదే. ఎందుకంటే ఇప్పుడు ఆధునిక యుద్ధాలు అంతరిక్షం వరకూ వ్యాపిస్తున్నాయి. డ్రోన్లు, సైబర్ సమస్యలు, గైడెడ్ మిస్సైళ్లు ఇలా ప్రతిదాన్నీ అంతరిక్షం నుంచి నియంత్రించే పరిస్థితి వచ్చింది. ఇక ప్రపంచంలో ప్రతిదేశానికి తమ భద్రతపై నియంత్రణ ఉండటం అత్యవసరం. అందువల్ల ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ల 'కిల్ స్విచ్' భారత్ వద్దే ఉండాలి. ఎక్కడో విదేశాల్లో ఉంటే (మస్క్ కంపెనీని పరోక్షంగా ఉద్దేశిస్తూ) సమస్యలు వస్తాయి" అని సునీల్ మిత్తల్ అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. భారత్ ఒకే సర్వీసు ప్రొవైడర్‌పై ఆధారపడకూడదని, ఈ సేవల కోసం విభిన్న ప్రొవైడర్లు అవసరమని భావిస్తున్నట్లు చెప్పారు.

ఏంటీ కిల్ స్విచ్..

సాంకేతిక పరిభాషలో కిల్ స్విచ్ అంటే.. శాటిలైట్ నెట్‌వర్క్ సేవను పూర్తిగా నిలిపివేయడానికి, దాని వేగాన్ని తగ్గించడానికి లేదా పరిమితం చేయడానికి ఉపయోగపడే సామర్థ్యం. దీన్ని ఆ శాటిలైట్ నెట్‌వర్క్‌ను నిర్వహించే ఆపరేటర్ తన కంట్రోల్ సిస్టమ్స్, గ్రౌండ్ గేట్‌వేల ద్వారా నియంత్రిస్తారు. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్‌లో.. వినియోగదారుల టెర్మినల్స్ ఉపగ్రహాలకు కనెక్ట్ అవుతాయి. ఈ శాటిలైట్‌లు డేటాను గ్రౌండ్ స్టేషన్లకు పంపిస్తాయి. అక్కడి నుంచి అది ఇంటర్నెట్‌కు చేరుతుంది.అందువల్ల, ఈ కంట్రోల్ సిస్టమ్స్, గ్రౌండ్ గేట్‌వేలను ఎవరు నిర్వహిస్తారో.. వారికి సేవలపై పూర్తి నియంత్రణ లభిస్తుంది. వినియోగదారుల సేవను నిలిపివేయడం, పరిమితం చేయడం లేదా వారి డేటా వెళ్లే మార్గాన్ని మార్చడం సాంకేతికంగా సాధ్యమవుతుంది.

మన 'బ్రహ్మోస్'కు భలే గిరాకి..

క్షిపణులను ఫిలిప్పీన్స్ ఇప్పటికే కొనుగోలు చేయగా.. వియత్నాం కొనుగోలు ఒప్పందంపై సంతకాలు చేసింది. మరికొన్ని దేశాలు కూడా భారత్ నుంచి క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నట్లు బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈవో అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జై తీర్థ్ ఆర్ జోషి వెల్లడించారు. ఆయా దేశాలతో చర్చలు తుది దశకు చేరుకున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే.. తదుపరి కార్యాచరణ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఢిల్లీలో నవంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న నాన్ డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ అండ్ ఎనేబులింగ్ టెక్నాలజీస్ (ఎన్‌డీఈ –2026) 36వ వార్షిక సదస్సును పురస్కరించుకొని ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోస్ క్షిపణులను పరీక్షించడంలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఎన్‌డీటీ) కృషిని అభినందించారు. క్షిపణి పనితీరును నిర్ధరించడంలో ఎన్‌డీటీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అందులోని విడి భాగాలకు ఏమాత్రం నష్టం వాటిల్లకుండా క్షిపణి పని తీరును పరీక్షించడమే ఎన్‌డీటీ ముఖ్యవిధి అన్నారు. బ్రహ్మోస్ క్షిపణులను భారత్ దాదాపు 20 ఏళ్ల క్రితమే అభివృద్ధి చేసిందని, ఊహించని పరిస్థితుల్లో వాటిని ఆపరేషన్ సిందూర్‌లో ప్రయోగించడంతో వాటి శక్తి ప్రపంచానికి తెలిసిందని జోషి తెలిపారు. ఎన్‌డీఈ –2026 సదస్సుకు 2 వేల మందికి పైగా నిపుణుల, పరిశోధకులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు హాజరవుతారని అంచనా. విదేశాల నుంచి దాదాపు 100 మందికి పైగా ప్రముఖులు పాల్గొననున్నారు. రూ.3 వేల కోట్లకుపైగా విలువైన ఒప్పందాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
ఫారం-VI
(ప్రాథమిక నోటిఫికేషన్)
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013)
(కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1)రూల్ (19) సబ్‌సెక్షన్ (1) అనుసరించి

నెం.జి1/782/2021 తేది : 07-11-2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం, 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11 (1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఖానంపల్లి గ్రామ పరిధిలో ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన (31.14 1/2) ఎకరముల పట్టా/ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనార్థం అనగా "ధర్మారం మండలం ఖానంపల్లి గ్రామ సమీపంలో స్థానిక వాగు మీదుగా కొత్త ట్యాంక్ ఏర్పాటు కొరకు అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారు భావిస్తున్నారు. భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం, 2013 (చట్టం 30/2013) సెక్షన్ 6(2) మరియు 10ఎ ననుసరించి మినహాయింపు, చాప్టర్ -II లోని సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు చాప్టర్ -III లోని ఆహార భద్రత మరియు పరిరక్షణ వంటి అంశములు తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 14, ఇరిగేషన్ & సిఎడి (ఎల్ఎ) డిపార్ట్‌మెంట్, తేది :25.04.2022 క్రమము వర్తించవు

ఈ ప్రాజెక్ట్ భూసేకరణ పనులను చేపట్టుటకు గాను జి.ఓ.ఎంఎస్ నెం.139, రెవెన్యూ (జెఎ & ఎల్ఎ) డిపార్ట్‌మెంట్, తేది : 20.08.2015 ప్రకారము జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారు లేఖా నెం.జి1/782/2021, తేది : 31.07.2026 ద్వారా భూసేకరణ అధికారిగా రాజస్వ మండలాధికారి,పెద్దపల్లి గారిని నియమించినారు.

43వ సెక్షన్ ననుసరించి జి.ఓ.ఎంఎస్ నెం.50 రెవెన్యూ (జెఎ& ఎల్ఎ) డిపార్ట్‌మెంట్ తేది :19.12.2014 క్రమము ప్రాజెక్ట్ పాలనాధికారిగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గారిని జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారి ఉత్తర్వు నెంబర్ నెం.జి1/782/2021 తేది :02.11.2026 ద్వారా నియమించడం జరిగింది.

షెడ్యూల్

గ్రామం : ఖానంపల్లి మండలం : ధర్మారం జిల్లా : పెద్దపల్లి

సర్వే నెం.	భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం	భూ వర్గీకరణ	భూమి రకం	పహాణి క్రమము పట్టా దారుని పేరు	అనుభవదారు యొక్క పేరు	విస్తీర్ణం	ఇతర వివరములు (బావులు, నిర్మాణములు, చెట్లు వగైరా)
19/1/1				దీటి రాజయ్య తండ్రి మల్లయ్య	దీటి రాజయ్య తండ్రి మల్లయ్య	0.34	2-వేప చెట్లు 1-బావి 1-పైప్‌లైన్
19/1/2	2.19	ఖుష్కి	పట్టా	పుప్పాల శ్రీనివాస్ తండ్రి లచ్చయ్య	పుప్పాల శ్రీనివాస్ తండ్రి లచ్చయ్య	1.24	2-వేప చెట్లు 1-బావి 1-పైప్‌లైన్
19/2				-	బండ్లబాట	0.01	-
21ఎ	8.13	ఖుష్కి	పట్టా	కోమటి రెడ్డి ఎల్లారెడ్డి తండ్రి రాంరెడ్డి	కోమటి రెడ్డి ఎల్లారెడ్డి తండ్రి రాంరెడ్డి	4.06	4-వేప చెట్లు, 1-వేపచెట్టు, 3-తుమ్మ చెట్లు 1-బావి 1-పైప్‌లైన్
21బి				కనుమల్ల లింగయ్య తండ్రి పోచయ్య	కనుమల్ల లింగయ్య తండ్రి పోచయ్య	0.20	-
21సి/1				కొండ రాజయ్య తండ్రి లింగయ్య	-	0.07	-
21సి/2				కొండ రామయ్య తండ్రి లింగయ్య	కొండ రామయ్య తండ్రి లింగయ్య	0.0650	-
21సి/3				కొండ రాయలింగు తండ్రి లింగయ్య	కొండ లక్ష్మి తండ్రి రాయలింగు	0.0650	-
21డి				రెడపాక నర్సయ్య తండ్రి దుర్గయ్య	రెడపాక నర్సయ్య తండ్రి దుర్గయ్య	0.20	-
					భీమన్న చెరువు	2.27	-
22	0.27	ఖుష్కి	కె.కె	ఖరాజు ఖాతా	ఖరాజు ఖాతా	0.27	-
23/1	5.10	ఖుష్కి	పట్టా	కోమటి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి	కోమటి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి	2.25	51-బేకు చెట్లు 10-వేప చెట్లు 1-తుమ్మ చెట్లు 1-తాటి చెట్లు
23/2				కోమటి రెడ్డి నందిరెడ్డి తండ్రి మల్లారెడ్డి	కోమటి రెడ్డి నందిరెడ్డి తండ్రి మల్లారెడ్డి	2.25	51-బేకు చెట్లు 10-వేప చెట్లు 1-తుమ్మ చెట్లు 1-తాటి చెట్లు
24/1	02.15	ఖుష్కి	పట్టా	సిరిగాజ నర్సయ్య తండ్రి హన్మయ్య	సిరిగాజ నర్సయ్య తండ్రి హన్మయ్య	1.02	5-బేకు చెట్లు 8-వేప చెట్లు 1-తాటి చెట్లు
24/2				రాపెల్లి భూమయ్య తండ్రి రామయ్య	రాపెల్లి భూమయ్య తండ్రి రామయ్య	1.02	5-బేకు చెట్లు 8-వేప చెట్లు 1-తాటి చెట్లు
					బండ్లబాట	0.11	-
26	00.265	ఖుష్కి	పి.పి	ఫారెస్ట్	ప్రభుత్వ భూమి	0.2650	-
322	11.34	ఖుష్కి	పి.పి	ఫారెస్ట్	ప్రభుత్వ భూమి	11.34	-
మొత్తం	31.2450					31.2450	

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్, పెద్దపల్లి గారు, రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దపల్లి మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్, పెద్దపల్లి గారి అనుమతి లేకుండా షెడ్యూల్ లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియ చేయడమైనది.

సదరు చట్టములోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏమైనా అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న ఎడల సంబంధిత వ్యక్తులు రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దపల్లి గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు (60) రోజులలోపు చేసుకోవచ్చును.

భూ యజమానులు, ఆసక్తి గల వ్యక్తులు వారి భూనష్టపరిహారము మరియు ఆర్ & ఆర్ ఏంటైటిల్‌మెంట్స్ (R & R Entitlements) సంప్రదింపుల ద్వారా పరిష్కారం చేయదలుచుకుంటే వారు తమ అభ్యర్థనలు ఫారం E1 మరియు E2 (జి.ఓ.ఎంఎస్ నెం.120, రెవెన్యూ (జెఎ & ఎల్ఎ)డిపార్ట్‌మెంట్, తేది:30.06.2017) ద్వారా ఎప్పుడైనా సమర్పించవచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దపల్లి
సం/- అదనపు కలెక్టర్, పెద్దపల్లి
సం/- కలెక్టర్, పెద్దపల్లి

DIPR RO. No.1128/LA/PP/Advt/Pub/2026-27

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబ గద్వాల జిల్లా
ఫారం-6
ప్రాథమిక ప్రకటన
భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

లేఖ సంఖ్య బి2/83/2024 తేది :17.10.2026

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలము జిల్లెడుబండ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూలులో ఉదహరించిన ఎ.0.225 సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా Distributary-12 Canal (Additional Land) Package No.105 నిమిత్తము జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా సేకరించవలసిన అవసరము ఉన్నదని జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టం 2016 (యాక్ట్ నెం.21/2017) సెక్షన్ 10ఎ క్రింద మినహాయింపు ఇచ్చియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్ట్‌కు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధములో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

షెడ్యూలు

క్ర సం.	సర్వే నెం./ ఎస్.డి. నెం.	పట్టా / ఇనాం మొ॥	భూ సేకరణ మెట్ట/ అరుతడి/ తరి	భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు	పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏమైనా హక్కులు గల యితర వ్యక్తులు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు వివరాలు	చెట్ల సంఖ్య	నిర్మాణములు వర్గము	విస్తీర్ణము
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	152	పట్టా	మెట్ట	0.225	1)కుర్వ జయన్న తండ్రి సవారన్న 2)కుర్వ వెంకటన్న తండ్రి చిన్న సవరన్న 3)కుర్వ సత్యన్న తండ్రి కుర్వ లక్ష్మన్న 4)కుర్వ రామకృష్ణ తండ్రి కుర్వ హనుమంతు 5)కె.నాగార్జున తండ్రి కుర్వ హనుమంతు 6)కుర్వ మహేశ్వరి భర్త కుర్వగోపాల్ 7)కుర్వ లక్ష్మి భర్త కుర్వ జయన్న 8)కుర్వ పద్మ భర్త కుర్వ కృష్ణయ్య 9)హరిజన్ వెంకట్రాములు తండ్రి సవరన్న 10)హరిజన్ లక్ష్మన్న తండ్రి సవరన్న 11)కె.రాముడు తండ్రి కుర్వ చిన్న నాగన్న 12)ఇరిగేషన్ ప్రాజెక్ట్ **అనుభవదారులు** 1)హరిజన్ గోవిందమ్మ భర్త లేట్ సవరన్న	-	-	-	-	-	-	-	-
			విస్తీర్ణము	0.225									

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోనిసెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా, ప్రత్యేక ఉపకలెక్టర్, జె.ఎల్.ఐ.పి.,గద్వాల మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికార మివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలో సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్ గారి అనుమతి లేకుండా షెడ్యూల్ లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైనా లావాదేవీలు జరుపరాదని తెలియజేయడ మైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టర్,జె.ఎల్.ఐ.పి.,గద్వాల, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గద్వాల
సం/- అదనపు కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా
సం/- కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO No.1146/LA/PP/Advt/Pub/2026-27

యువ మహిళా క్రికెటర్ ఆత్మహత్య



వికారాబాద్ (జనంసాక్షి) : తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జాతీయ స్థాయిలో రాణించాలనే కలలతో ఇటీవలే బీసీసీఐ అండర్-19 జట్టుకు ఎంపికైన యువ మహిళా క్రికెటర్ నందిని (17) బలవన్మరణానికి పాల్పడింది. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె కుటుంబం, క్రీడా వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం సంగయ్యపల్లి గ్రామానికి చెందిన నందిని వికారాబాద్ పట్టణంలో ఉంటూ క్రికెట్ కోచింగ్ తీసుకుంటోంది. తన ప్రతిభతో ఇటీవలే బీసీసీఐ అండర్-19 జట్టుకు ఎంపికై, ఉన్నత శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోంది. అయితే.. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆమె అకస్మాత్తుగా ఉరేసుకుని ప్రాణాలు తీసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. నందిని ఆత్మహత్యకు ఇద్దరు యువ కుల వేధింపులే ప్రధాన కారణమని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. కొంత కాలంగా వారి వేధింపులు భరించలేకనే తీవ్ర మనస్తాపానికి గురై నందిని ఈ కఠిన నిర్ణయం తీసుకుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధితుల ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, వేధింపులకు పాల్పడినట్లు చెబుతున్న ఇద్దరు యువకుల వివరాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

కన్నకొడుకు కర్కశత్వం

- ఆస్తి కోసం వృద్ధ తల్లిదండ్రులపై దాడి
- తండ్రికి పక్షవాతం, తల్లికి బ్రెయిన్ స్ట్రోక్

రంగారెడ్డి, నవంబర్ 13 (జనంసాక్షి): కన్న పేగులను కాపాడాల్సిన చేతులే, ఆస్తి కోసం అంతులేని క్షోభను మిగులుస్తున్నాయి. పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమైన వృద్ధ తల్లిదండ్రులపై.. మద్యం మత్తులో ఉన్న కన్నకొడుకే కసితీరా దాడికి పాల్పడిన అమానుష ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిభట్ల ఎస్ఐ సుందరయ్య కథనం మేరకు వివరాలు.. ఆదిబట్లకు చెందిన కుక్కల యాదిరెడ్డి (70), సువర్ణ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. యాదిరెడ్డి పక్షవాతంతో, ఆయన భార్య బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. వీరికి ముగ్గురు సంతానం. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి కుమారుడు కుక్కల వెంకటేశ్వర్ రెడ్డి నిత్యం మద్యం తాగి, డబ్బుల కోసం వృద్ధ తల్లిదండ్రులను వేధిస్తూ దాడికి పాల్పడుతున్నాడు. గతంలో 2023లోనూ బెదిరించి బలవంతంగా వారి భూమికి సంబంధించి గిఫ్ట్ డీడ్ రాయించుకున్నాడు. కాగా, నవంబర్ 8న సాయంత్రం ఇంటికి వచ్చిన నిందితుడు ఆస్తులన్నీ తన పేరున మార్చాలని బెదిరించాడు. వృద్ధ తండ్రిని కర్రతో ఛాతిపై కొట్టి గాయపరిచడమే కాకుండా, బీరువాలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. మళ్లీ నవంబర్ 9న ఉదయం ఇంటికి వచ్చి బూతులు తిడుతూ, అసలు ఆస్తి పత్రాలను లాక్కెళ్లాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. నిందితుడిపై గతంలోనూ క్రిమినల్ కేసులు ఉన్నాయని, ప్రాణభయంతో వృద్ధ దంపతులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. బాధితుడు కుక్కల యాదిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుందరయ్య తెలిపారు.

ఎరువుల సబ్సిడీని 64 శాతం పెంపుపై హర్షం

- కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం
- తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి హర్షం



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రస్తుత 2026 - 27 రవి సీజన్ కు సంబంధించి ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపై సబ్సిడీని 64 శాతం పెంచుతూ ఏకంగా రూ. 62.370 కోట్లు కేటాయించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల తెలంగాణ రైతు ఐక్యవేదిక ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో ఎరువులు, వాటి తయారీకి వాడే ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రైతులపై ఆ భారం పడకుండా ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని పెంచుతూ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకోవడం అభినందనీయమనీ తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ సాగు పంటల ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్న ప్రస్తుత తరుణంలో సబ్సిడీని పెంచుతూ తీసుకున్న ఈ నిర్ణయం అన్నదాతలకు ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. రబీ సీజన్ వ్యవసాయ సాగు పంటలు ముమ్మరంగా సాగుతున్న ప్రస్తుత తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల తెలంగాణ రైతాంగానికి పెట్టుబడి భారం తగ్గి, వ్యవసాయ పంటల దిగుబడి పెరిగేందుకు ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెంచిన సబ్సిడీ ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు అందేలా చూడాలని, ఎరువుల కొరత రాకుండా కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటూ సకాలంలో రైతులకు ఎరువులు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ ఆహార భద్రతకు వెన్నెముక్కైన అన్నదాతలకు అండగా నిలిచి రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, సకాలంలో ఎరువుల సబ్సిడీని పెంచిన కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతాంగం తరపున తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

- బ్లాక్‌స్పాట్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి: కలెక్టర్, ఎస్పీ



నిర్మల్ బ్యూరో, నవంబర్ 13 (జనంసాక్షి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ డా. జి. జానకి షర్మిల సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అక్రమ పార్కింగ్, రోడ్డు ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, హెల్మెట్ లేకుండా ప్రయాణించేవారు, లైసెన్స్ లేని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగానికి దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట మాధవరావు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భగవద్గీత సమగ్ర జీవన శాస్త్రం : కిషన్ రెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : భగవద్గీత కేవలం ఒక మతానికి సంబంధించిన గ్రంథం కాదని, అది సమగ్ర జీవన శాస్త్రమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. మనిషి జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, భయం, ఆందోళన, అంతర్గత సంఘర్షణలను అధిగమించేందుకు భగవద్గీతలో అద్భుతమైన మార్గదర్శకత్వం ఉందని పేర్కొన్నారు. ఆధునిక న్యూరోసైన్స్ కోణంలో భగవద్గీతలోని తాత్విక అంశాలను విశ్లేషిస్తూ ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీనాథన్ రచించిన 'భగవద్గీత ఇన్ ది లెన్స్ ఆఫ్ న్యూరోసైన్స్' పుస్తకాలు నేటి తరానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. మాదాపూర్‌లోని స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అనారోగ్యంతో ఉన్నప్పటికీ, వైద్యుల సూచనలను సైతం పక్కనపెట్టి రచయితను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వర్చువల్‌గా పుస్తకాలను ఆవిష్కరించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేల సంవత్సరాల నాటి భారతీయ ఆధ్యాత్మిక జ్ఞాన సంపదను ఆధునిక వైద్య పరిజ్ఞానమైన న్యూరోసైన్స్‌తో అనుసంధా నించడం గొప్ప ప్రయత్నమని కిషన్ రెడ్డి ప్రశంసించారు.

పరిహారంతోనే పునరావాసం పూర్తికాదు!

- భూసేకరణ బాధితుల జీవన స్థితిగతులపై పెద్దపల్లి ఇంజినీర్ రష్మి అధ్యయనం
- పరిహారం సద్వినియోగం, ఉపాధి కల్పనకు రెండు కీలక సూచనలు

హైదరాబాద్ (జనంసాక్షి) : కన్నతల్లి.. పుట్టిన నేల.. ప్రతి ఒక్కరికీ ప్రాణంతో సమానం. ఎంత ఎదిగినా సొంత ఊరిపై మమకారం చెరిగిపోదు. అందుకే పారిశ్రామిక అభివృద్ధి, భారీ ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేపట్టడం ప్రభుత్వాలకు సవాలుగా మారుతోంది. అధిక పరిహారం, మెరుగైన పునరావాస సదుపాయాలు కల్పించినా సొంత ఊరును వదులుకోవడానికి చాలామంది ఇష్టపడటం లేదు. ఈ సమస్యకు పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ పెద్దపల్లి జిల్లాకు చెందిన సివిల్ ఇంజినీర్ రష్మి తన బీటెక్ పరిశోధనలో భూసేకరణ, పునరావాసం, బాధిత కుటుంబాల జీవన స్థితిగతులపై లోతైన అధ్యయనం చేశారు.





ప్రభుత్వ ప్రాజెక్టులు, సంస్థలతోపాటు ప్రైవేటు రియల్ ఎస్టేట్ రంగంలో చేపట్టే భూసేకరణ విధానాలను ఆమె పరిశీలించారు. కేవలం నివేదికలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టి మూడు రకాల కుటుంబాలను కలిశారు. పరిహారం, పునరావాసంపై చర్చలు జరుపుతున్న కుటుంబాలు, ఇటీవల పునరావాస కాలనీలకు తరలివెళ్లిన వారు, కొన్నేళ్ల క్రితమే పునరావాసం పొందిన వారి అనుభవాలను తెలుసుకున్నారు.

పరిహారం వచ్చినా.. స్థిరపడని జీవితాలు

భూమికి భారీ పరిహారం అందినంత మాత్రాన బాధిత కుటుంబాల జీవితాల్లో ఆశించిన మార్పు రావడం లేదని రష్మి గుర్తించారు. జీవనోపాధి కోల్పోతామనే భయం, హామీల అమలుపై సందేహాలు వారిని వెంటాడుతున్నాయి. కొందరు పరిహారం మొత్తాన్ని ప్రణాళిక లేకుండా ఖర్చు చేయడంతో స్థిరమైన ఆదాయ వనరులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలు చాలా తక్కువగా ఉన్నాయని అధ్యయనంలో వెల్లడైంది.

గతంలో కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ గౌరవంగా బతికామని, ఇప్పుడు రోజువారీ పనులపై ఆధారపడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఊరిలోని స్నేహ, అనుబంధాలు కొత్త ప్రాంతంలో కల్పించిన సదుపాయాలతో భర్తీ కావడం లేదని తెలిపారు. పునరావాస కాలనీల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హక్కులు, ప్రభుత్వ సహాయంపై కూడా చాలామందికి అవగాహన లేదని రష్మి గుర్తించారు.

పరిహారంతో పాటు ఉపాధి భరోసా

"పరిహారం పొందడం ఒక విషయం.. తిరిగి స్థిరమైన జీవితాన్ని నిర్మించుకోవడం మరో విషయం. పునరావాస ప్రక్రియ పరిహారం చెల్లింపుతో ముగిసిపోకూడదు" అన్నది రష్మి పరిశోధన సారాంశం. భూసేకరణ అనంతరం కూడా సంస్థలు బాధిత కుటుంబాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆమె సూచిస్తున్నారు. ఉపాధి అవకాశాలు, ఆర్థిక భద్రత, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించినప్పుడే పునరావాసానికి సార్థకత చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు.

రష్మి రెండు కీలక ప్రతిపాదనలు

1. అనుభవాల ఆధారంగా అవగాహన : ఇప్పటికే పునరావాసం పొందిన కుటుంబాలతో కొత్తగా తరలివెళ్లనున్న కుటుంబాలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పరిహారాన్ని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకొని స్థిరపడిన వారి అనుభవాలతోపాటు, విచ్చలవిడిగా ఖర్చుచేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితులను వివరించాలి. తద్వారా పరిహారం సద్వినియోగం, భవిష్యత్తు ఆర్థిక ప్రణాళిక, ప్రభుత్వ సహాయం పొందే విధానాలపై అవగాహన కల్పించాలి.

2. నైపుణ్యాభివృద్ధి శిక్షణ : పునరావాసానికి ముందే బాధిత కుటుంబాలకు కొత్త ప్రాంతాల్లోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలి. అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ అందించి స్థిరమైన ఆదాయ మార్గాలు ఏర్పడేలా చర్యలు తీసుకోవాలి. ఈ రెండు విధానాలను అమలు చేసిన కొన్ని సంస్థల్లో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.



ఆర్థిక ఇబ్బందులున్నా పేదల సంక్షేమానికి పెద్దపీట

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లింగాల ఘనపురం, నవంబర్ 13 (జనంసాక్షి) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల భారం ఉన్నప్పటికీ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లింగాల ఘనపూర్ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూ రు చేసిన చేయూత పింఛన్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ లో సన్నబియ్యం పంపిణీ,ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, చేయూత పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తు న్నామని తెలిపారు. ఈ పథకాల కోసం ప్రభుత్వం ఏటా సుమారు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని వెల్లడించారు.గత నాలుగేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఊరటనిచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కేటగిరీల్లో4.50 లక్షల కొత్త పింఛన్ల మంజూ రు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. లింగాల ఘనపూర్ మండలానికి పాత పింఛన్లకు అదనంగా 758 కొత్త పింఛన్లు మంజూరయ్యాయ ని, వీటి ద్వారా నెలకు సుమారు 17 లక్షల మేర లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపా రు. రాష్ట్రంలో మొత్తం 45 లక్షల మందికి పైగా చేయూతపింఛన్లు అందిస్తున్నామని,ఇందుకోసం ఏటా12వేలకోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించా రు. గ్రామాల్లో పింఛన్లకు అర్హత ఉండి దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే సర్పంచులు వెంటనే ఎంపీడీవోకు దరఖాస్తులు అందించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచార ణ జరిపి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరయ్యేలా చర్యలుతీసుకోవాలని కోరారు. భర్తను కోల్పోయిన మహిళలకు వెంటనే వితంతు పింఛను మంజూరు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అధికారులు వాటిని తక్షణమే అమలు చేయాలని స్పష్టం చేశారు.అర్హులైన ఒక్క రూ సంక్షేమ ఫలాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తాసిల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, మండల అధ్యక్షుడు విజయ మనోహర్ ,జనగామ జిల్లాఉపాధ్యక్షు కీసర దిలీప్ రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, గ్రామ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ఈనెల 15 వరకు పోలీసు ఆంక్షలు



శేరిలింగంపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి) : దేశంలోని ప్రముఖ వ్యక్తులు ఈనెల 14 మరియు 15వ తేదీలలో మాదాపూర్ హైటెక్స్ పరిధిలో పర్యటించనున్న నేపథ్యంలో ఈ నెల 13 రాత్రి 7 గంటల నుండి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పోలీసు ఆంక్షలు విధించడం జరిగిందని, కావున పరిసర ప్రాంతాల ప్రజలు వీటిని గమనంలో ఉంచుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు 'భారత్ సమ్మిట్ - 2026' పేరుతో మాదాపూర్ పరిధి హైటెక్స్ లో నిర్వహించనున్న అంతర్జాతీయ అవగాహన సదస్సులో పాల్గొనేందుకు కాంగ్రెస్ కీలక నేత, పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విచ్చేస్తున్న సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం ఈ ప్రాంతంలో కఠినమైన పోలీస్ ఆంక్షలు అమలులో ఉంటాయని, మరోవైపు స్థానిక ప్రజల భద్రత రక్షణ వ్యవహారాల దృష్ట్యా 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నిబంధనలు వర్తిస్తాయని, వాహనదారులు, ట్రైన్ పాసర్స్ ఇట్టి నిబంధనలను గమనంలో ఉంచుకొని రాకపోకలను సవరించుకోవడం మేలని కమిషనర్ సూచించారు. దీంతోపాటు డ్రోన్లు, పారా గ్లైడర్లు, మైక్రో- లైట్ ఎయిర్ క్రాఫ్ట్ లు ఎగరవేయడం పూర్తిగా నిషిద్ధమని, ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సైబరాబాద్ పోలీస్ బాస్ స్పష్టం చేశారు. ఇతర సమాచారం కోసం మాదాపూర్ పోలీస్ స్టేషన్, డివిజనల్ ఏసిపి కార్యాలయం, డిసిపి కార్యాలయాలలో నోటీసు బోర్డులపై సంబంధిత వివరాలను నమోదు చేసి ఉంచడం జరిగిందని, అవసరమైన వారు ఆయా కార్యాలయాలను సందర్శించి వివరాలను తెలుసుకోవచ్చని మాదాపూర్ డిసిపి పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయం



- ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రాకూడదు..
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం గణపురం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి, గాంధీనగర్, అప్పయ్యపల్లి, సీతారాంపురం, బంగ్లాపల్లి, కొండాపురం తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. తూకం, నాణ్యత పరిశీలన, గన్నీ సంచులు, రవాణాలో జాప్యం లేకుండా, పారదర్శకంగా, వేగంగా కొనుగోలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతులు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదన్నారు. రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అన్నదాతకు అండగా ఉండటమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా స్టూడెంట్ కిట్లు అందించాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు నిత్యావసర సరుకులు, స్టూడెంట్ కిట్ల సరఫరాలో జరుగుతున్న జాప్యంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఆహారం, వసతి, విద్యా సామగ్రి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, లోపాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం సచివాలయంలో పీఎంయూ (ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్) ద్వారా జరుగుతున్న సరఫరాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆగస్టు నెలలోనే టెండర్లు ఖరారు చేసి ఆర్డర్లు ఇచ్చినప్పటికీ, ఇండెంట్లకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సరుకులు చేరకపోవడంపై మండిపడ్డారు. ముఖ్యంగా మఫత్లాల్ సంస్థ సరఫరాలో వెనుకబడటాన్ని ప్రస్తావిస్తూ పెండింగ్‌లో ఉన్న సుమారు 2 వేల జతల తెల్ల సాక్సులు, 3 వేల ట్రంకు పెట్టెలతో పాటు మిగిలిన సామగ్రినంతా వెంటనే పాఠశాలలకు చేరవేయాలని ఆదేశించారు. లేదంటే టెండర్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పీఎంయూ చైర్మన్‌కు స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మఫత్లాల్ సంస్థ ప్రతినిధి.. ఈ నెల 16వ తేదీలోపు పెండింగ్ వస్తువులన్నింటినీ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి వస్తువు నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రతి విద్యా సంస్థలో సరుకుల స్వీకరణ, నిల్వ, పంపిణీ బాధ్యతలను ఎవరు పర్యవేక్షిస్తున్నారో తెలుపుతూ హెచ్ఓడీలు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సరుకుల కొరత రాకుండా ముందస్తుగా బఫర్ స్టాక్ (అదనపు నిల్వలు) నిర్వహించాలి. ప్రతి జిల్లాకు గుత్తేదారులు ఒక నోడల్ అధికారిని నియమించి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ నెల 25 నాటికి సరఫరా సంస్థలు తమ పూర్తి పురోగతి నివేదికను సమర్పించాలి. ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమస్యలు తలెత్తినప్పుడు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోకుండా అధికారులు, పీఎంయూ, సరఫరా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి, పీఎంయూ చైర్మన్ గుగులోతు రవి (ఐఏఎస్), గిరిజన సంక్షేమ గురుకులాల కార్యదర్శి నీతాలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.ఎల్. సంతోష్, పీఎంయూ గుత్తేదారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 నవంబర్ 2026

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు: ప్రజాస్వామ్యానికి గంభీర హెచ్చరిక

సంపాదకీయం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణ చిన్న విషయం కాదు. ప్రధాని నరేంద్ర మోదీ తన మొబైల్‌ను ట్యాప్ చేయిస్తున్నారని, అందుకు తన వద్ద ఆధారాలున్నాయని ఆయన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ఫోన్‌ను పైకి ఎత్తి చూపిస్తూ చెప్పారు. ఈ ఆరోపణలు రుజువైనా కాకపోయినా, ఒక ప్రతిపక్ష నాయకుడు ఇంతటి తీవ్రమైన మాట బహిరంగంగా అనాల్సి రావడమే మన ప్రజాస్వామ్య ఆరోగ్యంపై పెద్ద ప్రశ్నార్థకం.

ప్రతిపక్ష నేత అంటే కేవలం ఒక పార్టీ ప్రతినిధి కాదు. ఆయన కోట్లాది మంది ప్రజల గొంతుకకు ప్రాతినిధ్యం వహించే రాజ్యాంగబద్ధ స్థానంలో ఉన్నవారు. ఆయన సంభాషణలపై నిఘా పెడితే అది ఒక వ్యక్తి గోప్యతకు భంగం మాత్రమే కాదు; ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యవస్థనే బలహీనపరచడం. సుప్రీంకోర్టు గోప్యతను ప్రాథమిక హక్కుగా స్పష్టంగా ప్రకటించిన దేశంలో, చట్టబద్ధ ప్రక్రియ, న్యాయ పర్యవేక్షణ లేకుండా సాగే ఏ నిఘా అయినా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమే.

ఈ అనుమానాలకు చరిత్ర కూడా నేపథ్యంగా ఉంది. మూడేళ్ల క్రితం కూడా రాహుల్ ఇలాంటి ఆరోపణలే చేశారు. పెగాసస్ స్పైవేర్ సాయంతో కేంద్రం తనతో పాటు పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లను చొరబడిందనే చర్చ దేశాన్ని కుదిపేసింది. ఆ వివాదంలో స్పష్టమైన, సంతృప్తికరమైన సమాధానాలు రాలేదన్న భావన ఇప్పటికీ ప్రజల్లో ఉంది. సమాధానం దొరకని ప్రశ్నలు మళ్లీ మళ్లీ తలెత్తుతాయి. పారదర్శకత లోపించినప్పుడు అనుమానాలు బలపడతాయి.

ఇక్కడ ప్రభుత్వం ముందున్న దారి సరళమైనది. ఆరోపణలు నిరాధారమైతే, ఆధారాలను బహిర్గతం చేయమని కోరుతూ స్వతంత్ర దర్యాప్తుకు సిద్ధపడాలి. నిఘా కార్యకలాపాలు చట్ట పరిధిలోనే జరుగుతున్నాయని నిరూపించాలి. అలా కాకుండా మౌనం వహించడం, ఆరోపణ చేసినవారిపై ఎదురుదాడికి దిగడం సమస్యను పరిష్కరించవు; సందేహాలను పెంచుతాయి. అలాగే ఆరోపణ చేసిన రాహుల్ కూడా తన వద్ద ఉన్న ఆధారాలను సంబంధిత సంస్థలు, న్యాయస్థానాల ముందుంచాలి. ఆధారాలు లేని ఆరోపణలు రాజకీయ నినాదాలుగానే మిగిలిపోతాయి.

ఈ వివాదం ఇక్కడితో ఆగదు. పార్లమెంటులో వ్యవసాయ చట్టాలు, ఓటు చోరీ, ఎస్ఐఆర్, చైనా, మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ నరవణె పుస్తకం, ఎప్‌స్టీన్ ఫైళ్లు వంటి అంశాలపై చర్చకు అవకాశం ఇవ్వడం లేదని రాహుల్ ఆరోపించారు. సభలో చర్చకు చోటు తగ్గినప్పుడు ప్రతిపక్షం బయట వేదికలను ఆశ్రయిస్తుంది. ప్రధానితో ముఖాముఖి చర్చ కావాలన్న ఆయన డిమాండ్ కూడా ఇదే నిరాశ నుంచి పుట్టింది. అదానీ లేదా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను న్యాయ నిర్ణేతలుగా పెట్టినా తనకు అభ్యంతరం లేదన్న ఆయన వ్యాఖ్యలు రాజకీయ నాటకీయతతో కూడినవే కావచ్చు. కానీ పార్లమెంటు అంటే వాదనలు వినిపించి, వినే వేదిక అన్న మౌలిక సూత్రాన్ని అవి గుర్తుచేస్తున్నాయి.

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు. ప్రశ్నించే స్వేచ్ఛ, గోప్యత, పారదర్శకత, జవాబుదారీతనం ఉన్నప్పుడే అది సజీవంగా ఉంటుంది. ప్రతిపక్ష నేత ఫోన్‌పై నిఘా ఉందన్న అనుమానమే పౌరుల్లో భయాన్ని నింపుతుంది. ప్రతిపక్ష నేతకే రక్షణ లేకపోతే సామాన్యుడి గోప్యతకు హామీ ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. అందుకే ఈ ఆరోపణలను రాజకీయ కోణంలో మాత్రమే చూడకూడదు. నిష్పాక్షిక దర్యాప్తు, నిఘా చట్టాల్లో సంస్కరణలు, పార్లమెంటరీ పర్యవేక్షణ దిశగా అడుగులు పడాలి. దేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, గోప్యత కాపాడటం ఎవరికైనా మొదటి బాధ్యత కావాలి.

సామాన్య మానవ జీవనసంవేదం - "జీరో గ్రావిటీ"

ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాల్లో చాలామందిని ఆకర్షించిన వచన కవితా సంపుటి ఫిజిక్స్ అరుణ్ కుమార్ రచించిన "జీరో గ్రావిటీ". ఈ శీర్షికను చూడగానే ఇదొక సైన్స్ పుస్తకమని పొరబడే అవకాశం ఉంది. కానీ ఇది సామాన్య శాస్త్రం కాదు. సామాన్య మానవుని జీవన శాస్త్రం. అనుభవసారాన్ని అక్షరాలుగా మలచిన ఒక కవి జీవనవేదం.

కవి మనస్సుకు, సముద్రానికి పోలిక చెప్పవచ్చు. సముద్రంలో ఉండే లోతు, గాంభీర్యం, ఉప్పెనలు, కల్లోలాలు, సుడిగుండాలు అప్పుడప్పుడూ అసాధారణ ప్రశాంతత. ఈ విధంగా వాతావరణ మార్పులు సముద్రాన్ని ప్రభావితం చేసినట్లే, కవి హృదయసాగరం పరిస్థితులకనుగుణంగా, జీవన వైవిధ్యానికి అనుగుణంగా, సమాజం లోని వివిధ విషయాలకనుగుణంగా ప్రేరేపితమవుతుంది. ఆ ప్రేరణ నుండి కవిత్వం ఆవిర్భవిస్తుంది. అరుణ్ కుమార్ కవిత్వంలోనూ దీన్ని స్పష్టంగా చూడవచ్చు.


అసలు "జీరోగ్రావిటీ" అంటే ఏమిటి? ముఖచిత్రం చూసిన వెంటనే ప్రతీ ఒక్కరిలో జనించే ప్రశ్న. సైన్స్ పరంగా భారరహితమైనది. లేదా శూన్య గురుత్వస్థితి. అనగా పూర్తిగా తేలికైనది. శాస్త్రీయపరంగా కాక ఈ కవిత్వాన్ని చూసినపుడు ఒకానొక అవ్యక్తమైన అనుభూతి అని దీనికి అర్థం చెప్పుకోవచ్చు. అరుణ్ కుమార్ మొదట తన కవిత్వంతో 'శూన్యం' లో ప్రవేశించి, వ్యాసాలుగా 'బిగ్ బ్యాంగ్' తో మహా విస్ఫోటనం చెంది, ఇపుడు అలౌకికస్థితిలో 'జీరోగ్రావిటీ'గా పరిపక్వతకు చేరుకుంటున్నారు.

భౌతికశాస్త్రం పట్ల అత్యంత అభిమానంతో తన ఇంటిపేరుగా మార్చుకున్న ఈ కవిలో నిర్దిష్టమైన భావాలు, కవిత్వం పట్ల స్పష్టమైన ఆలోచన, దేన్ని ఎలా చూడాలన్న వివేచన ఉన్నాయి. అందువల్ల భూమ్యంతరిక్షాలకు అక్షర సోపానం వేసుకున్నారు. తాను లోతుగా పరిశీలించి, అధ్యయనం చేసి, ఆకళింపు చేసుకున్న శాస్త్రతత్వాన్ని కవిత్వానికి అన్వయం చేస్తూ శాస్త్ర పారిభాషిక పదాలను ఉపయోగిస్తూ కవిత్వం రాయడం ఈ కవిలోని విశేషం.

"నిత్యత్వ నియమం" అనే కవితతో ప్రారంభమైన ఈ కవితా సంపుటిలో "నా కవిత్వం ఓ నిత్యత్వం"....."అనంత విశ్వసేద్యంలో గెలాక్సీల సముదాయం" అంటూ తన కవిత్వానికి నిత్యత్వాన్ని ఆపాదించారు. గెలాక్సీల సముదాయం ఎంత నిత్యమో, తన కవిత్వం నిరంతరాయంగా కొనసాగుతూ ఉండాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. మరోచోట.... "ఎలాంటి కవిత్వం రాయాలిప్పుడు?/ ఎలాంటి కవిత్వం రావాలిప్పుడు?" అనే మాటల రెండింటిలో ఉన్న తేడా చిన్నదిగానే అనిపించినా లోతైన భావం ఉన్న వాక్యాలివి. నేనెలాంటి కవిత్వం రాయాలి? సమాజానికి ఇప్పుడేమవసరం? అని కవి తనను తాను ప్రశ్నించుకున్నప్పుడే, ఆత్మవిమర్శ చేసుకున్నప్పుడే అసలైన కవిత్వం రాగలదు.

"నీలో, నాలో, మనలో/ స్పందనేగా కవిత్వం" అంటూ కవిత్వానికి నిర్వచనం చెప్పుకుంటారు. రసానుభూతి ప్రధానం కావ్యం. మనిషిలో స్పందన కలుగజేయలేని కవిత్వం కవిత్వమే కాదు. ఆద్యంతం గొప్పగా ఉండనవసరం లేదు. ఏదో ఒకచోట, మనసులోని ఏదో ఒక మూలను కదిలించినా, కరిగించినా ఆ కవిత్వ ప్రయోజనం నెరవేరినట్టే. అందుకే ఇంకోచోట అరుణ్ కుమార్ "రాస్తూ బ్రతకడం లో, బ్రతుకు గురించి రాయడంలో/ అణువణువునా అడుగడుగునా/ అన్నింటిలో కవిత్వం ఉంది/ కవిత్వంలోనే జీవన సారమంతా/ నిగూఢమై, నిత్య తోరణమై ఉంది" అని తన భావనను సుస్పష్టంగా వివరిస్తారు.

ఎవరైనా వ్యక్తి మరణించిన సందర్భంలో మాత్రమే భగవద్గీత రికార్డు వేయడం మనం చూస్తున్నాం. కాకపోతే ఈ మధ్యకాలంలో అనేకులు చిన్న వయస్సులో ఉన్న పిల్లల నుండి వయో వృద్ధుల కొరకు భగవద్గీత క్లాసులు నిర్వహించడం, చాలామంది వీటిలో ఉత్సాహంగా పాల్గొని శ్లోకాలను కంఠస్థం చేయడం ఆనందదాయక పరిణామం. అరుణ్ కుమార్ భగవద్గీతను ఒక పుస్తకంగానో, మత గ్రంథంగానో కాక బ్రతుకు రాతగా చూస్తారు "నిన్ను నువ్వు



విశ్లేషించుకునేలా/ నిన్ను నువ్వే ఆవిష్కరించుకునేలా/ నీలో నువ్వే అన్వేషించుకునేలా/ చావు పాఠంలో పద్యంలా కాకుండా/ బ్రతకడం లోని మాధుర్యం తెలిపేలా...నిన్ను నడిపించేది భగవద్గీత" అంటూ గొప్ప తాత్త్వికతను వ్యక్తం చేస్తారు.

జీవితం ఎప్పుడూ కలియుగ కురు క్షేత్రమే/ మొదట నీపై నీవు గెలవాలి/ ఆపై నీ శత్రువులను నువ్వే ఓడించాలి..../ కృష్ణుడు నువ్వే/ ఎప్పటికీ అర్జునుడివి నువ్వే/..." అంటూ చైతన్యాన్ని ప్రబోధిస్తారు కవి.

ఇక్కడ నీ పై నువ్వు గెలవడంలోని అంతరార్థం అరిషడ్వర్గాలను జయించడమే. నీకు నువ్వే అంతరాత్మను జయించాలి. కృష్ణుడు అర్జునుడికి చేసినట్టు ఎవరో నీకు జ్ఞాన ప్రబోధం చేయాల్సిన అవసరం లేదు. అర్జునుడిలా కర్తవు నీవే, కర్తవ్యం నీదే అయినప్పుడు నిన్ను నీవే నియంత్రించుకోవాలి. అప్పుడే ప్రపంచం శాంతి నీడలో బతుకుతుంది. కవి సామరస్యభావన ఇక్కడ స్పష్టమవుతుంది.

2025 వ సంవత్సరం ప్రపంచ క్రికెట్ చరిత్రలో నూతన అధ్యాయం. భారతదేశ కీర్తిని స్వర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రతిష్టాత్మకమైన విజయాన్ని అందించి, ప్రపంచ కప్ సాధించారు మహిళా క్రికెటర్లు. స్త్రీలు ఎంత గొప్పదనాన్ని సాధించినా ఇటువంటి చోట్ల ఇంకా పురుషులకు దక్కినంత గౌరవం స్త్రీలకు దక్కకపోవడం శోచనీయం. ఈ చారిత్రక విజయాన్ని వర్ణిస్తూ అరుణ్ కుమార్ "నవశకంఏ298" అనే కవితను రాశారు. దక్షిణాఫ్రికా తమకు ఇచ్చిన పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ మనవాళ్ళు చేసిన 298 పరుగులను శీర్షికలో సూచిస్తూ, కొత్త శకానికి నాంది పలికారని చెప్పడం అరుణ్ కుమార్ చేసిన ప్రయోగం. "ఐదు దశాబ్దాల పోరాట సంకేత కాంతికి/ అమ్మాయిల ఆశయాల ఆట శక్తికి/ విశ్వ విజేతగా స్వేచ్ఛా స్వేదపు/ కొత్త పసిడి రంగులద్దింది" అంటూ వారిని ప్రశంసిస్తారు. ఈ టీములోని 11 మంది మహిళలను కోహినూర్ వజ్రాలతో పోలుస్తూ ఈ విజయాన్ని నవశకానికి ప్రభాత గీతంగా ఆయన అభివర్ణించారు.

అలమారలోని పాతపుస్తకాలలో చిన్నతనంలో తాత తనకు నేర్పించిన పెద్ద బాలశిక్షను చూసి "చాలా మార్లు..... ఈ ముసలోని చాదస్తం/ నా సావు కొచ్చిందనుకునే వాణ్ణి/ అజ్ఞానపు అజ్ఞాతంలో/ నేనున్నానని తెలిసికోలేక/ ముందు తరాలకు జ్ఞానపు తోవ చూపుతూ/ నాకు బ్రతుకు తెరువు నేర్పుతున్నాడనుకోలేదు" అనే వాక్యాలు వృద్ధాశ్రమాల అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తున్న ఈ తరం వారిని సిగ్గుపడేలా చేస్తాయి. కుటుంబాలలో పెద్దవారు తరువాతి తరాలకు తమ అనుభవ పాఠాల ద్వారా ఎంతటి క్రమశిక్షణను, విలువలను నేర్పేవారో, మనం కోల్పోతున్నదేమిటో ఈ వాక్యాలు స్పష్టం చేస్తాయి.

కవికి గణితం, భౌతికశాస్త్రం రెండూ కనుద్వయాలు. అందుకే ఆయన అక్షరాల్ని అంకెల్లో పొదుగుతారు. "నువ్వొచ్చాక నా జీవిత గణితం/ కొత్త లెక్కల సూత్రాలను నేర్పుతుంది/ వన్ ప్లస్ వన్ ఈక్వల్ టు/ రెండు కాదంటుంది" ...జీవిత భాగస్వామి తోడయ్యాక కవి వన్ ప్లస్ వన్ టు అని కాకుండా 1+1=1 అనే కొత్త సూత్రాలను నేర్చుకున్నారు. ఇది దంపతుల మధ్య ఉండేటటువంటి, ఉండాల్సిన అనురాగానికి ప్రతీక. అంకెల భాషలో సహధర్మచారిణి పట్ల ప్రేమను వ్యక్తం చేయడం అరుణ్ కుమార్ ప్రతిభకు నిదర్శనం.

ప్రకృతిలోని ప్రాథమిక విషయాలను భౌతికశాస్త్రం ఎట్లా అధ్యయనం చేస్తుందో ఒకరికొకరైన సమన్వయం జీవిత శాస్త్రాన్ని అన్వేషించి అమృత కావ్యంగా మారుతుందనే భావాన్ని ఆయన వెల్లడిస్తారు.

భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా శాస్త్ర విషయాన్ని అటు జీవితానికి, ఇటు కవిత్వానికి ఆపాదించుకుంటూ అవ్యక్తమైన అనుభూతిలో మమేకమవుతుంటారు.

"నవమాసాల నాటకీయ పరిణామాల/ అలలన్నీ ఆవిరై/ అంతరిక్షమే ఆమె ముందు తేలిపోయింది" అంటూ నవమాసాల అజ్ఞాతం నుండి నవజాత శిశువుగా, తిరిగి భూమిపై కాలు మోపిన సునీతా విలియమ్స్ ను గురించి రాస్తూ....అంతరిక్షపు మహిళ చరిత్ర సృష్టించిన కారణంగా "స్పేస్ వాక్ సునీత/ హిస్టరీ వాక్యం అయింది" అని ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తారు.

ఫిజిక్స్ అరుణ్ కుమార్ గారి "జీరో గ్రావిటీ" కవితా సంపుటిలో 58 కవితలున్నాయి. ఇందులో స్మృతి కవితలు, రైతు కష్టాలు, సమాజంలోని ఆవేదనలు, జ్ఞానబోధ చేసిన గురువులను గురించిన కవితలున్నాయి. కూరగాయలమ్మే స్త్రీ కూడా ఆయన కవిత్వానికి ప్రధానాంశమే.

ఈ సంపుటిలో కొన్ని కవితల చివరన పొందుపరిచిన కొన్ని పంక్తులు ఒక ప్రత్యేక ఆకర్షణ. అవి అరుణ్ కుమార్ మనో భావాలకు అక్షరరూపాలు. కొన్ని పుస్తకాలలో విభాగాలు, అధ్యాయాల చివరన ప్రముఖుల సందేశమో, నీతివంతమైన శ్లోకమో, పద్యమో ఉండడం మనకు తెలుసు. అదే పద్ధతిని అరుణ్ కుమార్ పాటించారు.

"బయట గెలవాలంటే/ ఏదో యుద్ధం చేస్తున్నట్లు కనిపించాలి/ నీలో నువ్వు గెలవాలంటే యుద్ధం చేయడం వచ్చి ఉండాలి/ రెండూ యుద్ధాలే"

BUT BOTH ARE NOT SAME

ఇటువంటి బరువైన, తత్వ బోధక, జీవన విలువలను తెలిపే వాక్యాలు కవితల చివరన కవి అంతరంగ అన్వేషణకు రూపంగా, లోతైన భావ సమాహారంగా నిలుస్తాయి. అంతర్బహిశ్చేతనలో మనిషి చేసేది నిరంతర యుద్ధమే. కానీ ఆ వివేచన కలిగిన వాడే జీవన సార్థక్యాన్ని పొందుతాడు.

అంతేకాదు...ఈ పుస్తకంలో ముందుమాటల నుండి మొదలుకొని ప్రతీ పేజీలో పైన ఎడమవైపు "జు= ఎఽ2" అనే సూత్రం కనబడుతుంది. ఇది ప్రపంచప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్ స్టీన్ ప్రతిపాదించిన సూత్రం. అది ప్రతిపాదించి100 సంవత్సరాలు అయిన సందర్భంగా 2025 వ సంవత్సరాన్ని "అంతర్జాతీయ భౌతిక శాస్త్రవేత్త సంవత్సరం/ ఐన్ స్టీన్ సంవత్సరం" గా ప్రకటించారు. ఈ సందర్భంగా తనలోని ఆలోచనలపై ప్రభావాన్ని చూపిన సంవత్సరంగా భావిస్తూ, ఐన్ స్టీన్ పై ఉన్న గౌరవంతో ఆయన ప్రతిపాదించిన ఈ సూత్రాన్ని ప్రతిపేజీలో లిఖించారు. అలాగే కుడివైపు "సత్యమేవ జయతే" అనే ఉపనిషద్వాక్యం అరుణ్ కుమార్ లోని ప్రభావశీలమైన దృష్టికోణాన్ని ఆవిష్కరిస్తుంది.

ఆదర్శభావాలతో రూపొందించిన ఈ కవితా సంపుటి సాహిత్యంలో చోటు సంపాదించుకున్నందుకు అరుణ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలుపుతూ, మరింత గాఢమైన కవిత్వంతో త్వరలో మరో పుస్తకంతో మన ముందుకు వస్తారని ఆశిస్తున్నాను.



ధూళిపాళ అరుణ
8712342323

మార్క్సిజాన్ని నమ్మేవారంతా ఒకే పార్టీగా ఉండాలి!

మార్క్సిజం అంటే ఏమిటి? దాని ప్రాథమిక లక్ష్యాలేమిటి?

తరతరాలుగా కొనసాగుతున్న దోపిడీకి, అసమానతలకు, పేదరికానికి, సామాజిక అణచివేతకు అసలు కారణాలేమిటి? మానవ సమాజంలో కొద్దిమంది చేతుల్లోనే సంపద, అధికారం, ఉత్పత్తి సాధనాలు ఎందుకు కేంద్రీకృతమవుతున్నాయి? అపారమైన సంపదను సృష్టించే శ్రామికులు మాత్రం ఎందుకు పేదరికంలో మగ్గుతున్నారు? మనుషుల మధ్య ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలు ఎందుకు కొనసాగుతున్నాయి? ఈ ప్రశ్నలకు శాస్త్రీయంగా సమాధానాలను అన్వేషించిన సిద్ధాంతమే మార్క్సిజం. కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ మానవ సమాజ పరిణామాన్ని చారిత్రక భౌతికవాద దృక్పథంతో విశ్లేషించారు. సమాజంలోని ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక వ్యవస్థ, వర్గ సంబంధాలు, దోపిడీ స్వభావాన్ని శాస్త్రీయంగా వివరించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుడు సృష్టించే అదనపు విలువను పెట్టుబడిదారుడు ఎలా స్వాధీనం చేసుకుంటాడో విశ్లేషించారు. దోపిడీకి మూలాలను గుర్తించడమే కాకుండా, దోపిడీ లేని సమసమాజ నిర్మాణానికి మార్గాన్ని కూడా చూపించారు.

ఆ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా కార్మిక, రైతాంగ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది. అనేక దేశాల్లో విప్లవాలకు, సామాజిక పరివర్తనలకు, నూతన రాజకీయ వ్యవస్థల ఆవిర్భావానికి పునాదిగా నిలిచింది.

మరి ఇంతటి గొప్ప సిద్ధాంతాన్ని విశ్వసించే కమ్యూనిస్టులు ఎందుకు అనేక పార్టీలుగా, గ్రూపులుగా విడిపోయి పనిచేస్తున్నారు? మార్క్సిజం లక్ష్యం కార్మికవర్గ ఐక్యత అయినప్పుడు, కమ్యూనిస్టు పార్టీల మధ్య విభజనలు ఎందుకు కొనసాగాలి?

ఈ ప్రశ్నను ప్రతి కమ్యూనిస్టు ఆత్మపరిశీలనతో ఆలోచించాలి.

1. మార్క్సిజంలోని కీలకమైన ప్రాథమిక అంశాలేమిటి?

మార్క్సిజాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ దాని ప్రాథమిక లక్ష్యాలను అర్థం చేసుకోవాలి. వాటిలో ముఖ్యమైనవి:

1. మనుషులంతా సమానమే: పుట్టుక, కులం, మతం, ప్రాంతం, భాష, లింగం, ఆర్థిక స్థితి ఆధారంగా మనుషుల మధ్య ఎలాంటి ఉన్నత, నీచ భావనలు ఉండకూడదు. ప్రతి మనిషికి సమాన గౌరవం, సమాన హక్కులు, అభివృద్ధికి సమాన అవకాశాలు ఉండాలి.
2. దోపిడీ, అణచివేత లేని సమాజం: ఒక మనిషి శ్రమను మరొకరు దోచుకునే పరిస్థితి అంతం కావాలి. ఆర్థిక దోపిడీతో పాటు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అణచివేతలు కూడా అంతమవ్వాలి. మనిషి మనిషిని దోచుకోని, ఆధిపత్యం చెలాయించని సమాజమే సోషలిస్టు సమాజ నిర్మాణ లక్ష్యం.
3. ప్రపంచ కార్మికుల ఐక్యత: కార్మికుడికి దేశం, భాష, జాతి, ప్రాంతం వంటి భేదాలు ఉన్నప్పటికీ, దోపిడీకి వ్యతిరేకంగా వారి ప్రాథమిక ప్రయోజనాలు ఉమ్మడిగా ఉంటాయి. అందుకే ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే అంతర్జాతీయవాద స్ఫూర్తిని మార్క్సిజం ప్రతిపాదించింది. ఒక ప్రాంతంలోని కార్మికులే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రామిక జనమంతా ఐక్యంగా పోరాడాలి.
4. ఉత్పత్తి సాధనాలపై సామాజిక యాజమాన్యం: భూమి, పరిశ్రమలు, గనులు, సహజ వనరులు, కీలక ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది ప్రైవేటు పెట్టుబడిదారుల లాభాల కోసం కాకుండా సమాజ ప్రయోజనాల కోసం పనిచేయాలి. వాటిపై సామాజిక యాజమాన్యం, ప్రజా నియంత్రణ ఉండాలి. సోషలిస్టు వ్యవస్థలో ఉత్పత్తి ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్వహించబడాలి.
5. విద్య, వైద్యం, ఉపాధి ప్రభుత్వ బాధ్యత: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, గౌరవప్రదమైన ఉపాధి కల్పించడం ప్రభుత్వ కనీస బాధ్యతగా ఉండాలి. విద్య, వైద్యం కేవలం వ్యాపార వస్తువులుగా మారకూడదు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు, వైద్యానికి దూరం కాకూడదు.
6. వర్గపోరాటం అనివార్యం: దోపిడీ వ్యవస్థను కొనసాగించాలని కోరుకునే వర్గాలకు, దానిని అంతం చేసి సమసమాజాన్ని నిర్మించాలని కోరుకునే శ్రామిక వర్గానికి మధ్య ప్రయోజనాల సంఘర్షణ ఉంటుంది. దోపిడీ వర్గాల ఆధిపత్యాన్ని అంతం చేయడానికి వర్గపోరాటం అనివార్యం. ఈ పోరాటం ద్వారా దోపిడీ వ్యవస్థ స్థానంలో నూతన సామాజిక వ్యవస్థ ఏర్పడాలి.
7. కార్మికవర్గాన్ని చీల్చకుండా కాపాడటం: స్వార్థపరమైన శక్తులు, దోపిడీ వర్గాలు కార్మికవర్గ ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తాయి. మతం, కులం, ప్రాంతం, భాష, వ్యక్తిగత ప్రయోజనాల పేరుతో శ్రామికులను విడదీస్తాయి. వాటిని అధిగమించి కార్మికవర్గ ఐక్యతను కాపాడటం కమ్యూనిస్టుల బాధ్యత.
8. యుద్ధాలు, సామ్రాజ్యవాద ఆధిపత్యం లేని ప్రపంచం: దేశాల మధ్య దోపిడీ, సామ్రాజ్యవాద ఆధిపత్యం, యుద్ధాలు, ఆయుధ పోటీ అంతం కావాలి. మానవజాతి ఐక్యత, అంతర్జాతీయ సహకారం, ప్రపంచ శాంతి నెలకొనాలి. జాతీయ సార్వభౌమత్వాన్ని, ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని గౌరవిస్తూ ప్రపంచవ్యాప్తంగా సహకార సంబంధాలు అభివృద్ధి చెందాలి. దీర్ఘకాలికంగా సరిహద్దుల ఆధారంగా మనుషుల మధ్య శత్రుత్వం లేని ప్రపంచ సమాజం ఏర్పడాలనే ఆశయం ఉండాలి.



ఈ అంశాలన్నీ మార్క్సిజం యొక్క ప్రాథమిక లక్ష్యాలకు సంబంధించినవి. వీటిని విశ్వసిస్తూ, ఆచరణలో పెట్టేందుకు కృషి చేసేవారే మార్క్సిస్టులుగా తమను తాము భావించుకుంటారు.

అయితే ఈ లక్ష్యాలను సాధించాలంటే సిద్ధాంతపరమైన అవగాహనతో పాటు సంఘటిత రాజకీయ శక్తి కూడా అవసరం. విడివిడిగా పనిచేసే బలహీన శక్తులుగా కాకుండా, ఐక్యమైన శ్రామికవర్గ రాజకీయ పార్టీగా ఎదగాల్సిన అవసరం ఉంది.

2. మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలోనే ఐక్యతకు స్పష్టమైన ప్రాధాన్యత

కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచించిన ప్రపంచ ప్రఖ్యాత గ్రంథం కమ్యూనిస్టు ప్రణాళిక (జశీఎఎబఅఱర్ మీఱఅఱటవర్శీ) రెండవ అధ్యాయం పేరు 'శ్రామికులు, కమ్యూనిస్టులు'. ఈ అధ్యాయంలో కమ్యూనిస్టుల కు, ఇతర శ్రామికవర్గ పార్టీలకు మధ్య ఉండాల్సిన సంబంధాన్ని మార్క్స్, ఎంగెల్స్ స్పష్టంగా వివరించారు.

ఆ అధ్యాయంలోని మొదటి నాలుగు వాక్యాలు ప్రత్యేకంగా గమనించదగినవి. వాటి భావం ఇలా ఉంది:

1. మొత్తం శ్రామికవర్గంతో కమ్యూనిస్టుల సంబంధం ఏమిటి?
2. కమ్యూనిస్టులు ఇతర శ్రామికవర్గ పార్టీలకు వ్యతిరేకంగా ప్రత్యేక పార్టీగా ఏర్పడరు.
3. మొత్తం శ్రామికవర్గ ప్రయోజనాలకు భిన్నంగా కమ్యూనిస్టులకు ప్రత్యేకమైన ప్రయోజనాలు ఉండవు.
4. శ్రామికవర్గ ఉద్యమాన్ని తమకు నచ్చిన మూసలో పోతపోయడానికి కమ్యూనిస్టులు ఎలాంటి సంకుచిత సొంత సూత్రాలను రూపొందించరు.

ఈ నాలుగు వాక్యాల వెనుక ఉన్న రాజకీయ సారాంశం ఏమిటంటే, కమ్యూనిస్టులు శ్రామికవర్గం నుంచి విడిపోయిన ప్రత్యేక ప్రయోజనాల గుంపుగా ఉండకూడదు. కార్మికవర్గ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ, దాని ఉమ్మడి ప్రయోజనాల కోసం పనిచేయాలి.

మార్క్స్, ఎంగెల్స్ ఉద్ఘాటించిన ఈ సూత్రాలను దృష్టిలో ఉంచుకుంటే కమ్యూనిస్టు ఉద్యమంలో విభజనల పట్ల మనం మరింత బాధ్యతతో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. మార్క్స్ ఈ వాక్యాల్లో ప్రతి సందర్భంలో ఒకే పార్టీగా విలీనం కావాలనే సంస్థాగత విధానాన్ని ప్రత్యక్షంగా నిర్దేశించలేదు. అయితే కమ్యూనిస్టులు కార్మికవర్గ ప్రయోజనాలకు భిన్నమైన ప్రత్యేక ప్రయోజనాల కోసం పనిచేయకూడదనే సూత్రాన్ని బలంగా ప్రతిపాదించారు. ఆ స్ఫూర్తిని నేటి కమ్యూనిస్టు ఉద్యమం ఆచరణలోకి తీసుకురావాలి.

3. లెనిన్ ప్రతిపాదించిన కేంద్రీకృత ప్రజాస్వామ్యం - ఐక్యతకు పునాది

కమ్యూనిస్టు పార్టీ ఐక్యంగా, క్రమశిక్షణతో పనిచేయడానికి లెనిన్ అభివృద్ధి చేసిన ముఖ్యమైన నిర్మాణ సూత్రం కేంద్రీకృత ప్రజాస్వామ్యం (ఇవఎశీఛీతీఫ్అఎ జవత్తీఖ్రశ్రీఅంఎ).

పార్టీలోని ప్రతి సభ్యుడికి అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉండాలి. పార్టీ విధానాలపై చర్చించాలి. తప్పులను విమర్శించాలి. ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించాలి. నాయకత్వాన్ని ప్రశ్నించాలి. మెజారిటీ, మైనారిటీ అభిప్రాయాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో స్థానం ఉండాలి.

అయితే నిర్ణయం తీసుకున్న తరువాత ఆ నిర్ణయాన్ని సమిష్టిగా అమలు చేయాలి. పై కమిటీ నిర్ణయాలను కింది కమిటీలు పాటించాలి. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు పార్టీ నిర్మాణం ఐక్యంగా పనిచేయాలి.

దీని ప్రధాన సూత్రాలు:

- పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్య చర్చకు అవకాశం ఉండాలి.
- మెజారిటీ నిర్ణయాన్ని మైనారిటీ గౌరవించాలి.
- మైనారిటీకి తన అభిప్రాయాన్ని చర్చల్లో వ్యక్తం చేసే హక్కు ఉండాలి.
- పై కమిటీ నిర్ణయాలను కింది కమిటీలు అమలు చేయాలి.
- నాయకత్వం నుంచి కింది స్థాయి వరకు ప్రతి ఒక్కరూ పార్టీ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి.
- తప్పులను విమర్శించాలి, ఆత్మవిమర్శ చేసుకోవాలి.
- వ్యక్తిగత ఆధిపత్యం, గ్రూపు తత్వం, వర్గీకరణలను నిరోధించాలి.
- పార్టీ ఐక్యతను, శ్రామికవర్గ ప్రయోజనాలను వ్యక్తిగత అభిప్రాయాల కంటే ఉన్నతంగా చూడాలి.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే నాయకత్వం చెప్పిందే వినాలని కాదు. అలాగే మెజారిటీ పేరుతో మైనారిటీ గొంతును నొక్కేయడం కూడా కాదు. ప్రజాస్వామ్య చర్చ, సమిష్టి నిర్ణయం, ఐక్య కార్యాచరణ కలిసిన నిర్మాణ పద్ధతి. లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీ చరిత్రలో అంతర్గత చర్చలు, భిన్నాభిప్రాయాలు, రాజకీయ వ్యూహాలపై తీవ్ర చర్చలు జరిగాయి. మెజారిటీ సాధించడానికి చర్చ, ఓపిక, రాజకీయ బాధ్యత అవసరమని ఆ అనుభవం తెలియజేస్తుంది. మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా పార్టీ ఐక్యత, క్రమశిక్షణ, విమర్శ-ఆత్మవిమర్శకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఈ నాయకుల చారిత్రక అనుభవాలను కేవలం మెజారిటీకి లోబడాలనే నినాదంగా కాకుండా, ప్రజాస్వామ్య చర్చ ద్వారా ఐక్యమైన కార్యాచరణను నిర్మించుకోవాలనే పాఠంగా అర్థం చేసుకోవాలి.

4. భిన్నాభిప్రాయాలు ఉన్నంత మాత్రాన పార్టీని చీల్చాలా?

ఏ రాజకీయ పార్టీలోనైనా అందరికీ ఒకే అభిప్రాయం ఉండటం సాధ్యం కాదు. సమాజం మారుతున్నప్పుడు సమస్యలు మారుతాయి. పరిస్థితులు మారుతాయి. వాటిని విశ్లేషించే విధానాల్లో తేడాలు వస్తాయి. వ్యూహాలు, ఎత్తుగడలు, కార్యక్రమాల విషయంలో భిన్నాభిప్రాయాలు సహజం.

అయితే ప్రతి భిన్నాభిప్రాయానికి ప్రత్యేక పార్టీ ఏర్పాటు చేయడమే పరిష్కారమా?

ఒక కమిటీలో అభిప్రాయ భేదాలు వస్తే చర్చించాలి. వాస్తవాలను పరిశీలించాలి. సిద్ధాంతపరంగా విశ్లేషించాలి. అవసరమైతే పునఃపరిశీలన చేయాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయం తీసుకోవాలి. మెజారిటీ, మైనారిటీ కలిసి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేయాలి.

ప్రతి భిన్నాభిప్రాయానికి ఒక కొత్త పార్టీ, ప్రతి నాయకత్వ వివాదానికి ఒక కొత్త గ్రూపు, ప్రతి రాజకీయ అసంతృప్తికి ఒక కొత్త కుంపటి ఏర్పడితే కమ్యూనిస్టు ఉద్యమం ఎలా బలపడుతుంది?

చీలికలకు మినహాయింపులు ఉండవా? తీవ్రమైన సైద్ధాంతిక విభేదాలు, ప్రజాస్వామ్య హక్కుల నిరాకరణ, పార్టీ రాజ్యాంగ ఉల్లంఘనలు, రాజకీయ దిశలో మౌలికమైన మార్పులు వంటి పరిస్థితులను కూడా పరిశీలించాలి. అన్ని విభజనలను ఒకే గాటన కట్టడం సరైంది కాదు. కానీ ప్రతి చిన్న విభేదాన్ని చీలికకు కారణంగా మార్చడం మాత్రం ఉద్యమానికి నష్టం కలిగిస్తుంది.

చీలికను సమర్థించేవారు తమ నిర్ణయాలను మార్క్సిజం, లెనినిజం స్ఫూర్తితో ప్రజల ముందు నిరూపించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు.

5. వ్యక్తిగత అహంభావాల కోసం సిద్ధాంతాన్ని ఉపయోగించకూడదు

నేడు కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. ఎవరి స్వంత గ్రూపు వారు ఏర్పాటు చేసుకోవడం, తమదే స్వచ్ఛమైన మార్క్సిజం అని ప్రకటించుకోవడం, ఇతరులను రివిజనిస్టులుగా ముద్ర వేయడం సాధారణమైపోతోంది. తోటి కమ్యూనిస్టులను ఎంత తీవ్రంగా విమర్శిస్తే అంత గొప్ప విప్లవకారుడిగా గుర్తింపు వస్తుందనే భావన పెరుగుతోంది. ఐక్యత గురించి మాట్లాడేవారిని బలహీనులుగా, రాజీపడే వారిగా చిత్రీకరించడం జరుగుతోంది. చీలికలను సమర్థించడం ఒక రాజకీయ ఫ్యాషన్‌గా మారుతోంది. కానీ ప్రశ్నించాల్సింది ఒక్కటే. మనకు ముఖ్యం మార్క్సిజమా? లేక మన వ్యక్తిగత అహంభావమా? మనకు ముఖ్యం సోషలిస్టు సమాజ నిర్మాణమా? లేక మనం ఏర్పాటు చేసుకున్న చిన్న గ్రూపు ఉనికా?

మనకు ముఖ్యం కార్మికవర్గ ఐక్యతా? లేక మన నాయకత్వ స్థానమా?

తోటి కమ్యూనిస్టులపై విమర్శలు చేయడం తప్పు కాదు. విమర్శ మార్క్సిస్టు సంప్రదాయంలో భాగమే. కానీ విమర్శ నిర్మాణాత్మకంగా ఉండాలి. సైద్ధాంతికంగా ఉండాలి. ఉద్యమాన్ని బలోపేతం చేయాలి. విమర్శ పేరుతో వ్యక్తిగత దూషణలు, పరస్పర శత్రుత్వం, శాశ్వత విభజనలు సృష్టించడం మాత్రం కమ్యూనిస్టు ఉద్యమానికి ఉపయోగపడదు.

6. భారతదేశంలో కార్మికవర్గ ఐక్యతకు కులవ్యవస్థ ప్రధాన అవరోధం

భారతదేశంలో మార్క్సిస్టు ఉద్యమం ప్రత్యేకంగా పరిశీలించాల్సిన సమస్య కులవ్యవస్థ. భారతీయ సమాజాన్ని శతాబ్దాలుగా కులవ్యవస్థ అనేక ముక్కలుగా విభజించింది.

మిగితా తరువాయి సంచికలో..



వ్యాస రచన
మాలోతు సాగర్
సెల్ నెంబర్ 7013805411

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

- జిల్లా కలెక్టర్ మను చౌదరి
- నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 12 (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఈ పథకాన్ని నవంబర్ 19, 2026న ప్రారంభించనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా రూ.5 లక్షల బీమా పరిహారం అందించనున్నట్లు పేర్కొన్నారు.
కుటుంబంలో సంపాదించే వ్యక్తి 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉంటే ఈ పథకానికి అర్హులని కలెక్టర్ తెలిపారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారని వివరించారు. పథకం కింద బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీకి ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల బీమా మొత్తం చెల్లిస్తారని పేర్కొన్నారు. నమోదు సమయంలో కుటుంబ పెద్ద వివరాలతో పాటు నామినీ వివరాలను అందించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన వారిని నమోదు చేసేందుకు గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. డేటా సేకరణ పూర్తయిన అనంతరం డిజిటల్ వివరాలు, సంతకం చేసిన దరఖాస్తుల స్కాన్ ప్రతులను బీమా కంపెనీకి పంపిస్తారని వివరించారు.

క్లెయిమ్‌ల పరిష్కారానికి ప్రత్యేక విధానం

గ్రామీణ ప్రాంతాల్లో మరణించిన వ్యక్తి వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి సేకరించి వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసి ఎంపీడీవోకు పంపిస్తారని కలెక్టర్ తెలిపారు. ఎంపీడీవో పరిశీలన అనంతరం చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌కు, అక్కడి నుంచి డీఆర్‌డీఓ పరిశీలనతో జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపిస్తారని వివరించారు. కలెక్టర్ ఆమోదం తర్వాత తుది పరిష్కారం కోసం బీమా కంపెనీకి క్లెయిమ్ పంపిస్తారని, సంస్థ పరిశీలన అనంతరం రూ.5 లక్షలను నామినీ ఖాతాకు బదిలీ చేస్తుందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల పరిధిలో వార్డు అధికారి క్లెయిమ్ ప్రక్రియను ప్రారంభిస్తారని, మున్సిపల్ కమిషనర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, పీడీ మెప్మా పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ఆమోదంతో బీమా కంపెనీకి పంపిస్తారని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు అధికారి ప్రక్రియ ప్రారంభించగా, డిప్యూటీ కమిషనర్ పరిశీలన, మున్సిపల్ కమిషనర్ ఆమోదం అనంతరం క్లెయిమ్‌ను బీమా సంస్థకు పంపిస్తారని కలెక్టర్ వివరించారు.

రామంతాపూర్ పెద్ద చెరువు నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ

- 34 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేసి గృహప్రవేశాలు చేయించిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్
- పేదల కోసం చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకుంటూ మాజీ ఎమ్మెల్యేకు ఘన సన్మానం



ఉప్పల్, నవంబర్ 13 (జనంసాక్షి): రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన 34 మంది నిర్వాసితులకు మల్లాపూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేశారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ స్వయంగా లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేసి గృహప్రవేశాలు చేయించారు.గత 30 ఏళ్లుగా రామంతాపూర్ పెద్ద చెరువు పరిసరాల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభాకర్ ప్రత్యేకంగా కృషి చేశారు. చెరువు సుందరీకరణలో భాగంగా గుడిసెల తొలగింపు సమయంలో నిర్వాసితుల పక్షాన నిలిచి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో చర్చలు జరిపి 34 మందికి ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గతంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఇళ్లు పొందిన లబ్ధిదారులు మాట్లాడుతూ కష్టకాలంలో తమకు అండగా నిలిచిన ప్రభాకర్ సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. వర్షాలు, వరదలు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ అర్ధరాత్రి వేళల్లో తమను పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందించి ఆదుకున్నారని గుర్తుచేసుకున్నారు. తమకు సొంతింటి కల నెరవేరేలా చేసిన ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు.
అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్‌ను లబ్ధిదారులు, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ వైస్ చైర్మన్ గొరిగే కృష్ణ, హబ్సిగూడ బీజేపీ సీనియర్ నాయకులు వేములకొండ సోమశేఖర్ గౌడ్, జిల్లాల రవీందర్‌రెడ్డి, పోతగాని గోపాల్ గౌడ్, శ్రీనివాస్ శర్మ, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణ గౌడ్, బాలచందర్, స్రవంతి తదితరులను శాలువాలతో సత్కరించారు. బీజేపీ మల్లాపూర్, నాచారం ప్రాంతాల సీనియర్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జుంటుపల్లి, అగ్గనూర్ అభివృద్ధికి రూ.1.34 కోట్లు

- 1,541 మందికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- విద్య, వైద్యం, మౌలిక వసతులకు ప్రాధాన్యం
- విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే బీఎంఆర్
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



యాలాల, నవంబర్ 13 (జనం సాక్షి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి (బీఎంఆర్) యాలాల మండలంలోని జుంటుపల్లి, అగ్గనూర్ గ్రామాల్లో పర్యటించారు. రెండు గ్రామాల్లో కలిపి రూ.1.34 కోట్లతో చేపట్టనున్న, పూర్తిచేసిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. 1,541 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. జుంటుపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించడంతోపాటు వారితో కలిసి అల్పాహారం చేశారు.
జుంటుపల్లిలో రూ.50.95 లక్షలతో సీసీ రోడ్డు, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 735 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. జుంటుపల్లి ప్రాజెక్టు ద్వారా సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యుత్ సబ్‌స్టేషన్, అంగన్‌వాడీ భవనాలు, ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.
అగ్గనూర్‌లో రూ.82.95 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అగ్గనూర్‌లో రూ.17.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.26 లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. మిగిలిన నిధులతో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, రైతులకు ఫార్మేషన్ రోడ్డు, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. మల్‌రెడ్డిపల్లి లోనూ సైడ్ డ్రైన్, సీసీ రోడ్డు, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 806 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు జుంటుపల్లిలో డీసీఎంఎస్, అగ్గనూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు రూ.2,461 మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కొనుగోళ్లలో పారదర్శకత పాటించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వైద్యం, సాగునీరు, విద్యుత్ సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య విలీనంపై తొందరపాటు వద్దు

- విద్యావేత్తల కమిటీతో సమగ్ర అధ్యయనం చేయాలి
- ప్రభుత్వ విద్యాసంస్థల్లో ముందుగా మౌలిక వసతులు కల్పించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి డిమాండ్



హయత్‌నగర్, నవంబర్ 13 (జనం సాక్షి): సీనియర్ సెకండరీ విధానం పేరుతో ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనపై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి డిమాండ్ చేశారు. ఈ అంశంపై విద్యారంగ నిపుణులు, విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కనీస మౌలిక వసతులు, బోధనా సిబ్బంది, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో లేవని పేర్కొన్నారు. ముందుగా ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై నియంత్రణ తీసుకురావాలని సూచించారు. సీనియర్ సెకండరీ విధానంపై ఉన్నత విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, మేధావులు, విద్యారంగ నిపుణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర అధ్యయనం చేయించాలని కోరారు. కమిటీ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి అధ్యయనం లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచే విలీన విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో సదుపాయాల కొరత కారణంగా విద్యార్థులు ప్రైవేట్ సంస్థల వైపు మొగ్గుచూపుతున్నారని, డ్రాపౌట్లు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా విధానంలో మార్పుల వల్ల కలిగే ప్రభావాలను ముందుగానే అంచనా వేయాలని, తొందరపాటు నిర్ణయాలతో పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు.



ఆల్విన్, మియాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గ్రేడ్ సెపరేటర్ పనులను పరిశీలించిన సిఎంసి కమిషనర్

శేరిలింగంపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) సీనియర్ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ జి సృజన శుక్రవారం పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ డాక్టర్ నారాయణ్ అమిత్, ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ మరియు టౌన్ ప్లానింగ్ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి హెచ్-సిటి ప్రాజెక్టులో భాగంగా ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియా పూర్ ఎక్స్ రోడ్ వద్ద ప్రతిపాదించిన గ్రేడ్ సెపరేటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆల్విన్ చౌరస్తానుండి హాఫీజ్‌పేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వరకు ప్రతిపాదించిన 200 అడుగుల రహదారి నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే ఆస్తులను కూడా ఇందులో భాగంగా సిఎంసి ఉన్నతాధికారులు పరిశీలించారు. ప్రతిపాదిత రహదారి వెడల్పును 200 అడుగుల నుంచి 160 అడుగులకు తగ్గించే అంశంపై సాధ్యాసాధ్యాలను చర్చించారు. సవరించిన రహదారి అలైన్‌మెంట్ ప్రకారం టౌన్ ప్లానింగ్ మరియు ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, ప్రభావిత ఆస్తుల యజమానులకు ఈనెల 15 లోపు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. దీంతోపాటు ప్రతిపాదిత మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన చేపట్టేందుకు వెహిక్యూలర్ అండర్ పాస్ వరకు భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని కమిషనర్ సృజన అధికారులకు సూచించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేయాలని తనిఖీలలో భాగంగా జోనల్ కమిషనర్ తదితరులను ఆదేశించారు.

భార్యను కడతేర్చిన భర్త అరెస్టు



రంగారెడ్డి, నవంబర్ 13 (జనంసాక్షి): భార్యపై అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో గొంతు నలిమి హత్య చేసిన నిందితున్ని ఆదిభట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఉపాధి పేరుతో ఒడిశా నుంచి భార్య, పిల్లలను తీసుకొచ్చిన నిందితుడు పక్కా ప్రణాళికతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. హత్య చేసిన అనంతరం అక్కడి నుంచి పరారైన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఘనశ్యామ్ పూజారి (33) తన భార్య ఉనిత పూజారి అలియాస్ హుక్యా మజి (32)కు స్వగ్రామానికి చెందిన మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందని అనుమానించే వాడు. ఈ విషయమై తరచూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఉపాధి కోసమని నమ్మించి ఈ నెల 7న భార్య, పిల్లలను ఒడిశా నుంచి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కొంగరకలాన్‌లో ఉన్న వీఎస్‌బీ బ్రిక్స్‌కు తీసుకొచ్చాడు. కాగా ఈ నెల 11న రాత్రి భోజనం అనంతరం భార్య మలమూత్ర విసర్జనకు వెళ్లగా, ఆమె వెంట వెళ్లిన ఘనశ్యామ్ కంపెనీ వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో స్కార్ఫ్‌తో ఆమె గొంతు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం కంపెనీ సూపర్‌వైజర్ రాజుపాలెం హేమాద్రి, ఇతర కార్మికులు ప్రశ్నించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. అయితే మృతదేహం ఉన్న ప్రదేశాన్ని చూపిస్తానని నమ్మించి వారిని మరో ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడు పరారైన విషయంపై సూపర్‌వైజర్ హేమాద్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 12న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా విజయవాడ జాతీయ రహదారి వైపు పారిపోవడానికి ప్రయత్నిస్తున్న ఘనశ్యామ్‌ను సూపర్‌వైజర్ హేమాద్రి గుర్తించాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి


- నేతకాని సామాజిక వర్గ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి



ముషీరాబాద్, నవంబర్ 13 (జనం సాక్షి): నేతకాని సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని నేతకాని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జిమ్మిడి గోపాల్ నేతృత్వంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్ట్ ఎం. లక్ష్మీనారాయణ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నేతకాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జనగాం నరేష్ మాట్లాడుతూ నేతకాని సామాజిక వర్గ అభివృద్ధి కోసం హైదరాబాద్‌లో నేతకాని భవన్ నిర్మించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న నేతకాని కుటుంబాలకు పోడు భూములపై హక్కులు కల్పించి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. త్వరలో ఏర్పాటు చేయనున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణ కారణంగా నేతకాని సామాజిక వర్గం తీవ్రంగా నష్టపోయిందని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల కేటాయింపులో నేతకానిలకు తగిన ప్రాధాన్యత కల్పించి, పాలనలో భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రోస్టర్ విధానం వల్ల గ్రూప్-3 పరిధిలోని 26 కులాలకు అన్యాయం జరుగుతోందని, ఈ విధానాన్ని ప్రభుత్వం సమీక్షించి న్యాయం చేయాలని అన్నారు. నేతకాని సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ మహా ధర్నాలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి యువరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, టేకుమెట్ల సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు గోగు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్, కొత్తపల్లి గంగేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరో యువకుడికి గాయాలు..ట్రక్కు డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు



శామీర్ పేట్, నవంబర్ 13(జనం సాక్షి) : మజీద్‌పూర్ ఎక్స్ రోడ్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు గాయపడ్డ ఘటన తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీనోమ్ వ్యాలీ సీఐ గురువయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా, జన్నారం మండలం, రాంపూర్ గ్రామానికి చెందిన నవీన్ (20), హైదరాబాద్‌లోని సిటీ కాలేజీలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సెలవుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన నవీన్, 12వ తేదీ రాత్రి తాళ్ల పేట నుంచి లక్సెట్టిపేటకు బస్సులో వెళ్లి, అక్కడ తన స్నేహితుడు సిద్దును కలిశాడు. అనంతరం సిద్దుకు చెందిన బైక్ నంబర్ టిజి 19 బిఏ 1304 పై ఇద్దరూ హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమం లో 13న తెల్లవారుజామున సుమారు 2:10 నిముషాల సమయంలో మజీద్‌పూర్‌లోని మారుతి షోరూం ఎదురుగా హైదరాబాద్ వైపు వెళుతున్న గుర్తుతెలియని ట్రక్కు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో, వెనుక నుంచి వస్తున్న బైక్ ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న నవీన్ తీవ్ర గాయాలతో అక్కడి కక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న సిద్దుకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కుడిది రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని ట్రక్కు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

రీసర్వే కీలక పాత్ర పోషిస్తుంది
కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

మహేశ్వరం,నవంబర్13(జనంసాక్షి): భూ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలో (కొంగరకుర్దు)భూ భారతి భూ సర్వేపై రైతులతో నిర్వహించిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, పాత రెవిన్యూ రికార్డులు,ఇతర సంబంధిత పత్రాలను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. సర్వే బృందాలకు రైతులు ,గ్రామస్థులు పూర్తి సహకారం అందించాలన్నారు. సర్వే సమయంలో తమ భూముల హద్దులను అధికారులకు చూపించి సర్వే ప్రక్రి య సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు.





కంచె తొలగించి మరీ కబ్జాలు

హైడ్రా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తొలగించి నిర్మాణాలు

- 36 ఎకరాల వివాదాస్పద భూమిలో 10-12 ఎకరాల విక్రయాలా?
- ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్లు ఎలా మంజూరయ్యాయి?



బోయినపల్లి హస్మత్‌పేట్, నవంబర్ 13 (జనంసాక్షి): బోయినపల్లి హస్మత్‌పేట్ ఛత్రీగడ్డ ప్రాంతంలోని సర్వే నంబర్-1, సీఎస్ నంబర్ 14/1958కు సంబంధించిన భూ వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సుమారు 36 ఎకరాల భూమిపై కోర్టులో వివాదం కొనసాగుతుండగా, కొందరు ఆక్రమణదారులు భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏప్రిల్‌లో బాలానగర్ రెవెన్యూ, హైడ్రా అధికారులు సంయుక్తంగా ఈ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేసి, కోర్టు వివాదంలో ఉన్నందున కొనుగోలు, విక్రయాలు చేయరాదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొందరు ఆ కంచెను తొలగించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

10 నుంచి 12 ఎకరాల విక్రయాలా?


మొత్తం 36 ఎకరాల్లో సుమారు 10 నుంచి 12 ఎకరాల వరకు ప్లాట్లుగా విభజించి విక్రయించినట్లు స్థానికుల ఆరోపణ. కోర్టులో స్టేటస్ కో కొనసాగుతున్నట్లు చెబుతున్నప్పటికీ, భూముల లావాదేవీలు, నిర్మాణాలు ఎలా సాగుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కోర్టు ఆదేశాల అమలుపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్లు ఎలా?

వివాదాస్పద భూమిలో నిర్మాణాలకు ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్లు ఎలా మంజూరయ్యాయన్నది మరో ప్రశ్న. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే అనుమతులు ఇచ్చారా? అధికారుల సహకారం ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హస్మత్‌పేట్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలుమార్లు హైడ్రా, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినా ఫెన్సింగ్ తొలగించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ సిబ్బందికి ఈ వ్యవహారం తెలిసినా ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తిరిగి పునరుద్ధరించి, కోర్టు ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. భూముల విక్రయాలు, నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారితో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్ దీపక్ తివారీ



మర్పల్లి, నవంబర్ 13 (జనంసాక్షి): భూ రీసర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం మర్పల్లి మండలం వీర్లపల్లిలో పర్యటించిన ఆయన భూ రీసర్వే, వి.బి.జి. రామ్‌జీ పనులు, పాఠశాల సౌకర్యాలు, పెన్షన్ల ధ్రువీకరణ, భూభారతి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. ప్రతి రైతు భూమిని క్షేత్రస్థాయిలో గుర్తించి హద్దులు ఖరారు చేయాలని, సర్వేకు కనీసం ఒకరోజు ముందే పట్టాదారు లకు నోటీసులు అందించాలని సూచించారు. సర్వే అనంతరం భూమి విస్తీర్ణం వివరాలను రైతులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, అంగన్‌వాడీలు, గ్రామపంచాయతీల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా బోర్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, పశువులకు నీటి తొట్టెలు నిర్మించాలని సూచించారు. వీర్లపల్లిలో నిర్మాణంలో ఉన్న మహిళా సమాఖ్య భవనం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చిన్నపాటి మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. వి.బి.జి. రామ్‌జీ పథకం కింద పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని డీఆర్డీఓను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీలో చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి పెండింగ్ అంశాలపై సమీక్షించారు. అర్హులందరికీ పెన్షన్లు మంజూరయ్యేలా చూడాలని, మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని, పనులు ప్రారంభించని ఇళ్ల మంజూరును నిబంధనల ప్రకారం రద్దు చేయాలని సూచించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించా రు. కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మధుసూదన్, ఎంఈఓ అశోక్, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ శాంత, సర్పంచ్ చుక్కారెడ్డి, ఉపసర్పంచ్ దివ్య పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 నవంబర్ 2026

నీటి లభ్యత ఆధారంగానే రబీ పంటల సాగు ప్రణాళిక

- వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్

వనపర్తి, నవంబర్ 13 (జనం సాక్షి) : రాబోయే రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, పనుల పురోగతిపై సమీక్షించారు. వనపర్తి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రబీ సీజన్‌లో వరి సాగును తగ్గించి, కూరగాయలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. సూక్ష్మ సేద్యం, పంటల వైవిధ్యీకరణ, ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం



చేసుకుంటూ ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని కొనుగోలు కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, రైతుల వివరాల నమోదు పూర్తి చేసి కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రైవేటు మార్కెట్‌లో ధాన్యం విక్రయించిన రైతులకు సైతం కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఖీమ్య నాయక్ అధికారులకు తెలిపారు. విద్యారంగంపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరును ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా హాజరు శాతాన్ని సమీక్షిస్తూ విద్యార్థుల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ వేదికలను వినియోగించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని సూచించారు. రూసా 2.0, పీఎం ఉషా, సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన పనులను వేగవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. రూ.11 వేల కోట్లతో నిర్మిస్తున్న 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్లు నిరంతరం సమీక్షించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్య పరిష్కారానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి నిబంధనల ప్రకారం జంతు జనన నియంత్రణ కేంద్రాలకు తరలించాలని సూచించారు. వీబీజీరామ్‌జీ పథకం కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టాలని, కాలువల శుభ్రతతో పాటు నిర్దేశిత పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.9.27 కోట్ల నిధులు



వనపర్తి బ్యూరో, నవంబర్ 13 (జనంసాక్షి) : వనపర్తి నియోజకవర్గంలో విద్యా, రవాణా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో సమగ్ర శిక్ష అభియాన్, నాబార్డ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.9.27 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మారుమూల గిరిజన తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.6.06 కోట్లతో పనులకు ప్రభుత్వ అనుమతులు లభించాయి.

43 పాఠశాలల్లో అభివృద్ధి పనులు

మంజూరైన నిధులతో నియోజకవర్గంలోని 43 ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఐదు పాఠశాలల్లో 47 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.6.491 కోట్లు కేటాయించారు. ప్రాథమిక పాఠశాలల్లో బాలురు, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2.304 కోట్లు, ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.47.50 లక్షలు కేటాయించారు. రేవల్లి, పెద్దమందడి, వనపర్తి, శ్రీరంగాపురం, గోపాల్‌పేట, ఘనపూర్, పెబ్బేరు తదితర మండలాల్లోని పాఠశాలల్లో ఈ పనులు చేపట్టనున్నారు. అదనపు తరగతి గదులతో విద్యార్థులకు బోధనకు అవసరమైన గదులు అందుబాటులోకి రానుండగా, ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణంతో పాఠశాలల్లో పారిశుద్ధ్య వసతులు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా బాలికలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులు దోహదపడనున్నాయి.

గిరిజన తండాలకు బీటీ రోడ్లు

మరోవైపు వనపర్తి నియోజకవర్గంలోని మారుమూల గిరిజన తండాలకు రహదారి సౌకర్యం మెరుగుపరిచేందుకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.6.06 కోట్ల నిధులతో బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. జీవో ఆర్టీ నంబర్ 127కు అనుబంధంగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నాలుగు రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరు

- ఎంఎల్ఏ గూడెం మహిపాల్ రెడ్డి
- ఛట్ పూజ సందర్భంగా చెరుకు పంపిణీ

పటాన్‌చెరు, నవంబర్ 13 (జనం సాక్షి) : భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్చెరు నియోజకవర్గం నిలుస్తోందని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఉత్తర భారతీయులు ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజ పురస్కరించుకొని శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. నియోజకవర్గ పరిధిలోని పటాన్చెరు, ఇస్నాపూర్, పాశమైలారం, బొల్లారం, రామచంద్రాపురం, అమీన్‌పూర్, గుమ్మడిదల, బొంత పల్లి, ఖాజీపల్లి, తదితర ప్రాంతాలలో నివసిస్తున్న ఉత్తర భారతీయులకు 10 లారీల చెరుకును సొంత నిధులతో కొనుగోలు చేసి ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సైతం తగు



ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా పటాన్చెరు సాకి చెరువు కట్ట పైన ఛట్ పూజ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకటేష్, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామి జాతర ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్

దేవరకద్ర, నవంబర్ 13 (జనం సాక్షి) : కురుమూర్తి స్వామి జాతరను పురస్కరించుకుని దేవస్థానం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వివిధ శాఖల సన్నద్ధతపై అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై శాఖల వారీగా సమీక్షించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, వైద్య ఆరోగ్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, రవాణా సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జాతరకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జాతర నిర్వహణ సమయంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం



అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.డి.పి.ఓ వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును కాపాడాలి



గద్వాల, నవంబర్ 13 (జనం సాక్షి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయకూడదని, నిధుల మళ్లింపును తక్షణమే నిలిపివేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గద్వాలలోని సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఉద్దేశించిన బోర్డు నిధులను దారి మళ్లించడం సరికాదన్నారు. కార్మికులకు సంబంధించిన పెండింగ్ క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే, సంక్షేమ బోర్డును 'ఇందిరమ్మ బీమా' పథకంలో విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మోడల్ స్కూల్ గ్రౌండ్‌ను రక్షించండి

- జాతీయ రహదారి అలైన్మెంట్‌తో స్కూల్ మనుగడకే ముప్పు
- మంత్రికి నాగసముద్రాల గ్రామస్తుల వినతి
- క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని కలెక్టర్ కు మంత్రి ఆదేశాలు

కోహెడ నవంబర్ 13 (జనంసాక్షి) : ఎన్‌హెచ్ 760 డిజి రహదారి అలైన్మెంట్ లో మార్పుల వల్ల నాగ సముద్రాల గ్రామ పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల కు గ్రౌండ్ లేకుండా పోతుందని, మోడల్ స్కూల్‌కు దూరంగా అలైన్మెంట్ మార్చాలని కోరుతూ గ్రామస్తులు రాష్ట్ర రవాణా, బీసీ శాఖ ల మంత్రి పొన్నం ప్రభాకర్ కు విన్నవించారు. శుక్రవారం హైదరాబాదులోని మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. జాతీయ రహదారి వల్ల పాఠశాలకు జరుగుతున్న నష్టాన్ని మంత్రికి వివరించారు. రామాయంపేట నుండి ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారి 760 డీజీ నిర్మాణ పనుల్లో భాగంగా నాగ సముద్రాల గ్రామం వద్ద గతంలో వెల్లడించిన అలైన్మెంట్ కాకుండా కొత్తగా అలైన్మెంట్ మార్చి గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్ ఆటస్థలం మధ్య నుండి మార్చినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ అలైన్మెంట్ అమలు అయితే పాఠశాలకు ఆటస్థలం లేకుండా కనుమరుగవుతుందని, పాఠశాల మనుగడకే దెబ్బ ఉందని పేర్కొన్నారు. కోహెడ మండల వ్యాప్తంగా 20 గ్రామాల నుండి ఈ పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులు చదువుతున్న నేపథ్యంలో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రహదారి అలైన్మెంట్ మార్పు కోసం కృషి చేయాల్సిందిగా వారు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ



చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్, మాజీ అధ్యక్షులు మంద ధర్మయ్య, ప్రముఖ న్యాయవాది యాల్ల శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు చింతలపల్లి భాస్కర్ రెడ్డి, తూముల ఆంజనేయులు, తుంగ సత్తయ్య, మంగళారపు లక్ష్మణ్, సుదగొని మధు, పారునంది కరుణాకర్ సాయి, పస్తం రాజు తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక కాళోజీ

వనపర్తి, నవంబర్ 13 (జనం సాక్షి) : ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రదాత కాళోజీ నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వనపర్తి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలుస రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తన కలం, గళం ద్వారా బలంగా వినిపించిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, ప్రజల హక్కులను తన రచనల ద్వారా చాటిచెప్పిన కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి అన్యాయాన్ని ప్రశ్నించిన ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి. లక్ష్మయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, ఏరువా శ్రీను, నందిమల్ల అశోక్, పలుస



శంకర్ గౌడ్, జాతృ నాయక్, నీలస్వామి, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, స్టార్ రహీం, సూర్యవంశం గిరి, మైనార్టీ అధ్యక్షుడు జోహెబ్ హుస్సేన్, హేమంత్ ముదిరాజ్, మదరావుపల్లి సునీల్ వాల్మీకి, అస్లాం, నందిమల్ల సుబ్బు, ఆరిఫ్, ఏకే పాషా, మంద రాము, అనుపటి రాము, రాజోలి నిరంజన్, ఇంతియాజ్, సెంట్రింగ్ వెంకటయ్య, వజ్రాల రమేష్ తదితరులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముత్తంగి డివిజన్ సమగ్ర అభివృద్ధికి భారీగా నిధులు

పటాన్‌చెరు, నవంబర్ 13 (జనం సాక్షి) : అభివృద్ధి చెందుతున్న ముత్తంగి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా విధులు కేటాయిస్తూ.. అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ముత్తంగి డివిజన్ కేంద్రంలోని మధురానగర్, గాయత్రి కాలనీలలో రూ.1.70 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు, ఘనపూర్ గ్రామంలో రూ.13 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న వార్డు కార్యాలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్తంగి డివిజన్ పరిధిలోని కాలనీలు, వార్డులలో ప్రజల అవసరాలకు అనుగుణంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా



నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కుమార్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, కాశీరెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేరాజ్ ఖాన్, రామకృష్ణ, డీఈ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

జడ్చర్ల, నవంబర్ 13 (జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, సమయపాలన విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం జడ్చర్ల మండలం



నస్రుల్లాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఆరుగురు ఉపాధ్యాయులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు అదనపు కలెక్టర్ గుర్తించారు. ఉపాధ్యాయుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, గైర్హాజరైన ప్రధానోపాధ్యాయుడికి, ఆరుగురు ఉపాధ్యాయులకు వివరణ కోరుతూ వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఉపాధ్యాయులందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల పనితీరుపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

సురవరం ప్రతాప్ రెడ్డి పార్కును ప్రెస్‌క్లబ్‌గా మార్చొద్దు

- ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకుల ధర్నా

వనపర్తి బ్యూరో, నవంబర్ 13 (జనంసాక్షి) : వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న సురవరం ప్రతాప్ రెడ్డి పార్కును ప్రెస్ క్లబ్‌గా మార్చాలనే స్థానిక ఎమ్మెల్యే ఆలోచనను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన పార్కును యథావిధిగా కొనసాగించాలని, ప్రెస్ క్లబ్ నిర్మాణానికి మరో అనువైన స్థలాన్ని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్లు బోలెమోని లక్ష్మయ్య, గట్టు యాదవ్, పలుస రమేష్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ ఏర్వ అరుణ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పాత్రికేయుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. అయితే ప్రెస్ క్లబ్ నిర్మాణానికి సూరవరం ప్రతాప్ రెడ్డి పార్కు సరైన స్థలం కాదని పేర్కొన్నారు.పార్కులను ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేస్తారని, వాటి ఉనికిని దెబ్బతీసేలా ఇతర నిర్మాణాలు చేపట్టడం సమంజసం కాదన్నారు. పార్కును యథావిధిగా పరిరక్షిస్తూ, జర్నలిస్టులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో కూడిన ప్రెస్ క్లబ్ నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని కోరారు.ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సూరవరం ప్రతాప్ రెడ్డి పార్కులో బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి. నిరంజన్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. పార్కుల్లో ఇతర నిర్మాణాలకు సంబంధించి మున్సిపల్ చట్టంలోని నిబంధనలను పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.పాత్రికేయుల సంక్షేమానికి సంపూర్ణ మద్దతు ఇస్తూనే, ప్రజల కోసం ఏర్పాటు చేసిన పార్కును కాపాడటమే తమ పార్టీ



అభిమతమని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, స్టార్ రహీం, నీలస్వామి, సూర్యవంశం గిరి, జోహెబ్ హుస్సేన్, హేమంత్ ముదిరాజ్, సునీల్ వాల్మీకి, హరీఫ్, ఎ.కె. పాషా, అస్లామ్, మంద రాము, అనిపాటి రాము, ఇంతియాజ్, రాజోలి నిరంజన్, వజ్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

ఆడబిడ్డల పెళ్లి.. తల్లిదండ్రులకు భారం కావొద్దు..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..
- 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ఆడబిడ్డల పెళ్లిళ్లు పేద కుటుంబాలకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పేద కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలానికి చెందిన వివిధ గ్రామాల 23 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డల వివాహ సమయంలో తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో సతమతం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, ఆడబిడ్డల వివాహాలు గౌరవప్రదంగా జరగాలన్నదే ఈ పథకాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పేదల అవసరాలకు అనుగుణంగా పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంతో చెక్కులు అందుకున్న 23 మంది లబ్ధిదారుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశారు. తమ ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే యువతకు బంగారు భవిష్యత్తు

- యువతకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తాం
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



ఆత్మకూర్, నవంబర్ 13 (జనం సాక్షి): యువతే కాంగ్రెస్ పార్టీకి బంగారు భవిష్యత్తు అని గుర్తించిన ప్రజా ప్రభుత్వం అన్ని రంగాలలో యువతకు అవకాశం కల్పిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం హన్మకొండ లోని ఎమ్మెల్యే నివాసంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కె ఆర్ దిలీప్ రాజ్ ఆధ్వర్యంలో పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ సమక్షంలో ఆత్మకూరు మండలం లోని 15 గ్రామాల యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షులను పర్శల్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా ప్రకటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి బంగారు భవిష్యత్తు యువతే అని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువతకు అన్ని రంగాలలో అవకాశం కల్పిస్తామన్నారు. రాజకీయంలో యువత ముందుకు రావాలని మీ వెనుక నేను కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. గ్రామాలలో యువత ముందుండి సేవ చెయ్యాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతను ప్రోత్సహిస్తూ ఇంత పెద్ద అవకాశం ఇస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కి జిల్లా అధ్యక్షులు కె ఆర్ దిలీప్ రాజ్, పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్, మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో గ్రామ గ్రామాన యూత్ కాంగ్రెస్ నూతన కమిటీలు వేస్తూ వాటిని మరింత బలోపేతం చేస్తామని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. గత పది సంవత్సరాలలో బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో యువతకు జరిగిన అన్యాయము, గ్రామాలలో జరిగిన దోపిడీ ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత యువతపై ఉందని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మాదాసి శ్రీధర్ ధీమ వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అవినీతి అక్రమాలే కాంగ్రెస్ పార్టీ విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి

- వాహనదారుడికి గాయాలు
- గూడూరు రేంజ్ అటవీ శాఖ అధికారి ప్రసాద రావు



గూడూరు, నవంబర్ 13 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం జాతీయ రహదారి 365పై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.గూడూరు అటవీ శాఖ అధికారి ప్రసాద రావు తెలిపిన వివరాల ప్రకారం గూడూరు మండలం దామరవంచ అటవీ ప్రాంతం నుండి ఒక చుక్కల దుప్పి రోడ్డు దాటుతుండగా జాతీయ రహదారిపై వేగంగా వస్తున్నా ద్విచక్ర వాహనదారుడు దుప్పిని బలంగా డికొట్టడంతో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది.వాహన దారుడికి తీవ్ర గాయాలు కావడంతో అతనిని వెంటనే గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అనంతరం రేంజ్ అధికారి ప్రసాద రావు ఘటన జరిగిన ప్రాంతంలో తన సిబ్బందితో మృతి చెందిన చుక్కల దుప్పిని స్వాధీనం చేసుకొని,పంచనామా నిర్వహించారు. జేసీబీ సహాయంతో గోతి తవ్వి అటవీ ప్రాంతంలో పూడ్చి పెట్టారు. ఈ కార్యక్రమంలో పారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

బయట డాక్టర్ల బోర్డులు.. లోపల నకిలీ వైద్యుల దందా!

- అర్హత కలిగిన వైద్యుల పేర్లతో ప్రజలకు మోసం...
- ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి
- వివరాలు వెల్లడించిన టీజీఎంసి వైద్య బృందం

వరంగల్ బ్యూరో, నవంబర్ 13 (జనంసాక్షి) : ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతూ, అర్హత కలిగిన వైద్యుల పేర్లు, మెడికల్ రిజిస్ట్రేషన్ నంబర్లను అడ్డుపెట్టుకుని అర్హత లేని వ్యక్తులతో వైద్య చికిత్సలు అందిస్తున్న క్లినిక్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కొరడా ఝళిపించింది. గురువారం సాయంత్రం హనుమకొండలోని రెడ్డి కాలనీ, రాయపుర, ఇందిరా నగర్ ప్రాంతంలో టీజీఎంసి వైద్య బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో పలు క్లినిక్‌లలో అధికారులు సైతం విస్తుపోయే వైద్య కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి.

ఇందిరనగర్‌లోని శ్రీలక్ష్మి ఫార్మసీ ను బి. కరుణాకర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు తనిఖీల సందర్భంగా గుర్తించారు. అదే భవనంలో శ్రీలక్ష్మి ఫార్మసీ వెనుక గదిలో అనుమతి లేకుండా శ్రీలక్ష్మి క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.ఈ క్లినిక్ బయట ఏర్పాటు చేసిన బోర్డుపై డా. మోహన కృష్ణ ఎండి జనరల్ మెడిసిన్, డా. ఎన్. అవినాష్ ఎంబిబిఎస్ పేర్లు, వారి మెడికల్ రిజిస్ట్రేషన్ నంబర్లు ప్రదర్శిస్తున్నారు. అయితే, లోపల రోగులకు చికిత్స అందిస్తున్న ఆర్.కె. రావు సుమారు 50--55 ఏళ్ల వ్యక్తిని హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్యుడిగా రోగులకు పరిచయం చేస్తూ చికిత్సలు అందిస్తున్నట్లు తనిఖీల సందర్భంగా గుర్తించారు. విచారణ లొ వ్యక్తి ఇంటర్మీడియట్ కూడా ఉత్తీర్ణత సాధించలేదని, గతంలో హైదరాబాద్ లొ ఒక డాక్టర్ వద్ద కాంపౌండర్‌గా పనిచేసినట్లు సమాచారం. రోగులకు హైదరాబాద్ నుంచి వచ్చిన డాక్టర్ అని మొదట చెప్పడం తరువాత అధికారులు వచ్చిన తరువాత అసలు విషయం బయటకు రావడం తో అక్కడ రోగుల సహాయకులు అధికారుల సమక్షంలోనే క్లినిక్ నిర్వాహకుడిని, సదరు వ్యక్తిని ప్రశ్నించారు.ఈ క్లినిక్ కు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుండి ఎటువంటి అనుమతి లేదు, బెడ్స్ కూడా ఏర్పాటు చేసారు.

అనుమతి ఒకరి పేరుతో.. వైద్యం మరొకరి చేతిలో!

అదే ప్రాంతంలోని ప్రణతి క్లినిక్‌కు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డి ఎం హెచ్ ఓ) నుంచి డా. కె. సుష్మిత పేరుతో అనుమతి ఉన్నట్లు తెలిసింది. అది కూడా గడువు ముగిసింది . అయితే, ఆమె ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి క్లినిక్‌కు వచ్చి వైద్య సేవలు అందించడం లేదని ఫిర్యాదులు కౌన్సిల్ కి వచ్చాయి.ఫార్మసీ విద్యను అభ్యసించిన ఎన్. సందీప్ అనే వ్యక్తి తానే వైద్యుడినని రోగులకు పరిచయం చేసుకుంటూ వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించి తగు సాక్షాలు సేకరించారు.అనుమతి పొందిన వైద్యురాలు స్వయంగా అందుబాటులో లేకుండా, అర్హత లేని వ్యక్తి వైద్యుడిగా వ్యవహరించడం తీవ్రమైన అంశమని మరియు మెడికల్‌ఎథిక్స్ కోడ్ ఉల్లంఘన అని టీజీఎంసి పేర్కొంది.

గతంలో కేసులు నమోదైనా మారని పరిస్థితి!

ఇదే రెడ్డి కాలనీ, ఇందిరనగర్ పరిసరాల్లో గతంలో సిద్ధార్థ క్లినిక్ నిర్వహణకు సంబంధించి విజయ, మరో క్లినిక్ నిర్వాహకుడు వేణు అనే వ్యక్తులపై తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ అండ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ యాక్ట్ మరియు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసారు .ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు టీజీఎంసి తరపున లేఖలు కూడా పంపించినప్పటికీ, తగిన చర్యలు తీసుకోలేదు.తాజాగా అదే ప్రాంతంలో విజయ, వేణు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్న కేంద్రాలపై కూడా తనిఖీలు మరోసారి నిర్వహించారు. అక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తూ, స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, నొప్పి నివారణ ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు అధిక మోతాదులో ఇస్తున్నారని టీజీఎంసీ అధికార బృందం గుర్తించింది.



బోర్డుపై పేర్లున్న వైద్యులకూ టీజీఎంసి నోటీసులు

క్లినిక్ బయట అర్హత కలిగిన వైద్యుల పేర్లు, మెడికల్ రిజిస్ట్రేషన్ నంబర్లు ప్రదర్శిస్తూ, లోపల అర్హత లేని వ్యక్తులతో వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో సంబంధిత వైద్యులకు నోటీసులు జారీ చేయనున్నారు.ఈ నేపథ్యంలో నకిలీ వైద్యులను ప్రోత్సహిస్తున్నదా. కె. సుష్మిత, డా. మోహన కృష్ణ, డా. ఎన్.అవినాష్‌లకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయనున్నట్లు కౌన్సిల్ తెలిపింది. క్లినిక్ నిర్వహణలో వారి పాత్ర, అనుమతి, వైద్య సేవల పర్యవేక్షణ వంటి అంశాలపై వివరణ తీసుకుని, బాధ్యత నిర్ధారణ అనంతరం వర్తించే ఎన్ ఎం సి ఎతిక్స్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేసింది. అదేవిధంగా నకిలీ వైద్యుల గురించి 91543 82727 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని టీజీఎంసి ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

నకిలీ వైద్యానికి అడ్డుకట్ట వేయడంలో ప్రజలు మరియు నాయకులు, అధికారులు కూడా భాగస్వాములు కావాలి ఉదాసీనంగా ఉంటే ప్రజారోగ్యానికి పెను ప్రమాదం తప్పదని టీజీఎంసీ అభిప్రాయపడింది. ఈ తనిఖీల్లో డా. వి. సరేష్ కుమార్ – సభ్యులు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్. డా. కొలిపాక వెంకటస్వామి – కో–ఆప్టెడ్ సభ్యులు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్. డా. మహమ్మద్ అన్వర్ మియా– వరంగల్ జిల్లా యాంటీ క్వాకరీ కమిటీ చైర్మన్, వరంగల్ డా.ఎస్. శిరీష్ కుమార్ -- సెక్రటరీ, ఐ ఎం ఏ, వరంగల్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చి వ్యక్తి మృతికి కారణమైన 11 మంది అరెస్టు



దండేపల్లి నవంబర్ 13 (జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో అడవి జంతువుల వేట కోసం అక్రమ విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేసి వ్యక్తి మృతికి కారణమైన కేసులో అరెస్టయిన 11 మంది నిందితులను మీడియా ముందు ప్రవేశపెడుతున్న పోలీసు అధికారులు. చిత్రంలో మంచిర్యాల ఏసీపీ, లక్సెట్టిపేట్ సీఐ, దండేపల్లి ఎస్ఐ లు వివరాలు వెల్లంచారు. మామిడిపల్లి గ్రామ శివారు కంచరబాయి అటవీ ప్రాంతంలో అడవి జంతువుల వేట కోసం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అక్రమంగా విద్యుత్ తీగలు లాగి ఉచ్చు ఏర్పాటు చేసిన ఘటనలో బోయిడి రెడ్డి (40) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ కేసులో 11 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, 2 గొడ్డళ్లు, 12 కర్రలు, గాజు సీసాలు, బైండింగ్ వైరు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. రిమాండ్ కి పంపించినట్టు తెలిపారు.

అసంపూర్తి ఫ్లైఓవర్ పనులతో ప్రమాదం

- ఇద్దరికి స్వల్ప గాయాలు



సిర్పూర్ (టి), నవంబర్ 13 (జనంసాక్షి) : సిర్పూర్ నుండి కాగజ్‌నగర్ వెళ్లే మార్గంలోని రైల్వే ఫ్లైఓవర్ పైన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సిర్పూర్ పాతట్లగూడెం కి చెందిన పర్షన మల్లేష్, పర్షన వెంకటేష్ ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనం పై కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా, ఫ్లైఓవర్ పై వాహనం అదుపుతప్పి పడిపోయారు. వెనుకనే వస్తున్న వారి సమీప బంధువులు గమనించి, వెంటనే వారిని చికిత్స నిమిత్తం స్థానిక సిర్పూర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రాణాపాయం ఏమీ లేదని, కేవలం సాధారణ దెబ్బలు మాత్రమే తగిలాయని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఫ్లైఓవర్ పనులు అసంపూర్తిగా ఉండటం, రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి, నాణ్యమైన ఫ్లైఓవర్ రోడ్డు వేసి, అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుం డా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్ బ్యూరో, నవంబరు 13 (జనంసాక్షి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. నిర్మల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'నషా ముక్త యువ – వికసిత్ భారత్' అనే అంశంపై నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వాటికి దూరంగా ఉండాల్సిన అవసరంపై చర్చించారు. యువత తమ శక్తిసామర్థ్యాలను దేశాభివృద్ధికి వినియోగించాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన యువతతోనే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జమాల్, జిల్లా యువజన అధికారి రమేష్, కౌన్సిలర్లు సాదం అరవింద్, గంజి రాజు, జింక సురేందర్, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, ఈశ్వర్, బీజేపీ నాయకులు కందుల హరీష్, భరత్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బావిలో పడి యువ రైతు మృతి



నల్లబెల్లి, నవంబర్ 13 (జనంసాక్షి): మేక పిల్లలను మేపేఅందుకు వెళ్లిన యువరైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని బజ్జుతండా గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన జరుపుల వాల్య కుమారుడు జరుపుల వెంకటేష్ (28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం తన చేను వద్ద మేక పిల్లలను మేపుతున్నాడు. ఈ క్రమంలో బావి పక్కనే ఉన్న తునిక చెట్టుపై కాయలు తెంపేందుకు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి ప్రసన్న కుమార్ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన గిరిజన విద్యుత్ ఉద్యోగులు



హన్మకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (జనంసాక్షి) : గిరిజన విద్యుత్ ఉద్యోగులకు అసోసియేషన్ బిల్డింగ్ నిర్మించుకొనుటకు స్థలం కేటాయించవలసిందిగా హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ భాజపాయి ని కలిసి వినతి పత్రం అందించడం జరిగింది... అందుకుగాను కలెక్టర్ సానుకూలంగా స్పందించడం జరిగింది. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందా రాథోడ్ , కంపెనీ గౌరవ అధ్యక్షుడు వాలు నాయక్ , కంపెనీ జనరల్ అజ్మీరా శ్రీరామ్ నాయక్ మరియు తారాచంద్ పాల్గొనడం జరిగింది.

యాకర్‌పల్లి వద్ద స్వర్ణ నదిపై తక్కువ ఎత్తు కాజ్‌వే నిర్మించాలి

- మంత్రి ఉత్తమ్‌కు శ్రీహరి రావు లేఖ ద్వారా వినతి



సారంగాపూర్, నవంబర్ 13 (జనంసాక్షి) : సారంగాపూర్ మండలం, యాకర్ పల్లి గ్రామం వద్ద స్వర్ణ నదిపై తక్కువ ఎత్తు కాజ్‌వే నిర్మించాలని కోరుతూ నిర్మల్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కూచాడి శ్రీహరి రావు రాష్ట్ర ఇరిగేషన్, ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్ శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ని హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. యాకర్ పల్లి రైతులకు నదికి ఇరువైపులా పొలాలు ఉన్నాయని, జూలై నుండి అక్టోబర్ వరకు వానాకాలం పంటలకు కీలక సమయంలో నదిలో నీరు ఉండటంతో కుడి ఒడ్డున ఉన్న పొలాలకు వెళ్ళలేకపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం మలక్ చించోలి గ్రామం మీదుగా చుట్టూ తిరిగి వెళ్ళాల్సి వచ్చి రైతులకు ఇబ్బంది, ఆర్థిక భారం అవుతోందన్నారు. అంతేకాకుండా ప్రతి ఏడాది అక్టోబర్ లో జరిగే ప్రముఖ 'అడెల్లి పోచమ్మ గంగ నీళ్ళ జాతర' కు సారంగాపూర్, దిలావర్ పూర్ మండలాల నుండి భక్తులు యాకర్ పల్లి వద్ద స్వర్ణ నది దాటి అడెల్లి పోచమ్మ ఆలయానికి వెళ్తారని, భక్తులను సురక్షితంగా దాటించడం పోలీసు, రెవెన్యూ అధికారులకు కష్టంగా మారుతోందని వివరించారు. కాజ్‌వే నిర్మిస్తే రైతులకు, భక్తులకు ఇద్దరికీ మేలు జరుగుతుందని కోరారు. వినతి పత్రాన్ని సావధానంగా విన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు శ్రీహరి రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీహరి రావుతో పాటు జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ ఉమ మహేష్ రావు, వడ్లకొండ నవీన్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సక్రమంగా చేపట్టాలి

- తప్పులకు, వివాదాలకు తావులేకుండా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, నవంబర్ 13 (జనంసాక్షి) : జిల్లాలో చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి తప్పులు, వివాదాలకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రీ సర్వే పురోగతిపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలను సమీక్షించారు. రీ సర్వే పురోగతిపై రోజువారీ నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సర్వే పరికరాలకు అదనంగా మరికొన్ని రోవర్లను త్వరలో సమకూర్చనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం రైతులకు భూముల వివరాలను తెలియజేయాలని, ఎలాంటి అపోహలు, వివాదాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే నిర్వహణతో పాటు రికార్డుల భద్రతకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. భూముల రీ సర్వే పూర్తయితే ప్రస్తుతం నెలకొన్న అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు భవిష్యత్తులోనూ వివాదాలు తలెత్తకుండా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడికి నగర బహిష్కరణ నోటీసు

నస్పూర్(జనంసాక్షి): ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్న యువకుడికి నగర బహిష్కరణ నోటీసు జారీ చేసినట్లు శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆకుల అశోక్ తెలిపారు.ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ అరుణక్క నగర్‌కు చెందిన జలంపల్లి సందీప్ (20),తండ్రి నాగేష్,2023 నుంచి 2026 వరకు పలు నేరాలకు పాల్పడుతూ రౌడీ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. రౌడీషీట్ ఉన్నప్పటికీ ప్రవర్తన మార్చుకోకుండా 2026లో వరుసగా మూడు నేరాలకు పాల్పడిన నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా నగర బహిష్కరణ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 నవంబర్ 2026

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

- 112 కిలోల గంజాయి స్వాధీనం, ఇద్దరు నిందితుల అరెస్ట్
- ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి అక్రమ రవాణా
- సూర్యాపేట పోలీసుల చాకచక్యంతో ముఠా గుట్టురట్టు



సూర్యాపేట, నవంబర్ 13 (జనంసాక్షి) : గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని, యువత భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ఏమాత్రం ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.సూర్యాపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 112 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, అక్రమ రవాణాకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 25 లక్షలు ఉంటుందని తెలిపారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.మహారాష్ట్రకు చెందిన ఐదుగురు వ్యక్తులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి అక్రమ రవాణాకు పథకం రూపొందించారు. ఒక్కొక్కరు రూ. 50 వేల చొప్పున పెట్టుబడి పెట్టి ఒడిశా రాష్ట్రంలోని జగన్నాథపురి ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కిలో రూ.2000 చొప్పున మొత్తం 112 కిలోల గంజాయిని కొనుగోలు చేశారని తెలిపారు.అనంతరం గంజాయిని 41 ప్యాకెట్లుగా తయారుచేసి ఇన్నోవా కారులో లోడ్ చేసి మహారాష్ట్రకు తరలించేందుకు బయలుదేరారని,పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మరో ఎర్టిగా కారును ఎస్కార్ట్‌గా ముందు నడుపుతూ, పోలీసుల కదలికలను గమనిస్తూ వెనుక వస్తున్న ఇన్నోవా వాహనానికి సమాచారం అందించేవారని అన్నారు. ఈ క్రమంలో నవంబర్ 7న సూర్యాపేట పట్టణ శివారులోని జాతీయ రహదారిపై పద్మావతి ఫంక్షన్ హాల్ సమీపంలో ఇన్నోవా కారు బ్రేక్‌డౌన్ అయిందని,దీంతో నిందితులు వాహనాన్ని రహదారి పక్కన వదిలి పరారయ్యారని తెలిపారు.అనుమానాస్పదంగా కారు నిలిపి ఉన్నట్లు సమాచారం అందడంతో సూర్యాపేట టూ టౌన్ ఎస్సైలు కె.గోపికృష్ణ, బి.రామచందర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని తనిఖీ చేయగా, 41 ప్యాకెట్లలో 112 కిలోల గంజాయి గుర్తించారని పేర్కొన్నారు.వెంటనే గంజాయితో పాటు ఇన్నోవా కారును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.కేసు దర్యాప్తులో భాగంగా వాహనాన్ని తిరిగి తీసుకెళ్లేందుకు నవంబర్ 12న సూర్యాపేటకు వచ్చిన ఇద్దరు నిందితులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.విచారణలో వీరు గంజాయి అక్రమ రవాణాలో పాల్గొన్నట్లు వెల్లడైందని అన్నారు. అరెస్టయిన నిందితులు ఆకాష్ విజయ్ దాబేకర్, ఆకాష్ దిలీప్ మోరే వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని, ఈ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.జిల్లాలో ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన టౌన్ సీఐ వెంకటయ్య, సూర్యాపేట టూ టౌన్ ఎస్సైలు కె.గోపికృష్ణ, రామచందర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు కొండా రమేష్, ఎన్.నవీన్‌లను ఎస్పీ అభినందించారు.ఈ సమావేశంలో కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సిఐ వెంకటయ్య, ఎస్ఐలు గోపికృష్ణ, రామచందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 33 గోవులు, దూడలు పట్టివేత

- టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన అక్రమ రవాణా ముఠా



ఖమ్మం రూరల్, నవంబర్ 13 (జనం సాక్షి) : ఖమ్మం రూరల్ మండలం అరేంపుల వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో గోవుల అక్రమ రవాణా వెలుగులోకి వచ్చిందని, ఎలాంటి అనుమతులు లేకుండా డీసీఎం వాహనంలో 33 గోవులను అక్రమంగా తరలిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. 33 గోవులతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన డీసీఎం వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు. పట్టుబడిన నలుగురు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు మరో ఐదుగురు పరారీ ఉన్నట్లు వెల్లడించారు.

తెలంగాణ మలిదశ ఉద్యమ నేత దుండిగాల నారాయణకు ఘన నివాళి



హుజూర్‌నగర్, నవంబర్ 13 (జనంసాక్షి) : తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, జాగృతి హుజూర్‌నగర్ పట్టణ కన్వీనర్ దుండిగాల నారాయణ విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల పట్టణంలోని ఉద్యమకారులు, పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారాయణ భౌతికకాయానికి తెలంగాణ మలిదశ ఉద్యమకారుల కన్వీనర్ మేకల నాగేశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చిన్న వయసులోనే నారాయణ పట్టణంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా పనిచేశారని గుర్తుచేసుకున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి, పూట గడవని కష్ట పరిస్థితుల్లో సైతం ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.ఉద్యమ సమయంలో ఎన్నో అక్రమ కేసులను, పోలీసు నిర్బంధాలను నారాయణ మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై నల్లజెండాలు ఎగురవేయాలని జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు, పోలీసు వలయాన్ని ఛేదించుకుని మరీ నల్లజెండా ఎగురవేసిన ధీశాలి అని ప్రశంసించారు. తోటి ఉద్యమకారులందరితో ముద్దుగా 'నారి' అని పిలిపించుకున్న ఆయన నేడు అమరుడయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దుండి నారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, ఆయన కలలుగన్న ప్రజాస్వామిక తెలంగాణ సాకారమయ్యేంతవరకు ఉద్యమకారులు పోరాటాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ నివాళి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల అధ్యక్షుడు సామా అంజిరెడ్డి, నాయకులు కేఎల్ఎన్ రావు, దొడ్డ నరసింహారావు, జాగృతి ఎస్కే మస్తాన్, నూకల చంద్రం, భిక్షం, గోవర్ధన్, సుధాకర్, దొడ్డ రాజేష్, సిహెచ్ నరసింహారావు, వేణు, మామిడి పన్నీరు తదితరులు పాల్గొని నారాయణ మృతికి సంతాపం తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 13 (జనం సాక్షి) : మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్రం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇందులో సమాజంలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నషా విముక్త్ భారత్ కింద పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్ నిరోధ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో సుమారు 600 మంది సభ్యులతో ఈగల్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల కేసులు నమోదు చేసి, 19 వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేసి కఠిన సెక్షన్లు నమోదు చేశారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి ఎవరు ఫోన్లు చేసి సిఫార్సులు చేసినా ఉపేక్షించేది లేదని, తన సొంత మనుషులైనా సరే చట్టప్రకారం జైలుకు పంపాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అదనపు కమిషనర్ కిషన్, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ డి. జానయ్య, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హామీ
- కీలక పదవులు పొందిన జర్నలిస్టులకు ఎమ్మెల్యే ఘన సన్మానం



తాండూరు, నవంబర్ 13 (జనంసాక్షి) : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై సంబంధిత ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని పేర్కొన్నారు. శుక్రవారం తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) వికారాబాద్ జిల్లా నూతన కార్యవర్గంలో కీలక పదవులు పొందిన జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బషీరాబాద్ సాక్షి విలేకరి బి. నర్సిములు, కోశాధికారిగా ఎన్నికైన పి. వెంకట్‌రెడ్డి, కార్యదర్శి రాంచందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏబీఎన్ నర్సిములు, కార్యవర్గ సభ్యులు వెంకటేశం (వాసు), శాంతకుమార్, బాబర్, కే. నర్సిములను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ తాజా మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసచారి, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి, కోటపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ మధులత శ్రీనివాసచారి, సర్ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు, వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

విలీన మండలాల్లో శాశ్వత జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలి



భద్రాచలం, నవంబర్ 13 (జనంసాక్షి) : పోలవరం జిల్లాలోని విలీన మండలాల ప్రజలకు స్థానికంగానే న్యాయసేవలు అందుబాటులోకి తీసుకురావాలని, చింతూరు లేదా ఎటపాకలో పూర్తిస్థాయి శాశ్వత జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాలని విలీన మండలాల న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ బట్టు దేవానంద్, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైనప్పటి నుంచి స్థానికంగా శాశ్వత న్యాయస్థానం లేకపోవడంతో ప్రజలు కోర్టు విచారణల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని న్యాయవాదులు వివరించారు. ముఖ్యంగా గిరిజన కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులు ప్రయాణ ఖర్చులతో పాటు రోజువారీ కూలీ పనులు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్థానికంగా కోర్టు లేకపోవడం వల్ల కేసుల విచారణలో జాప్యం జరుగుతోందని, నాలుగు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం కలిగిన చింతూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో లేదా ఎటపాక మండల కేంద్రంలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రజల గడప వద్దకే సత్వర న్యాయం అందేలా ప్రభుత్వం, న్యాయశాఖ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, విలీన మండలాల న్యాయవాదుల సంఘం సభ్యులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, వలవల సురేష్ కుమార్, కొత్తపల్లి రాంబాబు, విజ్జగిరి రవితేజ, సున్నం వెంకటరమణ, మోసం సంజీవరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంపీడీవో, ఎంపీవో వేధింపులంటూ వార్డు సభ్యురాలి సంచలన ఆరోపణలు

- 25 వేల లంచం డిమాండ్.. ప్రజాప్రతినిధి రాజీనామా అస్త్రం
- ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని ఆవేదన

మర్రిగూడ, నవంబర్ 13 (జనం సాక్షి) : ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ప్రజాప్రతినిధిగా ఎన్నికైన ఆమెకు అధికారుల వేధింపులు ఎదురవుతున్నాయా? చేసిన పనికి సంబంధించిన బిల్లు మంజూరు కావాలంటే రూ. 25 వేల లంచం ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారా? అధికారుల తీరుతో విసిగిపోయి చివరకు వార్డు సభ్యత్వానికే రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారా? నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కమ్మగూడెం గ్రామ పంచాయతీలో చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కమ్మగూడెం గ్రామ పంచాయతీ నాలుగో వార్డు సభ్యురాలు కొయ్య అనిత ఆరోగ్యం తన వార్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మర్రిగూడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) నుంచి ఎదురవుతున్న వేధింపుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె ఆరోపిస్తున్నారు. తాను చేసిన పనికి సంబంధించిన బిల్లు విషయంలో రూ. 25 వేల లంచం డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె పేర్కొన్నట్లు తెలిసింది.

ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేదా..?

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మండల అధికారుల వ్యవహారశైలిపై పలుమార్లు విన్నవించినట్లు వార్డు సభ్యురాలు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవోను మార్చాలనే ప్రతిపాదనను సైతం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

అధికారుల తీరుపై రాజకీయ వర్గాల్లో చర్చ!

ఒకవైపు ప్రభుత్వం పారదర్శక పాలన, అవినీతి రహిత వ్యవస్థ గురించి చెబుతుండగా, మరోవైపు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధే అధికారులపై లంచం డిమాండ్ ఆరోపణలు చేస్తూ రాజీనామాకు సిద్ధపడటం చర్చకు దారితీసింది. కొందరు స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలతోనే అధికారుల వ్యవహారశైలి కొనసాగుతోందని వార్డు సభ్యురాలు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది.



అర్హులైన పేదలకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి



భద్రాచలం, నవంబర్ 13 (జనంసాక్షి) : భద్రాచలంలోని మనుబోతుల చెరువు వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగిందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి అర్హులైన పేదలకే ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆమె నిరుపేదలతో కలిసి ఇళ్ల సముదాయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబ్బులు, రాజకీయ పలుకుబడి, సిఫార్సులు ఉన్నవారికే ఇళ్లు కేటాయించారని, పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. నిరుపేదలమని చెప్పి ఇళ్లు పొందిన కొందరు వాటిలో నివసించకుండా ఇతరులకు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారని ఆరోపించారు. మరోవైపు నిర్మాణాలు పూర్తికాని ఇళ్లలోకి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు ప్రవేశించి ఆక్రమణలో ఉంటున్నారని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, ఇళ్ల కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపి నిజమైన నిరుపేదలను గుర్తించి వారికి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్లు దక్కే వరకు, అసంపూర్తి నిర్మాణాలు పూర్తయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని కనగాల చైతన్య స్పష్టం చేశారు.

రూ.25 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం

- స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్
- ఒకేచోట ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యం



దేవరకొండ, నవంబర్ 13 (జనం సాక్షి) : దేవరకొండ పట్టణంలో రూ. 25 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నిర్మించేందుకు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శుక్రవారం స్థల పరిశీలన చేశారు. పట్టణంలోని 18వ వార్డు పరిధిలో పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ పక్కన ఉన్న స్థలాన్ని ఆర్డీవో, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయాల నిర్మాణానికి అనువైన స్థలం, ప్రజలకు రాకపోకల సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల సముదాయం అందుబాటులోకి వస్తే ప్రజలు వివిధ ప్రభుత్వ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని, అన్ని సేవలు ఒకేచోట పొందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పున్న వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, హనుమంతు వెంకటేష్ గౌడ్, మహ్మద్ రయీస్, మారుపాకుల సురేష్ గౌడ్, వడ్త్యా దేవేందర్ నాయక్, లోకసాని శ్రీధర్ రెడ్డి, వై.ఎస్. కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 21న బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో వంటావార్పు



సూర్యాపేట, నవంబర్ 13 (జనంసాక్షి) : సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సాధించాలనే డిమాండ్‌తో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని 200 సెంటర్లలో వంటావార్పు కార్యక్రమంతో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బుల్లెట్ ట్రైన్ సాధన కమిటీ సభ్యులు ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కిరాణ మర్చంట్ అసోసియేషన్ భవనంలో జరిగిన సన్నాహక కార్యక్రమంలో అఖిల పక్షాల ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా పట్టణంలోని 200 సెంటర్ ల వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిరసనగా చేపట్టినట్లు తెలిపారు. నేషనల్ హైవే 65కు సమాంతరంగా ప్రతిపాదించిన శంషాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను సూర్యాపేట మీదుగా నిర్మించాలని నాయకులు డిమాండ్ చేశారు.సూర్యాపేట ప్రాంత ప్రజలకు, వ్యాపార వర్గాలకు, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఈ రైలు మార్గం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట నుంచి మళ్లించే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు.సూర్యాపేట అభివృద్ధి హక్కును కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రజా పోరాటంతో ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సాధించుకుంటామని స్పష్టం చేశారు.ఏఏ వర్గం ఏఏ సెంటర్లో వంటా వార్పు నిర్వహించాలనీ ఖరారు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా పెద్దపల్లి



- అందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

పెద్దపల్లి,నవంబర్ 13(జనంసాక్షి) : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్స్‌లో నిషా ముక్త్ భారత్, ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ,పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ, పోలీస్ శాఖ సూచనలు,విజ్ఞప్తులను శ్రద్ధగా ఆలకించేందుకు కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ ముందుగా ధన్యవాదాలు తెలిపారు. ప్రిన్సిపాల్ తమ వ్యక్తిగత జీవిత అనుభవాలను ఉదాహరణలుగా వివరిస్తూ విద్యార్థులకు మంచి మార్గదర్శకత్వం అందించడం అభినందనీయమని అన్నారు. సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వారు, సమాజంపై ప్రభావం చూపగలిగిన వ్యక్తులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు విద్యార్థులకు రోల్ మోడల్స్‌గా నిలిచి వారిని సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు వస్తే పెద్దపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం సాధ్యమేనని తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం డీసీపీలు,ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌ఐలు,ఇతర పోలీసు సిబ్బంది నిరంతరం కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పెద్దపల్లి రైల్వే స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మహారాష్ట్ర ప్రాంతం నుంచి కొందరు వ్యక్తులు రైల్వే స్టేషన్ ద్వారా వచ్చి యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల వినియోగం వైపు ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా అమాయకులైన కొంతమంది యువకులను లక్ష్యంగా చేసుకుంటున్నా రని, అందువల్ల ఈ విషయంలో వారి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులకు తన ప్రత్యేక విజ్ఞప్తి ఏమిటంటే,తమ పిల్లలు ఎక్కడికి వెళు తున్నారు,ఎవరితో కలిసి ఉంటున్నారు, వారి స్నేహితులు ఎవరు, వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వస్తున్నాయా అనే విషయాలను నిరంతరం గమనించాలని సూచించారు. పిల్లలు కోపగించుకున్నా సరే,వారి భవిష్యత్తు దృష్ట్యా వారిని ప్రశ్నించాలని అన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ,ప్రేమతో కూడిన మందలింపు పిల్లలను చెడు అలవాట్లకు దూరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రహరీ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీల ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై నిరంతరం అవగాహన కల్పించడంతో పాటు,విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ ఈ సమస్యను సమిష్టిగా నియంత్రించాలని సూచించారు. డ్రగ్స్ ని యంత్రణలో పోలీసులతో పాటు విద్యా సంస్థలు,తల్లిదం డ్రులు,సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను నేరస్థులుగా చూడకుండా, వారిని ఆ వ్యసనం నుంచి బయటపడేలా చేయడానికి కూడా మనమంతా కృషి చేయాలని సీపీ అన్నారు. వారు మారాలని, మంచి జీవితాన్ని గడపాలని ఆసక్తి చూపితే పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహాయ సహకా రాలు అందిస్తామని తెలిపారు. సింగరేణి మెడికల్ కాలేజీ లో డీ-అడిక్షన్ కేంద్రం అందుబాటులో ఉందని,మత్తు పదార్థాలకు బానిసైన వారికి వైద్యుల పర్యవేక్షణలో వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందించి వ్యసనం నుంచి బయటపడేందుకు సహకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పలువురు ఈ కేంద్రం ద్వారా చికిత్స పొందుతూ వ్యసనాలకు దూరమై సమాజంలో మంచి జీవితాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. కాబట్టి మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారికి అవసరమైన చికిత్స అందించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ తరఫున తమ విజ్ఞప్తి ఒక్కటేనని సీపీ అన్నారు. ఎవరూ మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఇప్పటికే అలవాటు పడిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చికిత్స పొందాలని కోరారు. అదే సమయంలో మాదకద్రవ్యాల సరఫరా,విక్రయాలు, వినియోగాన్ని ప్రోత్సహించడం లేదా ఈ అక్రమ కార్యకలాపాల్లో భాగస్వాములు కావడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత భవిష్యత్తును కాపాడటం మనందరి బాధ్యత అని అన్నారు. పోలీస్ శాఖకు ప్రజలు సహకరిస్తేనే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావాలని సీపీ అంబర్ కిషోర్ ఝూ కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ,పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్,మహిళా పోలీస్



బిడ్డకు జన్మనిచ్చి తనువు చాలించిన బాలింత

పెద్దపల్లి,నవంబర్ 13(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో మంథని పట్టణానికి చెందిన ఓ మహిళ ప్రసవం కొరకు బుధవారం సాయంత్రం ఆసుపత్రిలో అడ్మిట్ అయింది. అర్ధరాత్రి 2 గంటలకు సిజరిన్ చేసి ఆపరేషన్ చేశారు. ఆ మహిళ పండంటి బాబుకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం మహిళకు రక్తస్రావం ఎక్కువ కావడంతో బ్లడ్ ఎక్కించినప్పటికీ చికిత్స చేసిన రక్తస్రావం ఆగకపోవడంతో వైద్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి పంపించారు. అప్పటికే తీవ్ర రక్తస్రావంతో బాధిత మహిళా మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. శుక్రవారం కుటుంబ సభ్యులు బంధువులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిందని మీడియా ముందు గోడువెల్లబోసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులకు న్యాయం చేసే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతామని సర్ది చెప్పారు. ఆసుపత్రి సూపరిండెంట్ స్పందించి మీడియాతో మాట్లాడుతూ మంథని పట్టణానికి చెందిన మహిళ బుధవారం ఆసుపత్రికి వచ్చిన మాట నిజమేనని ఆమె హై బీపీ తో ఉన్నప్పటికీ అడ్మిట్ చేసుకొని డ్యూటీ డాక్టర్లు సిజరిన్ చేసి ప్రసవం చేశారని ప్రసవ అనంతరం రక్తస్రావం కావడంతో బ్లడ్ ఎక్కించారు. కిడ్నీలు పనిచేయకపో వడంతో మూత్రం రాకపోగ మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ పంపించామని తెలిపారు. సంఘటన జరిగిన విషయంపై జిల్లా కలెక్టర్ కు,కమిషనర్ కు సమాచారం ఇచ్చామని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిజామాబాద్-కాచిగూడ రైళ్ల పునరుద్ధరణ

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. రైల్వే లైన్ డబ్లింగ్ పనుల్లో భాగంగా గతంలో రద్దు చేసిన నిజామాబాద్?కాచిగూడ మధ్య నడిచే రైళ్లను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. మనోహరాబాద్ రైల్వే యార్డులో అదనపు లైన్ ఏర్పాటు పనుల కారణంగా గతంలో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్ని రైళ్లను ఆలస్యంగా నడిపించారు. తాజాగా పనులకు సంబంధించిన మార్పులను సమీక్షించిన రైల్వే అధికారులు రద్దు చేసిన రైళ్లను తిరిగి యథావిధిగా నడిపించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కాచిగూడ-నిజామాబాద్ మధ్య నడిచే రైలు నంబర్ 77601, నిజామాబాద్-కాచిగూడ మధ్య నడిచే రైలు నంబర్ 77602 రైళ్లను నవంబర్ 22వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం పునరుద్ధరించారు. అలాగే సికింద్రాబాద్- సిద్దిపేట, సిద్దిపేట-సికింద్రాబాద్, కాచిగూడ-మెదక్, మెదక్-కాచిగూడ మధ్య నడిచే రైళ్లను కూడా నిర్ణీత తేదీల నుంచి తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు. మరోవైపు కొన్ని రైళ్లను 60 నుంచి 75 నిమిషాల పాటు నియంత్రించి నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ వెల్లడించారు. రైళ్ల పునరుద్ధరణతో నిజామాబాద్ నుంచి కాచిగూడకు ప్రయాణించే ప్రయాణికులకు ఊరట లభించనుంది.

రబీకి నిజాంసాగర్ నీటిని విడుదల చేయాలి!

నిజాంసాగర్(జనంసాక్షి): రబీ పంటల సాగుకు అవసరమైన సాగునీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేయాలని నిజాంసాగర్ మండల పరిధిలోని పలువురు రైతులు అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నిజాంసాగర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పంటల సాగుకు నీటి అవసరం ఎంతగానో ఉందని, సరైన సమయంలో సాగునీరు అందకపోతే పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట సొసైటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, అచ్చంపేట సర్పంచ్ లక్ష్మయ్య, సుల్తాన్ నగర్ సర్పంచ్ బ్రహ్మం, వడ్డేపల్లి సర్పంచ్ అంజయ్య, ఆరేపల్లి సర్పంచ్ మోహన్ నిజాంసాగర్ మండలానికి చెందిన రైతులు పాల్గొన్నారు.





ఏకపక్ష సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

సొంత పార్టీ ఎంపీ కార్యక్రమానికి వెళ్తే సస్పెండ్ చేస్తారా?

పెద్దపల్లి,నవంబర్ 13(జనంసాక్షి) : తమపై పార్టీ విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహార్ రావు మండలం కొయ్యూరు గ్రామ ఉపసర్పంచ్ లకవత్ సవేందర్,మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ ఖలీముద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపసర్పంచ్ లకవత్ సవేందర్ మాట్లాడుతూ ఇటీవల పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి నాలుగో వార్డు సభ్యురాలు లక్ష్మి,ఆమె భర్త తిరుపతి ఆహ్వానం మేరకు తాము హాజరైనట్లు తెలిపారు. అయితే,అదే రోజు సాయంత్రం మండల అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్ తమను పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు పత్రికా ప్రకటన విడుదల చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఈ విషయంపై మండల అధ్యక్షుడిని ప్రశ్నించగా మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే సస్పెండ్ చేశామని చెప్పారని వారు పేర్కొన్నారు. కనీసం సంజాయిషీ నోటీసు ఇవ్వకుండా,ఎవరు ఫిర్యాదు చేశారో ఆ కాపీని కూడా చూపించకుండా ఏకపక్షంగా బహిష్కరించడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల సర్పంచులు,గ్రామ అధ్యక్షులు పెద్ద ఎత్తున హాజరైనప్పటికీ వారిని వదిలేసి కేవలం తమనే లక్ష్యంగా చేసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు వెళ్లి టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార రావుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. మండల అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్ తక్షణమే తమ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోకపోతే,ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పార్టీ కోసం తాము చేసిన కృషిని వివరిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వారి వెంట మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి భూమయ్య పాల్గొన్నారు.

అటవీ భూముల విషయంలో సమన్వయంతో వ్యవహరించాలి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనంసాక్షి: పాత అసైన్మెంట్ భూములు, పాత ఆర్ వో ఎఫ్ ఆర్ పట్టాదారులను ఇబ్బందులకు గురి చేయొద్దని అటవీ శాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. రైతుల హక్కులకు భంగం కలగకుండా చూడటంతో పాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఒకటి రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యల తో పాటు రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం విక్రయించవద్దన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలో రైతులకు సంబంధించిన అటవీ భూ సమస్యల పరిష్కారం, అటవీ రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం, ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ), జిల్లా అటవీ శాఖ అధికారి డి ఎఫ్ వో జిల్లా సహకార అధికారి డి సి వో, ఆర్ డి వో తదితర అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, పాత అసైన్మెంట్ భూములు, పాత ఆర్ వో ఎఫ్ ఐ పట్టాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

హామీలను తక్షణమే అమలు చేయాలి




- దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకుంటే మరో ఉద్యమం
- ఆసరా పింఛన్ల హామీని తక్షణమే అమలు చేయాలి
- వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్ రావు
- ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్

పెద్దపల్లి,నవంబర్ 13(జనంసాక్షి) : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు దివ్యాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మరో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలో కమాన్ రోడ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్ రావు,ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్ మాట్లాడుతూ. ఖమ్మంలో నిర్వహించిన జాతీయ సమావేశంలో భాగంగా పెద్దపల్లి జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులకు కీలక పదవులు దక్కాయని,జాతీయ కమిటీ సభ్యురాలిగా చింతిరెడ్డి సంతోష రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మీర్జా అమీన్ బేగ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కన్నం స్వామి నియమితులయ్యారని, అలాగే రాబోయే పదిహేను రోజుల్లో జిల్లా కమిటీని కూడా పూర్తిస్థాయిలో విస్తరిస్తామని వారు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7 నాటికి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ దివ్యాంగులకు రూ.6 వేలు,వృద్ధులు మరియు వితంతువులకు రూ.4 వేల ఆసరా పింఛన్ హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదని,కండరాల క్షీణతతో బాధపడుతున్న వారికి ప్రకటించిన రూ.15 వేల పింఛన్‌ను సైతం వెంటనే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియలో ఒంటరి మహిళలు,వృద్ధుల విభాగాలను తొలగించడం సరికాదని తప్పుబడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పన్నెండు లక్షల దరఖాస్తులన్నింటినీ తక్షణమే ఆమోదించాలని వారు కోరారు. మహిళలకు కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని దివ్యాంగులకు కూడా వర్తింపజేయాలని, ప్రస్తుతం దివ్యాంగ పురుషులు సగం టికెట్ పైనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అంబాల నరేష్,ఐరెడ్డి నారాయణ రెడ్డి,కన్నం స్వామి,ఎం.అమిన్ బేగ్,నరిగే మల్లేశ్వరి,కల్వల స్వాతి,రాసపెల్లి రవి,గోస్కె స్వామి,పల్లె రాకేష్,కాదాసి కిరణ్,పోశం,తదితరులు పాల్గొన్నారు.

‘సదర్’కు ముమ్మరంగా ఏర్పాట్లు

కరీంనగర్ టౌన్, నవంబర్ 13, (జనంసాక్షి): కరీంనగర్ నగర యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం సర్కస్ మైదానంలో నిర్వహించనున్న సదర్ సమ్మేళనానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో యాదవ సంఘం ప్రతినిధులు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో కలిసి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సమ్మేళనానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే



సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, మాజీ కార్పొరేటర్ ఐలందర్ యాదవ్, సదర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ రవి యాదవ్, ప్రతినిధులు ప్రసాద్ యాదవ్, సుధా యాదవ్, హరీష్ పటేల్, అభిలాష్ పటేల్, సాయి కృష్ణ బిట్టు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రతి ధాన్యం బస్తాను 41 కిలోలతోనే తూకం వేయాలి

పెద్దపల్లి,నవంబర్ 13(జనంసాక్షి) : పెద్దపల్లి మండలం రాంపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పెద్దపల్లి సింగిల్ విండో చైర్మన్ ముత్యాల నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమైన ఆయన ధాన్యం కొనుగోలు, తూకం, చెల్లింపులకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం చందపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి బస్తాల తూకాన్ని పరిశీలించారు. ప్రతి ధాన్యం బస్తాను 41 కిలోల బరువుతోనే తూకం వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొనుగోళ్లలో పారదర్శకత పాటిస్తూ రైతులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రాంపల్లి గ్రామ సర్పంచ్ సంపత్ రావు,పీఏసీఎస్ డైరెక్టర్లు జూపల్లి తిరుపతి రావు,పిన్‌రెడ్డి సుధాకర్ రెడ్డి,దొనేటి రామ్మోహన్ స్వరూప,సీఈఓ మధన్‌మోహన్,వార్డు సభ్యులు,రైతులు ,సిబ్బంది,స్థానిక నాయకులు పాల్గొన్నారు.





గన్నేరువరంను మోసం చేస్తే ఊరుకోం

రసమయి బాలకిషన్

గన్నేరువరం, (జనంసాక్షి): గన్నేరువరం మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పా టు చేశారు. మానకొండూరు నియో జవర్గం ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. గన్నేరువరం మండలంలో పర్యటించిన ఆయన, డబుల్ రోడ్డు, కరెంటు, వడ్ల కొనుగోళ్లపై ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రజల సమస్యలు వింటుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు ఎంపీ భూమి పూజ

ధర్మారం,నవంబర్ 13(జనంసాక్షి) : ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారం మండల కేంద్రంలో ఎంపీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చేపట్టామని తెలిపారు. ప్రజా అవసరాలకు పెద్దపీట వేస్తూ ఎంపీ వంశీకృష్ణ ముందడుగు



వేస్తున్నారని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ హాకీ టోర్నీకి కరీంనగర్ క్రీడాకారులు

మలేషియాలో జరిగే పోటీలకు రెహమాన్ అలీ, రెహాన్ ఖాన్ ఎంపిక

కరీంనగర్ కల్చరల్, నవంబర్ 13 (జనంసాక్షి): మలేషియాలోని పినాంగ్‌లో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న 49వ పేష్టా యూఎస్ఎం అంతర్జాతీయ ఇండోర్ హాకీ ఆహ్వానిత టోర్నమెంట్‌కు తెలంగాణ రాష్ట్రం నుంచి కరీంనగర్‌కు చెందిన సీనియర్ హాకీ క్రీడాకారులు మహమ్మద్ రెహమాన్ అలీ, మెహద్ రెహాన్ ఖాన్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని హమీద్ లెవెన్ హాకీ ఫిట్‌నెస్ క్లబ్ అధ్యక్షుడు, కోచ్ తారీక్ మహమ్మద్ వెల్లడించారు. గత జూన్‌లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన సీనియర్ ఇండోర్ హాకీ జాతీయస్థాయి పోటీల్లో వీరిద్దరూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ టోర్నీకి ఎంపికైనట్లు తెలిపారు. హాకీపై ఆసక్తి, నిరంతర సాధన, కఠోర శ్రమ, క్రమశిక్షణతో కూడిన పట్టుదలే వారి విజయానికి కారణమని పేర్కొన్నారు. కరీంనగర్ హాకీ సంఘం, హమీద్ లెవెన్ హాకీ ఫిట్‌నెస్ క్లబ్ అందించిన ప్రోత్సాహం కూడా వారి ఎదుగుదలకు దోహదపడిందన్నారు. క్రీడాకారుల ఎంపిక పట్ల



కరీంనగర్ హాకీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ రవీందర్ సింగ్, సురేందర్ సింగ్‌తో పాటు సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రంతో పాటు కరీంనగర్ జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రైతుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడాలి

బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి): సహకార సంఘాలు రైతుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడాలని బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఎడపల్లి మండలం జానకంపేట్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో ఎడపల్లి, జానకంపేట సహకార సంఘాల నూతన పాలకవర్గం చైర్మన్ కమిటీ సభ్యులతో బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమక్షంలో క్లస్టర్ అధికారిని రమావతి గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు ప్రత్యేక దృష్టిసారించడం జరిగిందని అందులో భాగంగా కోట్లాది రూపాయలతో నూతన పాఠశాలలో నిర్మించడంతో పాటు ఉపాధ్యాయుల కొరతను సైతం తగ్గించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉంటుందని అందులో భాగంగా ప్రజలు పనిచేసే పార్టీకే పట్టం కట్టాలని బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీవో విజయ కుమారి, తాసిల్దార్ దత్తాద్రి, ఎంపీడీవో శంకర్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్ల రామ్మోహన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాణిక్ రజిత యాదవ్, జానకంపేట సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిలుక రవికుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 నవంబర్ 2026





పెద్దపల్లికి సంక్షేమ పథకాల వరద!

- 5,124 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు
- నవంబర్ 19న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తాం
- రూ.20 లక్షలతో యాదవ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ

పెద్దపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గానికి 5,124 నూతన చేయూత పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 11 వేలకుపైగా పింఛన్లు మంజూరు కాగా, అందులో 48 శాతం పెద్దపల్లి నియోజకవర్గానికే దక్కాయని తెలిపారు. ఎలిగేడు మండలం దూళికట్టలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎలిగేడు, జూలపల్లి మండలాల లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలిగేడు మండలంలో 398 మందికి, జూలపల్లి మండలంలో 406 మందికి పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు జమ అవుతుందని చెప్పారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో పింఛన్లు పొందలేకపోయిన వారికి రీ-సర్వే ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వచ్చే ఏప్రిల్ నుంచి కొత్త ప్రక్రియ చేపట్టి మూడు, నాలుగు నెలల్లో అర్హులైన వారందరికీ పింఛన్లు అందేలా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గానికి తొలి విడతలో మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే 2,700 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని వివరించారు. కార్యక్రమంలో రెండు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధు లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కుల సంఘాలకు అభివృద్ధి భరోసా

సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఏడో వార్డులో రూ.20 లక్షలతో నిర్మించనున్న యాదవ కమ్యూనిటీ హాల్‌కు ప్రభుత్వ విప్ విజయరమణారావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాలకు అధునాతన భవనాలు, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాల్‌తోపాటు ప్రహరీ నిర్మాణం చేపడతామని, అవసరమైతే అదనంగా మరో రూ.5 నుంచి రూ.10 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. సుల్తానాబాద్ నుంచి రైల్వేగేటు వరకు డబుల్ రోడ్డు నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని, ఫ్లైఓవర్ నిర్మాణం అనంతరం యాదవనగర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. యాదవనగర్‌లో హెల్త్ సెంటర్ ప్రారంభించామని, మార్కండేయ కాలనీలోనూ ఆరోగ్య కేంద్రం పనులు పూర్తి చేస్తామని చెప్పారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామన్నారు. సుల్తానాబాద్ మండలంలో శనివారం నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బరుదు రాధాకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, యాదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేవెళ్లలో రోడ్డు ప్రమాదం..
బోల్తాపడిన ఆర్మీ వాహనం

14 మంది జవాన్లకు తీవ్ర గాయాలు గోల్కొండ ఆర్మీ ఆసుపత్రికి తరలింపు





చేవెళ్ల, నవంబర్ 13 (జనంసాక్షి) : చేవెళ్ల మండల పరిధిలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ట్రైనింగ్ నిమిత్తం వెళ్తున్న ఆర్మీ వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్మీ క్యాంపస్ నుంచి షాబాద్ మండలంలోని ట్రైనింగ్ సెంటర్‌కు 14 మంది జవాన్లు ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో చేవెళ్ల మండలం అల్లావాడ గేట్ సమీపానికి చేరుకోగానే వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపై పల్టీలు కొడుతూ బోల్తాపడింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొని ఆగిపోయింది. ప్రమాదంలో వాహనంలో ఉన్న 14 మంది జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం తీవ్రతను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న అధికారులు అంబులెన్స్‌లను రప్పించి క్షతగాత్రులను గోల్కొండ ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల ప్రత్యేక బృందం జవాన్లకు అత్యవసర చికిత్స అందిస్తోంది. ఒకవేళ వాహనం చెట్టును ఢీకొని ఆగకపోయి ఉంటే ప్రమాద తీవ్రత మరింత పెరిగి ఉండేదని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఘటనపై ఆర్మీ, పోలీసు అధికారులు వివరాలు సేకరించి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



నిన్న తప్పిపోయి.. నేడు శవమై తేలి..

కుటుంబ సభ్యులకు విషాదం మిగిల్చిన అమ్ములు

ముస్తాబాద్ నవంబర్ 13 (జనం సాక్షి) : ముస్తాబాద్ మండల కేంద్రంలో మూడేళ్ల చిన్నారి బావిలో పడి మృతి చెందిన ఘటన కలకలం రేపింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో నివాసం ఉంటున్న ముచ్చర్ల మౌనిక ఎల్లయ్య దంపతుల కుమార్తె అమ్ములు (3) సంవత్సరాలు, గురువారం ఉదయం సుమారు పది గంటల సమయంలో కనిపించకుండా పోయిందని పరిసర ప్రాంతాల్లో వెతికిన కుటుంబ సభ్యులు చివరకు పోలీసులకు సమాచారం అందించగా,సీఐ నాగేశ్వరరావు,ఎస్సై జ్యోతి పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం అమ్ములు వారి నివాసానికి కొద్ది దూరంలో గల వ్యవసాయ బావిలో శవమై తేలడంతో ఆ ఘటన ముస్తాబాద్ లో కలకలం రేపింది.నిన్న తప్పిపోయి. నేడు శవమై తేలిన అమ్ములు విషాదం మిగిల్చడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పాప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్లకు తరలించినట్లుగా సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసు వారి దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

రూర్బన్ పనులను ప్రారంభించిన బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



ఎడపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి) : ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయం పరిధిలో నూతనంగా రూర్బన్ నిధులు 90 లక్షలతో నిర్మించిన కళ్యాణ మండపంను శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో గతంలో పర్యాటకులు భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ఎన్నో జంటలు స్వామివారి సన్నిధిలో వివాహం చేసుకునేందుకు సుముఖతను చూపుతున్నప్పటికీ సరైన సౌకర్యాలు లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఈ విషయాన్ని గ్రహించిన బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి 90 లక్షలతో రూర్బన్ నిధులు కళ్యాణ మండపం నిర్మాణానికి మంజూరు చేయగా నేడు దానిని ప్రారంభించారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీవో విజయ కుమారి, తాసిల్దార్ దత్తాద్రి, ఎంపీడీవో శంకర్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్ల రామ్మోహన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాణిక్ రజిత యాదవ్, జానకంపేట సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిలుక రవికుమార్, ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ గాంధారి హనుమంత్ రెడ్డి, జాన్కంపేట్ సహకార సంఘం చైర్మన్ చిక్కెల లక్ష్మణ్, జైతాపూర్ సహకార సంఘం చైర్మన్ కరుటూరి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, మానాల మోహన్ రెడ్డి, విజయ్ కుమార్ గౌడ్, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రావ్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, సహకార సంఘం క్లస్టర్ అధికారిని రమావతి గౌడ్, సహకార సంఘం కార్యదర్శులు రాజారామ్, గంగారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సు

సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే రూ.78,000 వరకు ప్రభుత్వ సబ్సిడీ

- ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు



కమాన్‌పూర్, నవంబర్ 13, (జనంసాక్షి): ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్బీఐ కమాన్‌పూర్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారాహి ఎనర్జీస్ వెండర్ ప్రతినిధులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం వివరాలను స్థానిక ప్రజలకు వివరించారు. ఈ పథకం ద్వారా అర్హులైన గృహ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్టంగా రూ.78,000 వరకు సబ్సిడీ పొందవచ్చని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగంతో ప్రతి నెలా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని, దీర్ఘకాలికంగా ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. అలాగే సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన బ్యాంకు రుణ సదుపాయాలు, లోన్ ప్రాసెసింగ్ విధానం తదితర అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ కమాన్‌పూర్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వారాహి ఎనర్జీస్ ప్రతినిధులు కొండ వెంకటేష్, నీలం శ్రీనివాస్, మల్లరెడ్డి మహేందర్ రెడ్డి, సిద్ధ వెంకటేష్ మరియు ప్రజాప్రతినిధులు గుర్రం లక్ష్మీమల్లు, అనవేన లక్ష్మీ రాజాం, మాదాసు విజయ్, సామ్రాట్, ఎల్లబోయిన రాంమూర్తి పాల్గొన్నారు.

నూతన పింఛన్లతో 458 కుటుంబాలకు ఆర్థిక భరోసా

గంభీరావుపేటలో కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ



గంభీరావుపేట నవంబర్ 13 జనం సాక్షి;
గంభీరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తోందన్నారు. గంభీరావుపేట మండలానికి కొత్తగా 458 పింఛన్లు మంజూరయ్యాయని, ఈ నెల 19 నుంచి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కొత్త పింఛన్ల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. రూ.20,650 కోట్ల రైతు రుణమాఫీతో 25.20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులైన పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హమీద్, గ్రామ సర్పంచ్ మల్లుగారి పద్మ, సింగిల్ విండో చైర్మన్ వేశాల వెంకటి, రాష్ట్ర నాయకులు పర్స హన్మండ్లు, తహసీల్దార్ మారుతి రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్, సింగిల్ విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా దాబాలు, హోటల్స్‌లలో పోలీసుల మెరుపు దాడులు

- అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా మారితే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 13(జనం సాక్షి); జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని దాబాలు, రహదారుల వెంబడి ఉన్న హోటల్స్ లలో గురువారం రోజున రాత్రి పోలీసులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.ఈ తనిఖీల్లో భాగంగా దాబాలు, హోటల్స్ లలో నిర్వహిస్తున్న వ్యాపార కార్యకలాపాలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, సంబంధిత శాఖల అనుమతులు, లైసెన్సుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు.అనుమతులు లేకుండా పర్మిట్ రూములు నిర్వహించడం, అక్రమంగా మద్యం నిల్వ చేయడం, విక్రయించడం, మద్యం సేవించేందుకు అనధికారికంగా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దాబాలు, హోటల్స్ కేంద్రంగా చేసుకుని జూదం, పేకాట, మట్కా తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.అలాగే ప్రధాన రహదారుల వెంబడి ఉన్న దాబాలు, హోటల్స్ వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.దాబాలు, ఇతర వ్యాపార కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత శాఖల అనుమతులు పొందడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు ఏమాత్రం తావులేకుండా, ప్రజల భద్రతకు భంగం కలగకుండా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని, ఆకస్మిక తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులో కరీంనగర్ మహిళా కళాశాల విద్యార్థుల సత్తా

- రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి
- విజేతలకు మేయర్ శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బహుమతుల ప్రధానం



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 13 (జనంసాక్షి) :
డిగ్రీ స్థాయిలో నిర్వహించిన 'జిజ్ఞాస' స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో కరీంనగర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి సత్తా చాటారు. కెమిస్ట్రీ, తెలుగు విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన రెండు వేర్వేరు ప్రాజెక్టులకు ఈ ప్రతిష్టాత్మక బహుమతులు లభించాయి. కెమిస్ట్రీ విభాగం లో డాక్టర్ రావుల మొగిలి పర్యవేక్షణలో "ప్రిపరేషన్ అండ్ ఫిజికో కెమికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఎకో ఫ్రెండ్లీ బయో డిగ్రేడబుల్ పాలిమర్ డిరైవ్డ్ ఫ్రమ్ బనానా పీల్" (అరటి తొక్కల నుండి పర్యావరణ అనుకూల బయో డిగ్రేడబుల్ పాలిమర్ తయారీ) అనే అంశంపై జారా ఫాతిమా, నవ్యశ్రీ, సిరి చందన, వందన, సమీక్ష బృందం ద్వితీయ బహుమతి గెలుచుకుంది. తెలుగు విభాగం లోకాజీపేట వెంకటరమణ పర్యవేక్షణలో "దాశరథి గీతాలు – ఉద్యమ స్ఫూర్తి" అనే అంశంపై ఆర్షిత, కృపామణి, హస్మిత, అర్చన, రమ్య, కోమలత బృందం రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. విజేతలకు మేయర్ శ్రీనివాస్, ఎస్.ఆర్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... డిగ్రీ స్థాయి నుంచే ఇలాంటి ప్రాజెక్టులు చేయడం వల్ల విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తి పెరుగుతుందని, భవిష్యత్తులో మరిన్ని పెద్ద పరిశోధనలు చేసేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ... పీజీ తర్వాత పీహెచ్‌డీలో చేసే పరిశోధనలపై డిగ్రీ స్థాయి నుంచే అవగాహన పెంచుకోవడానికి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి గైడ్‌లను కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

సొంత ఖర్చులతో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు

కౌన్సిలర్ స్పందించకపోవడంతో రంగంలోకి దిగిన 33వ వార్డు కాలనీవాసులు



సిరిసిల్ల టౌన్, నవంబర్ 13 (జనం సాక్షి): ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి విసిగిపోయిన కాలనీవాసులు తాగునీటి సమస్య పరిష్కారానికి తామే నడుం బిగించారు. సిరిసిల్ల పట్టణంలోని 33వ వార్డులో పాడైపోయిన తాగునీటి పైప్‌లైన్‌కు స్థానికులు తమ సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించుకున్నారు. గతంలో కాలనీలోని బోరు మోటార్ ద్వారా పైప్‌లైన్ సహాయంతో ఇళ్లకు తాగునీరు సరఫరా అయ్యేది. ముఖ్యంగా మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో ఈ బోరు నీరే కాలనీవాసులకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడేది. అయితే కొంతకాలంగా పైప్‌లైన్ పలు చోట్ల దెబ్బతినడంతో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ సమస్యను పరిష్కరించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని స్థానిక కౌన్సిలర్‌కు పలుమార్లు విన్నవించినప్పటికీ స్పందన లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు కోరినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇక ప్రజాప్రతినిధుల కోసం ఎదురుచూడకుండా వారే స్వయంగా మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. కాలనీవాసులంతా కలిసి సొంతంగా డబ్బులు సమకూర్చుకుని, పైపులైన్ పాడైన ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టి మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో కొంతకాలంగా నిలిచిపోయిన నీటి సరఫరా తిరిగి ప్రారంభమైంది. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని అందించాల్సిన విషయంలో ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో ప్రజలే తమ సొంత డబ్బులు వెచ్చించి సమస్యను పరిష్కరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు స్పందించి 33వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సభాస్థలి, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్

ఈ నెల 29న భారీ బహిరంగ సభ.. ముఖ్య అతిథిగా కేటీఆర్

కరీంనగర్ టౌన్, నవంబర్ 13, (జనం సాక్షి) : ఈ నెల 29న అలుగునూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీక్షా దివస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సభాస్థలి, పార్కింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తదితర నాయకులతో కలిసి సభా ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సభా వేదిక ఏర్పాటు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఏర్పాట్లను ముందస్తుగా పక్కా ప్రణాళికతో చేపట్టాలని నిర్ణయించారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానుండటంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నట్లు నాయకులు తెలిపారు

మైలారంలో రీ సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న శ్రీనివాస్ రెడ్డి



గన్నేరువరం, నవంబర్ 13 (జనంసాక్షి):
గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని పొలాల వద్దకు నేరుగా వెళ్లిన అదనపు కలెక్టర్, సర్వే పనులు ఎలా జరుగుతు న్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక పరికరాలతో జరుగుతున్న సర్వే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. భూముల హద్దులు, సర్వే నంబర్ల వివరాలను క్షుణ్ణంగా చెక్ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, వారి సమస్యలు, అభ్యంతరాలను స్వయంగా విన్నారు. రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, పారదర్శకంగా, కచ్చితంగా సర్వే చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం ఎమ్మార్వో ఇప్ప నరేందర్, ఆర్ఐ రఘు, రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిపిన ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని యువకుడి మృతి

చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో కన్నుమూత.. పోలీసుల కేసు నమోదు.. దర్యాప్తు



గంభీరావుపేట, నవంబర్ 13 (జనంసాక్షి): రహదారిపై హెచ్చరిక సూచికలు లేకుండా నిలిపిన ట్రాక్టర్ ట్రాలీని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. గంభీరావుపేట మండలం రాజేశ్వరరావు కాలనీ సమీపంలో నవంబర్ 12న సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సయ్యద్ జావేద్ హుస్సేన్ (35) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించ గా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ట్రాక్టర్ ట్రాలీలను రహదారులపై నిలిపేటప్పుడు లైట్లు, రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక సూచికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ముందడుగు

- జిపి భవనాన్ని ప్రారంభించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతిరెడ్డి



బొంరాస్‌పేట, నవంబర్ 13 (జనం సాక్షి) : గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందడుగు వేస్తున్నారని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని కట్టు కాలువ తండాలో రూ.30 లక్షల కాడ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి,కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,విబిజిరాంజీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్,స్థానిక సర్పంచ్ కిషన్ నాయక్ తో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవి నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంజిల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ చంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాలలు భారీ లక్ష్యాలను నిర్దేశించుకొని సాధనకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 13 (జనం సాక్షి) : బాలలు పెద్ద పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్స్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ముందుగా చాచా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14న భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని జరుపు కుంటున్నామని తెలిపారు. విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లల ప్రతిభను ప్రోత్సహిం చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో పెద్ద పెద్ద కలలు కనాలని, భవిష్యత్తులో తాము ఏ స్థాయికి చేరుకోవాలనుకుంటున్నారో ఇప్పటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. రాకెట్ సైంటిస్టులు, జిల్లా కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు, ప్రొఫెసర్లు, గొప్ప పారిశ్రామికవేత్తలు కావాలనే ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని అన్నారు. అయితే కలలు కనడంతోనే సరిపోదని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కష్టపడి చదవాలని సూచించారు.విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై సమాన ఆసక్తి పెంచుకోవాలని, తమకు ఇష్టమైన విషయాల్లో మరింత ప్రతిభ కనబరుస్తూనే, కష్టంగా భావించే సబ్జెక్టులను కూడా శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు. ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, ఉపాధ్యాయులను ప్రశ్నలు అడుగుతూ విషయాలను లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు. పుస్తక జ్ఞానంతో పాటు సమాజం, పరిసరాలు, దేశంలో జరుగుతున్న విషయాలపై కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు. అదేవిధంగా కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని కలెక్టర్ సూచించారు. ఇతరులలోని భిన్నత్వాన్ని గౌరవించాలని, ఎవరినీ తక్కువ చేసి చూడకూడదని, తోటి విద్యార్థులను వేధించడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో అనవసరమైన రీల్స్, సోషల్ మీడియా, గేమ్స్‌కు ఎక్కువ సమయం కేటాయించకుండా, విజ్ఞానాన్ని పెంపొందించే సైన్స్, గణితం, విద్యా సంబంధిత వీడియోలను వీక్షించాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, పాఠశాలల్లోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పుస్తక పఠనం వల్ల ఆలోచనా పరిధి, సృజనాత్మకత, జ్ఞానం



పెరుగుతాయని తెలిపారు.
విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, విజేతలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీఈఓ గోవింద రాజులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈఓ బాలాజీ, ఏ ఎం వో విద్యా సాగర్, రాజేంద్ర కుమార్, డీ సీ పీ వో కరిష్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా ప్రారంభమైన 'అన్వేషణ్-2026'

- దక్షిణాది 20 విశ్వవిద్యాలయాల నుంచి 788 మంది యువ పరిశోధకుల హాజరు
- సైన్స్, టెక్నాలజీ, వైద్య, వ్యవసాయ రంగాలతో పాటు ఏడు విభాగాల్లో పోటీలు

సికింద్రాబాద్, నవంబర్ 13 (జనం సాక్షి) : యువ పరిశోధకుల్లో శాస్త్రీయ ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు, పరిశోధనా నైపుణ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'అన్వేషణ్-2026 సౌత్ జోన్ స్టూడెంట్ రీసెర్చ్ కన్వెన్షన్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ), ఉస్మానియా విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో రెండు రోజులపాటు (నవంబర్ 13, 14) ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోని 20 విశ్వవిద్యాలయాల నుంచి 788 మంది యువ పరిశోధకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మాజీ ఐపీఎస్ అధికారి, సామాజికవేత్త వి.వి. లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. అమెరికాకు చెందిన సివెంటికెమ్ సంస్థ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ భాస్కర్ రావు వెనెపల్లి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.వి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువ పరిశోధకులు శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, పట్టుదలతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. దేశ భవిష్యత్తు కేవలం



ఉద్యోగాలు కోరుకునే యువతపైనే కాకుండా నూతన ఆవిష్కరణలు చేసే వారు, సమస్యలకు పరిష్కారాలు చూపేవారు, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలపై ఆధారపడి ఉందన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని, తమ సంతకమే ఆటోగ్రాఫ్‌గా మారే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సానుభూతితో స్పందించాలని కోరారు. విశిష్ట అతిథి డాక్టర్ భాస్కర్ రావు వెనెపల్లి మాట్లాడుతూ విద్యాసంస్థల్లో జరిగే పరిశోధనలకు, పరిశ్రమల అవసరాలకు మధ్య అనుసంధానం మరింత బలోపేతం కావాలని అన్నారు. సమాజానికి, వాణిజ్య రంగానికి ఉపయోగపడే ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఏఐయూ రీసెర్చ్ డివిజన్ జాయింట్ డైరెక్టర్, డైరెక్టర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ అమరేంద్ర పానీ మాట్లాడుతూ యువతలో పరిశోధనా నైపుణ్యాలను వెలికితీసి ప్రోత్సహించడంలో అన్వేషణ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విసి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా నూతన ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ విద్యా పరిజ్ఞానాన్ని సమాజంలోని సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని, 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో బేసిక్ సైన్సెస్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హెల్త్ సైన్సెస్, వ్యవసాయం, సామాజిక శాస్త్రాలు, హ్యుమానిటీస్, కామర్స్ అండ్ లా, ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 3డీ ప్రింటింగ్, ప్రోటోటైప్స్ తదితర ఏడు విభాగాల్లో పరిశోధనా పోటీలు నిర్వహిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్టీయూహెచ్, విఐటీ-ఏపీ, ఎస్ఆర్ఎం, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌తో పాటు పలు ప్రముఖ విద్యాసంస్థల పరిశోధకులు తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్నారు. కార్యక్రమంలో యూజీసీ అఫైర్స్ డీన్, డెవలప్‌మెంట్ డీన్, కన్వెన్షన్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బి. లావణ్య, కో-కోఆర్డినేటర్ డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి, కో-కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్ గుప్తా, ప్రొఫెసర్ ఏ. పాట్రిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, నవంబర్ 13 (జనం సాక్షి) : ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్లో పలు కాలనీలలో కోటి 45 లక్షలతో పలు అభివృద్ధి పనులను తాజా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమవారం శేఖర్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం డా. ఏఎస్ రావు నగర్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, చిన్నారులకు ఆటస్థలాలు, యువతకు వ్యాయామ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన తెలిపారు.



ఈ అభివృద్ధి పనుల ద్వారా స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. చిన్నారులకు సురక్షితమైన ఆట స్థలాలు కల్పించడంతో పాటు కాలనీల్లో రహదారి సదుపాయాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి కాసం మైపాల్ రెడ్డి, బేతాళ బాల్‌రాజ్ , షేర్ మనమ్మ, అధికారులు డి బాలకృష్ణ, ఏఈ కీర్తి రెడ్డి , కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు, పాల్గొన్నారు.

తెలంగాణ బాలోత్సవాలను జయప్రదం చేయండి

- ఈ నెల 20, 21 తేదీల్లో ఆరో బాలల జాతర
- 10 వేల మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం..
- 25 రకాల పోటీలు..

ముషీరాబాద్, నవంబర్ 13 (జనం సాక్షి) : ఈ నెల 20, 21 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఆరో తెలంగాణ బాలోత్సవాలను (బాలల జాతర) జయప్రదం చేయాలని బాలోత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్. సోమయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ



జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గత ఆరేళ్లుగా బాలోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి జరిగే బాలోత్సవాలను భాషా సాంస్కృతిక శాఖ మాజీ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేవీ రమణాచారి, సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.
నగరవ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న సుమారు 10 వేల మంది విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 6 వేల మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. పాఠశాలలకు సెలవులు ఉన్న నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు వెల్లడించారు. బాలోత్సవాల్లో విద్యార్థులలోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో వ్యాసరచన, కథారచన, చెస్, బతుకమ్మ, గీతాలాపన, మ్యూజికల్ చైర్ తదితర 25 రకాల పోటీలు నిర్వహించనున్నట్లు సోమయ్య వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాలోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భరత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బాలోత్సవాల అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కోశాధికారి బుచ్చిరెడ్డి, సహాయ కార్యదర్శి సుజాత, మహేష్ దుగ్గే, బ్రహ్మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమిష్టి పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
- ఉద్యమకారులందరికీ గుర్తింపు, గౌరవం కల్పించడమే కేకే కమిటీ లక్ష్యం..

ముషీరాబాద్, నవంబర్ 13 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధన ఏ ఒక్కరి వల్లనో సాధ్యమైందన్న ప్రచారం సరికాదని, రాష్ట్ర ఏర్పాటు ప్రజలందరి సమిష్టి పోరాట ఫలితమని ఎమ్మెల్సీ, ఉద్యమకారుల కేకే కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ గుర్తింపు, గౌరవం కల్పించడమే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముంబై తెలంగాణ



ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో కేకే కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముంబై, భివండి, నవీ ముంబై, సూరత్ ప్రాంతాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ముంబై జేఏసీ చైర్మన్ మూలవాసి మాల, వైస్ చైర్మన్ కాసుల నర్సింహ గౌడ్‌తో పాటు పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ ముంబైలో నివసిస్తున్న తెలంగాణ ఉద్యమకారులకు సమన్యాయం చేయాలని, వారికి సముచిత గుర్తింపు, స్థానం కల్పించాలని కోరారు. వలస కార్మికులు, వారి కుటుంబాల అభివృద్ధికి చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పాటు వలస బంధు పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేకే కమిటీ సభ్యులు మోతే శోభన్ రెడ్డి, రాములు నాయక్ లు మాట్లాడుతూ నిజమైన ఉద్యమకారులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అన్ని అంశాలను, వివిధ కోణాలను పరిశీలించి అర్హులకు న్యాయం చేసే దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఉద్యమకారులు ఆందోళన చెందకుండా సంయమనం పాటించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమంలో ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజలే కీలక పాత్ర పోషించారని అన్నారు. ఉద్యమ చరిత్రను ప్రామాణికంగా తీసుకుని అర్హులైన ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దెల సాయిబాబా, కట్ల నర్సయ్య, రాందాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో రైతుకు నష్టం

- ఆరు ఎకరాల్లో వరి పంట దిగుబడి శూన్యం



యాలాల, నవంబర్ 13 (జనం సాక్షి) : నాసిరకం వరి విత్తనాలు విక్రయించడంతో ఆరు ఎకరాల్లో పంట దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయానని దేవనూరు గ్రామానికి చెందిన రైతు మంత్రి ఎల్లప్ప ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేసి, న్యాయం చేయాలని కోరారు.దేవనూరు శివారులోని సర్వే నంబర్లు 66, 67లో ఉన్న తన ఆరు ఎకరాల భూమిలో సాగు చేసేందుకు తాండూరులోని లక్ష్మీ నరసింహ స్వామి సీడ్స్ దుకాణంలో వరి విత్తనాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. వాటిని సాగు చేసినప్పటికీ పంట సక్రమంగా ఎదగక, గింజలు పట్టక దిగుబడి పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో లక్షలాది రూపాయల పెట్టుబడి నష్టపోయానని పేర్కొన్నారు.వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని, విత్తనాల నాణ్యతపై విచారణ జరిపి బాధ్యులైన దుకాణ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తగిన పరిహారం అందించాలని ఫిర్యాదులో కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్లయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మహేందర్, రైతులు మంత్రి ఎల్లప్ప, పిట్ల లక్ష్మప్ప, పిట్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంజీఆర్ పాదయాత్ర



ఖైరతాబాద్, నవంబర్ 13 (జనం సాక్షి) : ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జవహర్ కాలనీ, ఇంద్రానగర్ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజీఆర్) శుక్రవారం ఉదయం పాదయాత్ర నిర్వహించారు. 'సమస్యలపై సమరం' కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డీసిల్టింగ్ పనులు సక్రమంగా జరగకపోవడం, స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ ఛానల్ దెబ్బతినడం, వీధి దీపాల కొరత కారణంగా ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. అనంతరం సంబంధిత మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శంకర్, బాబు, బాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని జిల్లా అంతటికీ విస్తరించాలి

తాండూరు, నవంబర్ 13 (జనంసాక్షి) : కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని జిల్లా అంతటికీ విస్తరించాలని బిజెపి జిల్లా అధ్యక్షులు యు. రమేష్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా రైతుల సాగునీటి కష్టాలపై బిజెపి జిల్లా అధ్యక్షులు యు. రమేష్ కుమార్ విలేకరుల సమావేశంలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్రంలో అత్యల్ప తలసరి ఆదాయం కలిగిన వెనుకబడిన వికారాబాద్ జిల్లాలో రైతులు కేవలం వర్షాధార పంటలైన కంది, పెసర, మినుములకే పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.భూగర్భ జలాల క్షీణతకు కారణం ప్రాజెక్టులు లేకపోవడమే.జిల్లాలో బోర్లన్నీ ఎండిపోయి, భూగర్భ జలాలు పాతాళానికి పడిపోవడంతో తాగునీటికి సైతం కటకటలాడే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో రిజర్వాయర్లు, సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడమే దీనికి అసలు కారణమని స్పష్టం చేశారు. వర్షం పడితే నీరంతా వృథాగా వాగుల్లో పారిపోతోంది తప్ప, నీటిని నిల్వ చేసే వ్యవస్థ లేక భూమిలోకి ఇంకే మార్గం లేకుండా పోయిందన్నారు. రిజర్వాయర్లు నిర్మించి కృష్ణమ్మ జలాలు ఈ నేలపై పారితేనే భూగర్భ జలాలు పెరిగి జిల్లా సస్యశ్యామలమవుతుందని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు..

కొడంగల్ ఎత్తిపోతల విస్తరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు భూత్పూర్ (భీమా రిజర్వాయర్) నుండి నీటిని తరలించడం అభినందనీయమే అయినప్పటికీ, పక్కనే ఉన్న తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు కూడా ఈ పథకాన్ని వెంటనే అనుసంధానించాలి.
పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి పరిగి ప్రాంత రైతులు రెండు పంటలు పండించుకునేలా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, తాండూరులో పెండింగ్‌లో ఉన్న శివసాగర్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలి.

కాగ్నా నది జలాల సద్వినియోగం....

వికారాబాద్ నియోజకవర్గంలోని నాగారం వద్ద కాగ్నా నదిపై మన్నెకుచ్చల ప్రాజెక్టుతో పాటు చిన్న చెక్ డ్యామ్‌లు నిర్మించి, ఏటా కర్ణాటకకు వృథాగా తరలిపోతున్న 4 టీఎంసీల నీటిని ఒడిసిపట్టాలి.

ప్రజాప్రతినిధులు మౌనం వీడాలి

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, మార్పు కోరుకుని ప్రజలు గెలిపించిన ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం నియోజకవర్గ నీటి సమస్యలపై



మౌనంగా ఉండటం సరికాదని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై ఉన్న శ్రద్ధ రైతులకు సాగునీరు అందించడంపై ఉండాలని హితవు పలికారు. ఎమ్మెల్యేలు ఇప్పటికైనా కుంభకర్ణ నిద్ర వీడి జిల్లాకు నీళ్లు తెస్తే ఆ క్రెడిట్ వారికే దక్కుతుందన్నారు. లేనిపక్షంలో పార్టీలు, జెండాలకు అతీతంగా 'సాగునీరు' అనే ఒకే ఎజెండాతో రైతులందరినీ ఏకం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు యు. రమేష్ కుమార్ తో పాటు పార్టీ నాయకులు, అధ్యక్షులు, ఫ్లోర్ లీడర్, నాగారం మల్లేశం, బంటారం భద్రేశ్వర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 నవంబర్ 2026

స్పా ముసుగులో వ్యభిచారం

ఇద్దరు నిర్వాహకులపై చర్యలు

□ ఒకరి అరెస్ట్.. మరొకరు కోర్టులో లొంగుబాటు

అమీర్ పేట్ (జనంసాక్షి) : స్పాలు, బ్యూటీ సెలూన్ల ముసుగులో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై పంజాగుట్ట పోలీసులు చర్యలు చేపట్టారు. పలు నెలలుగా పరారీలో ఉన్న ప్రధాన నిర్వాహకుడు నాగవెల్లి గౌతమ్ (47)ను అరెస్ట్ చేశారు. శ్రీనగర్ కాలనీలోని హై-ఫైవ్ బ్యూటీ సెలూన్‌లో అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కేసులో అతడిని పట్టుకుని, ఒప్పో మొబైల్ ఫోన్, సిమ్ కార్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు క్రైమ్ నంబర్ 160/2026గా కేసు నమోదు చేశారు. మరో కేసులో మోడల్ హౌస్ సమీపంలోని గౌతమ్ ఆయుర్వేదిక్ యునిసెక్స్ సెలూన్ యజమాని తిటు రాజు (29) పరారీలో ఉండగా, తాజాగా కోర్టులో లొంగిపోయాడు. దీంతో న్యాయస్థానం అతడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసు క్రైమ్ నంబర్ 629/2026గా నమోదైంది. స్పాలు, బ్యూటీ సెలూన్ల ముసుగులో మానవ అక్రమ రవాణా, వ్యభిచార కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీసులు హెచ్చరించారు. యజమానులు అద్దెదారుల వివరాలు, పూర్వాపరాలు పరిశీలించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పీఐటీ చట్టం సెక్షన్ 18 ప్రకారం భవనాలను మూసివేయడంతో పాటు యజమానులపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

16న అగ్రికల్చర్ కోర్సు ప్రవేశాలకు కౌన్సెలింగ్


హైదరాబాద్, నవంబర్ 13 (జనంసాక్షి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ) అనుబంధ కళాశాలల్లో బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులోని 60 స్పాన్సర్డ్ సీట్ల భర్తీకి ఈనెల 16న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న వాటర్ మేనేజ్‌మెంట్ యూనిట్, సెంటర్ ఫర్ నేచురల్ రిసోర్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆడిటోరియంలో కౌన్సెలింగ్ నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ సోమ వారం ఉదయం 9.30 గంటల్లోగా కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలన్నింటినీ వెంటతీసుకు రావాలని తెలిపారు.

కౌన్సెలింగ్‌కు సంబంధించిన సూచనలు, పూర్తి వివరాలను సొసైటీ అధికారిక వెబ్‌సైట్ https://mjptbcwreis.telangana.gov.inలో పొందవచ్చని వెల్లడించారు.

యాచారం, బండరావిరాలపై చెత్తపిడుగు

14 మెగావాట్ల వ్యర్థ విద్యుత్ ప్లాంట్‌కు సన్నాహాలు

□ సాగర్, విజయవాడ రహదారులపై రోజూ 700 టన్నుల చెత్త లారీలు



ప్రతిపాదిత ప్రాంతంగా అనుమానిస్తున్న యాచారం ప్రాంతం



రంగారెడ్డి, నవంబర్ 13 (జనంసాక్షి): పచ్చని పంట పొలాలు, ప్రశాంతమైన పల్లెలకు నిలయమైన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంపై చెత్త ముప్పు ముంచుకొస్తోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. యాచారం మండల కేంద్రంలో 25 ఎకరాల విస్తీర్ణంలో 14 మెగావాట్ల వ్యర్థాల ఆధారిత విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటంతో స్థానికుల్లో కలవరం మొదలైంది. హైదరాబాద్ నుంచి రోజూ 700 టన్నుల చెత్తను తరలించనున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో దుర్వాసన, వాయు, భూగర్భ జలాల కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని రైతులు, గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాజెక్టును అడ్డుకుంటామని బీఆర్ఎస్ ప్రకటించింది.

పాత ప్రాజెక్టుకు మళ్లీ ప్రాణం

యాచారం మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్టు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు 2010లోనే అప్పటి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. అయితే పర్యావరణం, ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందన్న ఆందోళనతో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించడంతో ప్రాజెక్టు నిలిచిపోయింది. తాజాగా హైదరాబాద్ చెత్త నిర్వహణలో భాగంగా ఈ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. డిసెంబర్‌లో శంకుస్థాపనకు సన్నాహాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. 2025 జూన్ 9న జీహెచ్ఎంసీ ఈ ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం జారీ చేసినట్లు సమాచారం. రోజుకు 700 టన్నుల వ్యర్థాలను సరఫరా చేసేలా ఒప్పందం కుదిరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు పురోగతిపై అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ గతేడాది జూన్ 12న జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు నివేదిక సమర్పించినట్లు సమాచారం.

ఉద్యమానికి బీఆర్ఎస్ సన్నద్ధం

ఇప్పటికే బండరావిరాలలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చారని, తాజాగా యాచారంలో చెత్త విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా నియోజకవర్గాన్ని చెత్త కేంద్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం మీదుగా సాగర్, విజయవాడ ప్రధాన రహదారులపై చెత్త లారీల రాకపోకలతో ప్రజలకు ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. యాచారం ప్లాంట్, బండరావిరాల డంపింగ్ యార్డు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులు, ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని, 2010లో అడ్డుకున్న ప్రాజెక్టును మళ్లీ అనుమతించబోమని హెచ్చరించారు.

మావోయిస్టు ప్రభావం నుంచి అభివృద్ధి వైపు భద్రాద్రి

□ 2014-2026 మధ్య 829 మంది అరెస్టు

□ 918 మంది లొంగుబాటు



కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 13 (జనంసాక్షి) : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో హింసను తగ్గించి అభివృద్ధి, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తరించడమే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు యంత్రాంగం, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని పత్రికా సమాచార కార్యాలయం సంయుక్తంగా శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో 'నక్సల్ ముక్త్ భారత్' అంశంపై మీడియా సదస్సు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఎస్పీ సింధు శర్మ, పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలు, అరెస్టులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. లొంగుబాట్లు, హింసాత్మక ఘటనలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. గతంలో మావోయిస్టుల దాడులు, హింసాత్మక ఘటనల్లో 868 మంది సామాన్య పౌరులు, 331 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. రహదారులు, వంతెనల ధ్వంసంతో మారుమూల గ్రామాలకు రవాణా, వైద్యం, విద్యా సదుపాయాలు దూరమయ్యాయని వివరించారు. 2014 నుంచి 2026 వరకు జిల్లాలో 829 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, 27 ఎదురుకాల్పుల ఘటనల్లో 57 మంది మావోయిస్టులు మరణించారు. ఇదే కాలంలో 918 మంది మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. లొంగిపోయిన వారికి వ్యవసాయ భూమి, ఇంటి స్థలం, ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి అవకాశాలతో ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోందని తెలిపారు. సదస్సుకు హాజరైన మాజీ మావోయిస్టులు పునరావాసంతో తమ జీవితాల్లో వచ్చిన మార్పులను వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, బీటీ రోడ్లు, చిన్న పరిశ్రమలు, రైస్ మిల్లుల ఏర్పాటుతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, క్రీడా సామగ్రి పంపిణీ, గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఉచిత మందులు, తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నారు. వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందించడంతో పాటు క్రీడలు, సామాజిక కార్యక్రమాల ద్వారా యువతను సానుకూల మార్గంలో ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



పాఠశాల భూ పరిరక్షణకు జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

కుత్బుల్లాపూర్, నవంబర్ 13 (జనం సాక్షి) : ప్రగతి నగర్ జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భూ పరిరక్షణ కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రగతి నగర్ జయంతి యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, జేఏసీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆల్విన్ చౌరస్తా మీదుగా వాసవి లేఅవుట్ వరకు సాగింది. ఈ సందర్భంగా పాఠశాల స్థలాన్ని1.06 ఎకరాలు కాపాడాలని, పాఠశాల భూమిని ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేయాలని, పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. పాఠశాల స్థలంపై వస్తున్న ఆక్రమణ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి, ప్రభుత్వ పాఠశాల భూమిని పూర్తి స్థాయిలో పరిరక్షించాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ ర్యాలీకి సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ భూపతిరెడ్డి మాట్లాడుతూ, పాఠశాల స్థలాన్ని కాపాడేందుకు తాము బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమం చివరలో డీఈఓ వ్యవహరించిన తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు, జేఏసీ నాయకులు తీవ్ర అసంతృప్తి, మనస్తాపం వ్యక్తం చేశారు. పాఠశాల స్థలాన్ని పరిరక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు తగిన శ్రద్ధ చూపకపోవడం విచారకరమని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. పాఠశాల స్థలాన్ని ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేసి, పూర్తి స్థాయిలో పరిరక్షించే వరకు తమ పోరాటం ఆగదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రగతి నగర్ జయంతి యాక్షన్ కమిటీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఫ్యూచర్ సిటీలో 20 ఎకరాలు కేటాయించాలి

□ బంజారా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం రాథోడ్

మహేశ్వరం, నవంబర్13(జనం సాక్షి) : ఫ్యూచర్ సిటీలో బంజారాలకు 20 ఎకరాల భూమి కేటాయించాలని బంజారా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం రాథోడ్ అన్నారు.శుక్రవారం తుక్కుగూడలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ ను బంజారా సేవాదళ్ నాయకులతో కలిసి కేఎల్ఆర్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బంజారా సేవాదళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేష్ నాయక్,రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ నాయక్,రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్,పాపయ్య నాయక్, అన్నోజిగూడ గ్రామ సర్పంచ్ రమావత్ సురేష్ నాయక్, బంజారా సేవాదళ్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్‌కు బేగంపేట విద్యార్థులు

సిద్దిపేట (జనంసాక్షి) : మారుమూల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ జాతీయ స్థాయిలో సైన్స్ ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన సిద్దిపేట జిల్లా రాయపోల్ బేగంపేట విద్యార్థులకు అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 14న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆహ్వానం అందింది. జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లు, విజ్ఞాన ప్రదర్శనల్లో విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలు, నూతన ఆవిష్కరణల ఫలితంగా ఈ అవకాశం దక్కిందని ప్రధానోపా ధ్యాయురాలు ప్రమీల తెలిపారు.

సాయిరెడ్డి నగర్‌లో డంపింగ్ నిలిపివేయాలి

□ జవహర్‌నగర్‌కు ట్రాన్స్‌ఫర్ పాయింట్ తరలించాలి

□ 20లోగా నివేదిక ఇవ్వాలని ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశం

అల్వాల్, నవంబరు 13 (జనంసాక్షి): మచ్చబొల్లారం సాయిరెడ్డి నగర్‌లోని చెత్త డంపింగ్ కేంద్రాన్ని తక్షణమే నిలిపివేసి, సెకండరీ కలెక్షన్ అండ్ ట్రాన్స్‌ఫర్ పాయింట్‌ను జవహర్‌నగర్‌కు తరలించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) ఆదేశించింది. కాప్రా మండలం జవహర్‌నగర్ సర్వే నంబరు 168/పిలో గుర్తించిన రెండెకరాల భూమిని మున్సిపల్ శాఖకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను నిర్దేశించింది. ఈ మేరకు నవంబరు 10న జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అమలు నివేదికను నవంబరు 20లోగా సమర్పించాలని స్పష్టం చేసింది.

సాయిరెడ్డి నగర్‌లోని సర్వే నంబరు 199లో ఐదెకరాల స్థలంలో బయో వ్యర్థాలు, సెప్టిక్ వ్యర్థాలు, పశువుల కళేబరాలను పారబోస్తున్నారని స్థానికులు మనోజ్ బెరా, రోహిత్ వక్రాల ఫిర్యాదు చేశారు. 2003లో అప్పటి అల్వాల్ పురపాలక సంఘం చేసిన తీర్మానం ఆధారంగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నప్పటికీ, డంపింగ్‌కు అవసరమైన చట్టబద్ధమైన అనుమతులు, పర్యావరణ క్లియరెన్స్ ఉన్నట్లు ఆధారాలు లేవని కమిషన్ గుర్తించింది. ఈ వ్యవహారం ప్రజల జీవించే హక్కు, ఆరోగ్యకరమైన పర్యావరణ హక్కులకు భంగం కలిగిస్తోందని అభిప్రాయపడింది.

ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలనలో భాగంగా నవంబరు 6న ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యురాలు, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. జవహర్‌నగర్‌లోని రెండెకరాల స్థలం జనావాసాలకు దూరంగా ఉండటంతో ట్రాన్స్‌ఫర్ పాయింట్‌కు అనుకూలమని గుర్తించారు. కొత్త కేంద్రంలో చట్టబద్ధమైన నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు పాటించాలని కమిషన్ ఆదేశించింది. ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశాలు జారీ చేయడంపై జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) హర్షం వ్యక్తం చేసింది. స్మశానవాటిక పరిరక్షణ కోసం ప్రజలు సాగించిన పోరాటానికి ఇది విజయమని పేర్కొంది. పోరాటా నికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యురాలు సాయాన్ని విజయభారతికి కృతజ్ఞతలు తెలిపింది. ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

15రోజుల ఖర్చుతో నెలరోజుల ప్రయాణం

మహిళలకు భారీ డిస్కౌంట్..

□ ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ బంపర్ ఆఫర్..



ముషీరాబాద్, నవంబర్ 13 (జనంసాక్షి): రోజువారీ బస్సు ప్రయాణాన్ని మరింత పొదుపుగా, సులభంగా, సౌకర్యవంతంగా మార్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ప్రయాణికులకు భారీ శుభవార్త అందించింది. సంస్థ తమ నెలవారీ సీజన్ టికెట్ (మీ) పథకం కింద 09 అదనపు సౌకర్యాలు, ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ఈ సవరించిన నిబంధనలు శనివారం14 నవంబర్ 2026 నుండి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, నిత్య ప్రయాణికులకు ఈ నిర్ణయం ఆర్థికంగా ఎంతో ఊరటనివ్వ నుంది. ఈ నూతన నిర్ణయాల ప్రకారం, నెలవారీ సీజన్ టికెట్ల జారీకి ఇప్పటివరకు ఉన్న దూర పరిమితిని టీజీఎస్ ఆర్టీసీ పూర్తిగా తొలగించింది. నిర్దేశించిన రూట్ మరియు ఛార్జీల నిబంధనలకు లోబడి, ప్రయాణికులు ఇకపై ఎలాంటి దూర పరిమితి లేకుండా నెలవారీ సీజన్ టికెట్లను పొందవచ్చు. పాస్ ధరలను మరింత తగ్గించే క్రమంలో టోల్ ప్లాజా ఛార్జీలను ప్రస్తుతం ఉన్న 25 రోజులకు బదులుగా కేవలం 20 రోజులకు మాత్రమే లెక్కించనున్నారు. అంతేకాకుండా, సాధారణ ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ ఎంపికను అందించేందుకు డీలక్స్ నెలవారీ సీజన్ టికెట్లను టీజీఎస్ ఆర్టీసీ ప్రవేశపెడుతోంది. ఈ పాస్‌లు 'ఇ-డీలక్స్' సర్వీసులలో ప్రయాణానికి కూడా చెల్లుబాటు అవుతాయి. ఇక నెలవారీ సీజన్ టికెట్ హోల్డర్లకు ప్రత్యేక ప్రయోజనంగా హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ మరియు కరీంనగర్ నగరాల్లో నడిచే అన్ని కేటగిరీల సిటీ బస్సు సర్వీసులలో ఆదివారాల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును కల్పించారు. అయితే, ఈ సౌకర్యం గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు, ఇతర ప్రభుత్వ సెలవు దినాలకు వర్తించదు.

హోటల్ వ్యర్థాలతో వంటగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీ



□ వినూత్న బయోగ్యాస్ ప్లాంట్ ప్రారంభం

□ రోజుకు 125 కిలోల ఆహార వ్యర్థాల శుద్ధి..

□ నెలకు 4.5 టన్నుల కార్బన్ ఉద్గారాల తగ్గింపు

హబ్సిగూడ / ఉప్పల్, నవంబర్ 13 (జనం సాక్షి): హోటళ్లలో వృథాగా పడుతున్న ఆహార వ్యర్థాలను వంట ఇంధనంగా, సేంద్రియ ఎరువులుగా మార్చే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీమ్ స్వచ్ఛ మల్కాజిగిరి, సీఎస్ఐఆర్-ఐఐసీటీ సంయుక్తంగా రోజుకు 125 కిలోల ఆహార వ్యర్థాలను ప్రాసెస్ చేసే బయోగ్యాస్ ప్లాంట్‌ను ప్రారంభించాయి. ఈ ప్లాంట్ ద్వారా హోటళ్ల నుంచి సేకరించిన ఆహార వ్యర్థాలను వంటగ్యాస్‌గా మార్చడంతో పాటు, నెలకు 3 వేల లీటర్ల సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేయనున్నారు. తద్వారా నెలకు 4.5 టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉంది. వ్యర్థాల నిర్వహణలో పర్యావరణహిత విధానాలను ప్రోత్సహిస్తూ, స్వచ్ఛ మల్కాజిగిరి కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370